ఆంధ్రప్రదేశ్

ఫిబ్రవరి, 1977

వెల : 50 పైసలు



కందుకూరి వీరేశలింగం



(తరువాయి 3వ కవరు పేజీలో)

ఆంధ్రప్రదేశ్

సంపుటి : 21 | ఫిబ్రవరి, 1977 పుష్య-మాఘ 1898 శా.శ. | సంచిక : 4

ప్రధాన సంపాదకులు :

శ్రీరాజ్యం సిన్హా

సంపాదకులు :

కుందుర్తి ఆంజనేయులు

ముఖచిత్రం : దేవతలు దిగివచ్చారు (బాలభవన్ బొమ్మలు)
(ఫోటో : శ్రీ ఎం. మురళీధరా చార్యులు)

రెండు,మూడు కవరుపేజీలు : వీరేశలింగం జీవిత చరిత్ర
(బుజ్జాయి బొమ్మల చిత్రాలు)

చివరి కవరుపేజీ : ఉదయ కిరణాలు
(ఫోటో : ఎస్. ఎ. అహ్మద్, రాజమండ్రి)

మధ్య పేజీల్లో : యువజన నాయకుడు శ్రీ సంజయ్‌గాంధీ
ఆంధ్రప్రదేశ్ పర్యటన (సచిత్ర వ్యాసం)

రిజిస్టరు నెం : హెచ్. హెచ్. డి. 81

వెల: 50 పైసలు

సాలుచందా : ఆరు రూపాయలు

ప్రచురణ :
డైరెక్టర్,
సమాచార, పౌర సంబంధ శాఖ,
హైదరాబాద్

ముద్రణ :
డైరెక్టర్,
కేంద్ర ముద్రణాలయం,
హైదరాబాద్.

52-1

ఈ సంచికలో...

పేజీ

వానలో నా మనస్సు నీకోసం

—కుమారి వుడత్తు సత్యసావిత్రి

ప్రొద్దుటి నుంచీ
ఎడ తెరిపి లేకుండా
ఒకటే వాన!
ఆ ఒకటే వానలో
పాపం!
రెండు పంచుల బరువుతో
నగం నగం తడుస్తూ
వణికించే నీ ఉత్తరం
అందించాడు పోస్ట్‌మేన్.
యింటక్కా వానలో
కాగితం పడవలతో
ఆడుకుంటున్న నేను
వాటిలో బోట్ షికారు
చేస్తే ఎలా వుంటుందో
వాటర్ కలర్స్‌తో వూహించుకుంటున్నాను.
లేఖ విప్పేసరికి
నీ అక్షరాలు కురిపిస్తున్న
లక్షలాది జీధార్తుల
కన్నీటి జడివానకి
నా కాగితం పడవలు కాస్తా
కొట్టుకు పోయాయి.
నేటి నుంచీ మరెన్నడూ
నీ లేఖల్లో నాకు
కన్నీళ్ళు 'రవాణా'
చెయ్యకుండా
నాకు నేను రక్షణ కల్పించుకోవటం కోసం
మనసా, వాచా మానవతా వాదినైన
నీకో మంచి కబురు చెబుదామని
పయనం మొదలు పెట్టింది
వానలో నా మనస్సు నీకోసం !!
యిక నుంచీ ....
నీకు నీళ్ళందించే
గిరికుమారి నీలి కూడా
సరిగంచు నీలి చీర
కట్టుకోగలదని,
మీ పాలబ్బాయి యదు
వేణువుపై సశాస్త్రీయంగ
రాగాలు మేళవించటానికి
మెట్లు కట్టుకోగలదనీ,
వంద గ్రాములకీ యింతే వుందేమంటూ
తూనికల తేడా కోసం
వందమార్లు గొంతు చించుకుని
నీ సుధా పూర్ణస్వరం
గార్దభ స్వరానికవరావతారంగ
మారే గండం మరి తప్పిందనీ,
మీ ప్రక్కింట్లో పేరి. వెంకిల
వెట్టిచాకిరీకి గట్టు పడిందనీ
చెబితే వెర్రి ఆనందం
కలగదూ నీకు ?
నిలువ నీడ కోసం
చిన్న గూడైనా లేని
యీ నోరున్న మూగ జీవాల
గతి యింతే నంటావా ?
అని నన్ను ప్రశ్నించేటప్పుడు
నీ కన్నులలో తొంగిచూసే
నీలి నీడలకి మారుగ
వెన్నెల రేకులు విప్పుకోవటం కోసం
మడుపు లేకుండానే మహాలక్ష్మి
మామూలు మనుష్యుల కందే
మహత్తర పథకం వచ్చిందనీ,
అరణ్య సంపద నమ్ముతూ
దళారీల చేతికి చిక్కి
జీవితాలని నున్నకిసున్న, హాళ్ళకి హాళ్ళ
చేసుకుంటున్న గిరిజనులొక్కొక్కరూ
ఒకొక్క నోణకశ్రేష్ఠిగ మారిపోతున్నారనీ
యిలాగే దీనుల, దుఃఖితుల, బాధాపీడితుల
శోకాగ్ని
చల్లారిందనీ...
నీతో చెప్పటం కోసం
సమాజంలో సమసమత్వం వచ్చిందిక
నీకూ నాకూ మధ్య
యిక అంతరాలు లేవులే
నువ్వూ — నేనూ
ఒకటే అంటూ
'నాలుగైదుల' నవ్వే నాగమల్లికల మాల
కేల ధరించి
పయనం మొదలు పెట్టింది
వానలో నా మనస్సు నీ కోసం...

అస్పృశ్యతా నివారణ

—శ్రీ జె. వెంగళరావు



చరిత్రకు తెలిసినప్పటినుంచి మనిషి తనహక్కుల కోసం ఎవరితోనో ఒకరితో పోట్లాడుతూనే వున్నాడు. తన ఉనికిని స్థిర పరచు కోవాలంటే ఈ పోరాటం తప్పదు. ఆదిమ కాలంలో ప్రకృతితో పోరాడేవాడు. ఆనాడు తన ప్రాణ రక్షణే తన ముఖ్యమైన ఆశయం. తరువాత కాలంలో రాజులతో, పాలకులతో పోరాడేవాడు. తను చేయదలచుకొన్న కొన్ని పనులను చేసుకోగలిగే స్వాతంత్ర్యం కోసం ఆ పోరాటం జరిగింది. వ్యక్తిగతమైన స్వాతంత్ర్యం కోసం మానవుడు చేసిన అనేక పోరాటాలు చరిత్రలో విప్లవాలుగా వర్ణించబడి వున్నాయి. వాటన్నిటి ఫలితంగానే నేటి మానవుడు చాలావరకు స్వతంత్ర జీవిగా బ్రతుకుతున్నాడు.

ప్రపంచ దృష్టితో చూసినట్లయితే స్త్రీ పురుషులకు సమానమైన హక్కులు, రాజ్యపాలన విషయాలలో స్వయం నిర్ణయ అధికారం, బాలబాలికలచేత పనులు చేయించకుండా చూడటం, వెట్టిచాకిరి, బానిసత్వం, సమానమైన పనికి సమానమైన వేతనాలు మొదలగు అనేక విషయాలలో మనిషి తనను బలపరచు కోడానికి తన భవిష్యత్తు విలకడగా ఉండడానికి రకరకాల దోపిడి నుండి తనను సంరక్షించు కోడానికి పాటుపడుతున్నాడు. ఇటీవలి కాలంలో అన్నిటికంటె ప్రధానమైన స్థానాన్ని ఆక్రమించినది సాంఘిక న్యాయం అనే సమస్య. సంఘంలో అందరూ సమానమైన హక్కులను కలిగి ఉండాలనీ, ఉత్పత్తి ఔతున్న సంపద అందరికీ సమానంగా పంపిణీ జరగాలనీ, బీద, ధనిక వర్గాలు తొలగిపోవాలనేదే నేటి లక్ష్యం. ఇటువంటి కొన్ని ప్రాథమిక సూత్రాలను ఆధారంగా చేసుకొని ఐక్యరాజసమితికి చెందిన మానవ హక్కుల సంఘం చాలా కాలంగా కృషిచేస్తున్నది.

గాంధీజీ కృషి

మన దేశంలో సాంఘిక సమానత్వం కోసం గాంధీజీ ఎంతో కృషి చేశాడు. హిందూ సంఘంలోవున్న అంటరాని తనము అనే పిశాచాన్ని పారద్రోలడానికి ఆయన కంకణం కట్టుకున్నాడు. ఆయన నాయకత్వంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం జరుగుతున్న సమయంలోనే మన సంఘంలో వున్న యీ జాడ్యాన్ని నిర్మూలించటానికి మహానాయకులు ఎందరో పాటుపడ్డ విషయం మనందరికీ తెలిసినదే. ఈ నాడు ఆధునికులైన వారి ఆలోచనల్లో అంటరానితనము మహాపాపంగా పరిగణించ బడుతున్నది. దేశం అంతటా అస్పృశ్యతానివారణ ఒక ఉద్యమ స్థాయిలో కొనసాగుతున్నది.

మన దేశంలో 1955లో అస్పృశ్యతా నివారణ చట్టం చేయబడింది. అది దేశం అంతటా అమలు జరిగింది. దీనినే 1976 సంవత్సరంలో కొంత మార్పు చేసి పౌరహక్కుల చట్టాన్ని తయారు చేశారు. ఈ పౌరహక్కుల చట్టం నవంబరు 19వ తేదీ నుండి అమలు జరుగుతున్నది. దీని ప్రకారం అస్పృశ్యతను పాటించేవారికి కఠినమైన శిక్షలు వేయాలనీ, వారిని ఆమార్గం నుండి మరలించాలనీ ఉద్దేశించడం జరిగింది. మన భారత రాజ్యాంగ చట్టంలో ప్రపంచ మానవ హక్కుల సంఘంవారు సూచించిన అనేక అంశాలు పొందుపరుచబడి ఉన్నవి. అయితే ఇటువంటి సాంఘిక విషయాలు కేవలం రాజ్యాంగ చట్టంలోనూ, ఇతర చట్టాలలోనూ ఉన్నంత మాత్రంచేతనే పూర్తి ఫలితాలు సాధించలేవు. ప్రజలలో ప్రతినిత్యం ప్రచారం జరుగుతూ వారిలో యీ మార్పు పట్ల చైతన్యాన్ని తీసుకరావలసిన అవసరం ఉంది. రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలూ, సంఘ సంస్కర్తలూ, ఇతర మానవతా దృష్టి కలిగిన సంస్థలూ అస్పృశ్యతా నివారణోద్యమానికి చేయూత నివ్వవలసిన అవసరం వుంది.

మన దేశంలో హరిజనులు అని పిలువ బడుతున్న పేద ప్రజలను సాంఘికంగా ఇతర వర్గాల ప్రజలతో సమాన స్థాయికి తీసుక రావాలంటే వారిని ఆర్థికంగా బాగు పర్చవలసిన అవసరం ఉన్నది. అందుచేతనే ఇటీవలి కాలంలో హరిజన సంక్షేమం అనే అంశానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతున్నది. ప్రధాని ప్రకటించిన 20 సూత్రాల కార్యక్రమం క్రింద అమలు జరుగుతున్న అనేక పథకాలలో యీ విషయం మనకు స్పష్టంగా తెలుస్తుంది. హరిజనులకు భూములు పంచడం, గృహవసతి కల్పించడం, రుణాలు ఉదారంగా ఇవ్వడం మొదలగు అనేక కార్యక్రమాల ద్వారా వారికి ఆర్థిక పుష్టి చేకూర్చడానికి తీవ్రంగా ప్రయత్నం జరుగుతున్నది. ఆర్థికంగా వారు బలపడినట్లయితే సంఘంలో వారికి సముచితమైన స్థానం దాని అంతట అదే వస్తుంది. దీనికి తోడు అదే సమయంలో వారి పట్ల అంటరానితనం విధించిన వర్గాలలో గూడా మానసికమైన మార్పు తేవడానికి తగినంత ప్రచారం జరుగవలసిన అవసరం ఉన్నది. మన గ్రామాలలో ఇప్పటికీ కొన్ని కొన్ని చోట్ల అంటరానితనం పాటించ బడుతూనే ఉన్నదనే విషయం మన అందరికీ విచారకరం. దీనిని మనం ఎంత త్వరలో నిర్మూలించు కోగలిగితే అంత మంచిది.

ప్రధాని ఆర్థిక పథకం

మన దేశం మనం కోరు కుంటున్నట్లుగా సుసంపన్నము కావాలంటే దేశ ప్రజలలో అన్ని వర్గాలకు సంబంధించిన వారు మనస్ఫూర్తిగా పాల్గొంటేనే సాధ్యమవుతుంది. దేశ ప్రజలలో అధిక సంఖ్యాకులు బీద ప్రజలు. వారిలో చాలామంది హరిజనులు, గిరిజనులు మొదలగు నిరుపేద వర్గాలవారికి చెందిన వారు వున్నారు. వీరందరు మనతో కలిసి మెలిసి పనిచేయాలంటే మనం నిర్మిస్తున్న కొత్త వ్యవస్థలో వారికి సముచితమైన స్థానం ఉంటుందనే నమ్మకం వారికి ముందు కలుగజేయాలి. అప్పుడే దేశంలోవున్న మానవ శక్తి బాగా బయటకు వచ్చి, అన్ని కార్యక్రమాలలో పాల్గొని దేశాన్ని ఆర్థికంగా సౌభాగ్యవంతం చేయవలసిన పథకాలలో వినియోగ పడుతుంది. గత ఒకటిన్నర సంవత్సరాల నుండి 20 సూత్రాల పథకం అమలు జరుగుతున్న పరిస్థితులలో ఇప్పటికే యీ బీదవారికి కొంత విశ్వాసం కలిగిన సూచనలు కన్పిస్తున్నాయి. ప్రభుత్వం చేస్తున్న పనులు తమకోసం అనే చైతన్యం వారిలో ఇప్పుడు బాగా కలిగింది. అందువల్ల అన్ని కార్యక్రమాలలో వారు మనస్ఫూర్తిగా వచ్చి పాల్గొంటున్నారు. హరిజనులను, ఇతర వెనుకబడిన వర్గాల వారిని మనం ప్రేమతో దగ్గరకు తీసి ఆదరించడం నేర్చుకోవాలి. దానివల్ల వారందరు దేశాభ్యుదయ కార్యక్రమాల వైపు ఆకర్షితులవుతారు. ఈ నాడు మనం అమలు జరుపుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ఇది ఒక్కటే మార్గం. మన దేశంలో అంటరానితనం అనే దాన్ని మనం త్వరలో పూర్తిగా తీసివేయగలుగుతామనే విశ్వాసం నాకు ఉన్నది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ప్రజలందరూ పూనుకోవాలనీ, ఏ విధమైన అరమరికలు లేకుండా కలిసి పని చేయడం నేర్చుకోవాలని ప్రజలందరకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

o o o o o

లోక సభకు మార్చిలో ఎన్నికలు

ప్రస్తుత లోకసభను రద్దుచేసి 1977 మార్చిలో కొత్తగా ఎన్నికలు జరుపుతారని ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ జనవరి 18వ తేదీ రాత్రి రేడియో ప్రసంగంలో ప్రకటించారు. దీనిననుసరించి రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమద్ అధికార రాజ్యాంగంలోని 85వ సూత్రం క్రింద లోకసభను రద్దుచేస్తూ ప్రకటన జారీ చేశారు.

రద్దు అయిన (5వ) లోకసభలో 523 మంది ఎన్నికైన సభ్యులు వుండేవారు. 1973లో జరిగిన రాజ్యాంగ సవరణ ప్రకారం యీ సంఖ్య యిప్పుడు 542కు పెరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి లోగడ లోకసభలో సభ్యుల సంఖ్య 41. అదనంగా ఏర్పడిన హనుమకొండ నియోజకవర్గంతో సహా యికమీద కొత్త లోకసభలో 42 మంది సభ్యులుంటారు.

అస్పృశ్యతను పాటించడం అనాగరికం

—శ్రీ పి. మహేంద్రనాథ్



(మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మార్కెటింగ్ శాఖమంత్రి శ్రీ పి మహేంద్రనాథ్, డిసెంబరు 10 వ తేదీన రాత్రి ఆలిండియా రేడియో, హైదరాబాదు కేంద్రం ద్వారా చేసిన ప్రసంగం పూర్తి పాఠం).

మనిషికి మనిషికి మధ్య అడ్డుగోడలు ఏర్పడి వున్నట్లయితే మొత్తం సమాజానికే అది దెబ్బ. మన శరీరమే తీసుకోండి. దీనిలో అనేక రకాల అంగాలు వున్నాయి. ఒకటి ఎదిగి, మరొకటి ఎదగకుండా వున్నట్టయితే ఆ మనిషి ఆకారం వికారంగా, భయంకరంగా తయారవుతుంది. సంఘంలో కూడా అంతే. సంఘంలో అన్ని వర్గాలూ అన్ని జాతులూ సమానంగా అభివృద్ధి చెందితేనే సమాజం ఆరోగ్యంగా వుంటుంది. సంకుచితమైన సరిహద్దులు సమాజ వికాసానికి అడ్డు తగులుతాయి. అనేక చారిత్రిక కారణాలవల్ల మన సమాజం పూర్వంనించి యిలా అనారోగ్యకరమైన వాతావరణంలో వుంటూ వచ్చింది. స్వార్థపరులు సమాజాన్ని కొన్ని వర్గాలుగా చీల్చి. ఒక వర్గాన్ని దూరంగా నెట్టివేసి అంటరానివారుగా ముద్రవేశారు. ఇదే మన సంస్కృతి అని జనాన్ని నమ్మించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలోకి గాంధీజీ వచ్చే వరకు యీ అంటరానితనం ఏ అడ్డు ఆపూ లేకుండా కొనసాగుతూవచ్చింది. గాంధీజీ యీ అంటరానితనాన్ని నిశితంగా విమర్శించి, యీ ప్రజల్ని సమాజ జీవనంలో భాగంగా కలపడానికి ఒక ఉద్యమంలాగా కృషి చేశారు.

నిజానికి సాంప్రదాయ బంధాలు చాలా బలమైనవి. వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా మన అభిరుచుల్ని, అలవాట్లను, మన తీరుతెన్నుల్ని మార్చుకోడానికి ఏ మాత్రం వెనుకంజవేయడం లేదు మనం. ఆటువంటప్పుడు మన యీనాటి సాంఘిక జీవితానికి అడుగోడలుగా వుండే సంప్రదాయాల్ని మాత్రం మనం ఎందుకు అనుసరించాలి? సంప్రదాయం పేరుతో వ్యక్తి పరిపూర్ణవికాసానికి, సమాజాభివృద్ధికి, దేశ ప్రగతికి ప్రతిబంధకమైన పద్ధతుల్నీ, అలవాట్లనూ మనం మార్చుకోక తప్పదు.

అయితే ఏ కాలంలోనైనా మార్పును వ్యతిరేకించేవారు వుంటూనే వుంటారు. అందులోనూ, వందల, వేల సంవత్సరాల నుంచీ అమలులో వుంటూ వచ్చిన ఒక పద్ధతిని మార్పుచేయబోతే—అది ఎంత అనారోగ్యకరమైన పద్ధతి అయినప్పటికీ—దానినే అంటిపెట్టుకుని వుండేవారూ, ఆ మార్పును ప్రతిఘటించేవారూ వుంటూనే వుంటారు. సహజ పరిణామం ద్వారా ఆధునిక సమాజంలో రావలసిన యీ మార్పు యిటువంటి ప్రతిబంధకులవల్లా, ప్రతిఘటించే వారివల్లా మరీ వెనక్కుపోవడంతో ప్రభుత్వమే ఒక శాసనం చేసి యీ మార్పును సత్వరం తీసుకురావడానికి ప్రయత్నించింది.

స్వాతంత్ర్యం వచ్చాక ......

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంటరానితనం పాటింపును ప్రభుత్వం నిషేధించి, అలా పాటించే వారిని శిక్షించడానికి 1955లో ఒక చట్టాన్ని చేసింది. దీనికి 1955వ సంవత్సరపు అస్పృశ్యతా నివారణ చట్టం అని పేరు. చట్టం ఒకటి అమలులో వున్నప్పటికీ దేశంలో అనేక చోట్ల రహస్యంగానే కాక బాహాటంగానూ అస్పృశ్యతను పాటించే సంఘటనలు అనేకం జరుగుతూ వచ్చాయి. మన గ్రామాల్లో వెనకటితరం వారు ఛాందసమైన భావాలను తేలికగా వదిలిపెట్టలేక పోవడంవల్ల, అస్పృశ్యతను పాటించడం నేరమని తెలిసినప్పటికీ దీనిని పాటిస్తూనే వచ్చారు. పట్టణాలలోని సాంఘిక జీవితం అస్పృశ్యతను పాటించడానికి అవకాశాలు యివ్వక పోవడం వల్ల మన నగరాల్లోనూ, పట్టణాల్లోనూ యీ జాడ్యం క్రమక్రమంగా కనుమరుగై పోయింది. అయితే గ్రామాల్లోని సాంఘిక జీవితంనుంచి యిది పూర్తిగా తుడిచివేయబడిందని గట్టిగా చెప్పలేం. ఇప్పుడిప్పుడే మన గ్రామాలు చైతన్యవంతమవుతున్నాయి. అక్కడికి కూడా అభ్యుదయ విజ్ఞాన వీచికలు ప్రసరిస్తున్నాయి. మూర్ఖంగా ఛాందస భావాలను పట్టుకుని వ్రేలాడే వారి తరం మెల్లమెల్లగా అంతరించిపోతోంది. అభ్యుదయంగానూ, సామాజిక చైతన్యంతోనూ ఆలోచించే కొత్త తరం బయలుదేరింది.

స్వాతంత్ర్యం వచ్చే నాటికి చిరుత ప్రాయంలో వున్న బాలు యీనాడు యువజనులయ్యారు. సాంఘిక అవగాహనతో మారుతున్న పరిస్థితులకూ, వస్తున్న మార్పులకూ హృదయపూర్వకంగా స్వాగతం చెప్తున్నారు. అందుకే యువకులలో యీ అస్పృశ్యతను పాటించే గుణం పెద్దతరం వారిలో వున్నంతగా లేదు.


ఏమైనా మరింత కట్టుదిట్టంగా అస్పృశ్యతా నివారణ చట్టాన్ని అమలు జరపాలని ప్రభుత్వం ఉద్దేశించింది. అస్పృశ్యతను పాటించే వారి శిక్షలను పెంచుతూ 1955 నాటి చట్టాన్ని ప్రభుత్వం సవరించింది. దీనికి పౌరహక్కుల రక్షణ చట్టం అని పేరు. 1976 సెప్టెంబరు 13న దీనికి రాష్ట్రపతి ఆమోదముద్ర లభించడంతో 1976 నవంబరు 19 తేదీనుంచి అమల్లోకి వచ్చింది.

ఈ కొత్త చట్టంవల్ల అస్పృశ్యతను పాటించేవారిని శిక్షించడమేకాక అస్పృశ్యతను చారిత్రిక కారణాలను చూపించిగాని, మత పరంగా గాని, సాంప్రదాయక కారణాలవల్ల గాని, వేదాంత పరంగాగాని సమర్థిస్తూ ప్రత్యక్షంగానైనా పరోక్షంగానైనా ప్రచారం చేయడం నేరం. ఇటువంటి నేరాలకు విధించే శిక్షలను కూడా ఎక్కువ చేయడం జరిగింది.

వీటన్నిటివల్లా చట్టానికి భయపడి అస్పృశ్యతను పాటించేవారి సంఖ్య తగ్గుతుందనేది నిజమే కాని ప్రజల్లో మానసిక పరివర్తన రానిదే ఏ ప్రభుత్వ చర్యకూడా నూటికి నూరు పాళ్ళూ, విజయవంతం కాలేదు. మనిషి ఆలోచనా సరళిలో మార్పు రావాలి. సామాజిక స్పృహ, వర్తమాన పరిస్థితి తీరుతెన్నులను గురించిన అవగాహన కలిగి అభ్యుదయ దృక్పథంతో ఆలోచించాలి. అలా ప్రవర్తించాలి. ప్రభుత్వ కృషికి ప్రజల మద్దతు వుంటే ఆ పని మరింత శీఘ్రంగా నెరవేరుతుంది. అస్పృశ్యతా జాడ్యాన్ని మన సమాజం నుంచి సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలి.

సమతా సమాజం

ఏ విధమైన హెచ్చుతగ్గులు లేని సమతా సమాజాన్ని నిర్మించడానికి మనం కంకణం కట్టుకున్నాం. ఆ విధంగా రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాం. ఇందుకు బద్ధకంకణమైన ప్రభుత్వాన్ని ఎన్నుకుని తద్వారా మన సాంఘిక, ఆర్థిక జీవితంలో విప్లవాత్మకమైన మార్పుల్ని తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాం. అటువంటప్పుడు ప్రభుత్వం చేసే ప్రతి చర్యకూ మనం హృదయపూర్వకంగా స్వాగతం పలికి, ఆ కార్యక్రమాలలో పాల్గొని, వాటి విజయానికి తోడ్పడడం మన కర్తవ్యం. ఈ కృషిలో సంకుచితమైన మత విశ్వాసాలకు, అనారోగ్యకరమైన సంప్రదాయ ధోరణులకు తావులేదు. సమాజ అభ్యుదయ గమనాన్ని అడ్డగించే ఎటువంటి మత విశ్వాసాన్నయినా, ఎంతటి సుదీర్ఘ సంప్రదాయాన్నయినా మనం వదిలి పెట్టివేయక తప్పదు. అపుడే మనం ఆశించే సమ సమాజం ఆవిర్భవిస్తుంది. అప్పుడే మనం కోరే అభ్యుదయం సిద్ధిస్తుంది.



అనేకానేక రంగాలలో సాటి దేశాలలో మేటిగా నిలబడగలిగే స్థితికి నేడు మనం చేరుకుంటున్న తరుణంలో, మన చర్యలవల్ల మనమే సిగ్గుపడి, పరులముందు దోషులుగా నిలబడే పరిస్థితి మనకు కలగడానికి వీలు లేదు. స్వాతంత్ర్యానంతరం ఆర్థికంగా బలపడ్డాం. ఎన్నెన్నో రంగాలలో పురోగమించాం. వెనుకబడిన దేశం నుంచి అభివృద్ధిపొందిన స్థాయికి చేరుకున్నాం. మనల్ని చూసి మనమే గర్వపడే అనేక అమోఘ విజయాలను సాధించుకున్నాం. ఇటువంటి పరిస్థితులలో అనాగరికమూ, అమానుషమూ అయిన అస్పృశ్యతా విధానాన్ని కొనసాగిస్తూ మనల్ని మనమే సిగ్గిలచేసే చర్యలు కూడదు. మనమంతా జాతి, మత, కులభేదాలను మరచి, అస్పృశ్యతా జాడ్యాన్ని సమూలంగా నిర్మూలిద్దాం.

ఈనాడు మానవ హక్కుల దినోత్సవాన్ని ప్రపంచమంతటా జరుపుకుంటున్నారు. వ్యక్తి పరిపూర్ణ వికాసానికి ప్రతిబంధకాలు లేని వాతావరణాన్ని కల్పించే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి డిశంబరు 10వ తేదీని మానవ హక్కుల దినోత్సవంగా జరపాలని సభ్యదేశాలను కోరింది. ఆమేరకు మనం ప్రతి ఏటా మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ ఏడాది ఉత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ మానవ హక్కుల దినోత్సవాన్ని మనం అస్పృశ్యతా నివారణ దినంగా జరపాలని నిర్ణయించుకున్నాం. మన సమాజంలో అట్టడుగున ఉండిపోయిన మన తమ్ముల్ని చేయూతనిచ్చి సమాజ జీవన ప్రవంతిలో భాగంగా కలిసిపోయేటట్టు చేయడానికి ఈ కృషి దోహదం చేయగలదని నా నమ్మకం.


కవిటం నాడు - నేడు

—శ్రీ సిద్ధాని నాగభూషణం


" జననీ జన్మభూమిశ్చ
స్వర్గాదపి గరీయసీ "

మాతృమూర్తి, మాతృభూమి స్వర్గం కన్న మిన్న. పుట్టిన ఊరిపై ప్రేమ, అభిమానం ఉండటం సహజంకదా మా ఊరు కవిటం నర్సాపురం–నిడదవోలు రహదారిపై పాలకొల్లుకు ఐదు మైళ్ళ దూరంలో, నిడదవోలుకు 37 కిలోమీటర్ల దూరంలో ఉన్న మా ఊరు పోడూరు సమితికి చెందింది. మా ఊరుకు మైలు దూరంలో పోడూరు సమితి కార్యాలయం ఉంది. " కవిపురం "గా మొదట్లో పిలువబడినా పేరు మార్పుచెంది ఇప్పుడు "కవిటం"గా పిలువ బడుతూవుంది.

మా గ్రామానికి ఎప్పుడూ ప్రత్యేకత ఉంటూనే ఉంది. భారత స్వాతంత్ర్య రథ సారథి పూజ్య బాపూజీ మా గ్రామాన్ని సందర్శించి మా గ్రామం పెద్దకాలువ దగ్గర ఉన్న బియ్యం మిల్లు వద్ద బహిరంగ సభలో ప్రసంగించి మా గ్రామ యువకులను ఉత్తేజితులను చేశారు అప్పటో యువకులైన శ్రీ పరకాల పట్టాభి రామారావు, శ్రీ పరకాల రమణారావు, శ్రీ ఆకెళ్ళ గోపాలకృష్ణ శర్మ, శ్రీ పరకాల శేషావతారం ప్రాణాలకు తెగించి స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని మా గ్రామానికి కీర్తిని తెచ్చారు.



సర్పంచ్
శ్రీ సత్తి వెంకటరెడ్డి



పంచాయతీ కార్యాలయ భవనం

సైన్సును తెలుగులో సులభ శైలిలో వ్రాసి సాహితీ సేవ చేయడమేగాక, శిక్కు మతగ్రంథాన్ని తెలుగులోకి అనువదించి పంజాబ్ విశ్వవిద్యాలయం సత్కారం పొందిన తొలి తెలుగు వారు శ్రీ వేమరాజు భానుమూర్తి మా గ్రామ వాసి. విశాలాంధ్ర సహాయ సంపాదకులైన శ్రీ పరకాల పట్టాభిరామారావు మా ఊరివారే, వైద్యశాస్త్రంలో జాతీయస్థాయిలో కీర్తినార్జించిన శ్రీ బడతస్వామి మా ఊరిలో పుట్టిపెరిగినవారు కావటం మాకెంతో గర్వకారణం.

విదేశాలకు వెళ్ళి ఆడిట్ విద్య ప్రాపీ హైదరాబాద్‌లో జి. కె రావు అండ్ కంపెనీ ద్వారా సేవలుచేస్తున్న శ్రీ జి కె. రావ్ గారి జన్మస్థలం మా ఊరే.

సినిమా రంగానికి ఎనలేని సేవచేస్తున్న శ్రీ డి.వి.యస్. రాజు గారు, రెండుసార్లు నర్సాపురం పార్లమెంట్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించిన శ్రీ దాట్ల బలరామరాజుగారు మా గ్రామ వాసులే. విజయవాడ, మద్రాసు నగరాల్లో సినీ లిథో వర్క్సు ప్రారంభించి సినిమాల విస్తృత ప్రచారానికి దోహద కారులైన శ్రీ కర్రి నర్సిరెడ్డి, భీమవరం, తణుకు పట్టణాలో ఆయుర్వేద మందుల తయారీని చేపట్టి వైద్య సేవచేస్తున్న శ్రీ గాదె బాల కృష్ణమూర్తి గారు కూడా మా గ్రామంలో జన్మించినవారే.

మంచినీటికి మావూరు ముంజెరువు - కొవ్వు అనే చెరువులు ఆధారాలు. ఐదు అడుగులు బావి త్రవ్వితే నీరు పడు తుంది మాఊళ్ళో చాలా చోట్ల. ఈ నాడు మా గ్రామంలో 6385 మంది జనాభా నివసిస్తున్నారు. ఆ జనాభాలో 2456 మంది హరిజనులు. మధ్యమ వర్గాల కుటుంబాల వారు ఎక్కువగా నివసించే మా గ్రామంలో ధరణిని నమ్మిన కర్షకులు కూడా తక్కువ ఏమీకారు. ఎప్పుడూ ధనధాన్య రాసులతో కలకల లాడుతున్నది.

నేను చదువు కుంటున్న రోజుల్లో మిత్రులు వెలగల శ్రీ రామారెడ్డి, మేడపాటి రామకృష్ణారెడ్డి–పొలాలకు వారితో వెళు తుండేవాడిని, ఆరోజుల్లో వారి పొలాలలో బసంగి, కృష్ణకాటుకలు అక్కుళ్ళు లాంటి వరిరకాలను వేసి పండిస్తూ ఉండేవారు. ఏపుగా పెరిగి ఎంతో అందాన్ని వలికిస్తూఉన్న ఆ పొలాలు కన్నుల పండుగ

జేసేవి. మా గ్రామం ప్రక్కన ఉన్న మారుటేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం. మా గ్రామ రైతులకు మంచి ప్రయోజనాన్ని కలిగించింది. ఎక్కువగా ప్రభావితుల్ని చేసింది. పోడూరు సమితులు ఏర్పడిన తర్వాత గ్రామాభివృద్ధి అధికార్లు, వ్యవసాయ విస్తరణాధికార్లు సలహాలు పాటిస్తూ చక్కని వ్యవసాయం చేస్తున్నారు. ఈ నాడు హంస, రత్నా, ఐ. ఆర్. 8. మసూరి తదితర మేలు రకం వరిరకాలే ఎక్కువగా మా ఊరి పొలాల్లో కనపడుతున్నాయి. మచ్చుకైనా పాతరకాలు ఈ నాడు లేవు. శ్రీ మేడపాటి రాజయ్యగారి వీర్రెడ్డి, శ్రీ మేడపాటి బంగారయ్యగారి సూర్యనారాయణ రెడ్డి ఆధునిక వ్యవసాయంలో పేరెన్నిక గన్నారు. శ్రీ మంతులైన యువకులు పట్టభద్రులై, ఉద్యోగాల కోసం ఎదురు తెన్నులు చూడకుండా గ్రామానికి తిరిగివచ్చి వ్యవసాయాన్ని చేపట్టి ఆదర్శ కృషిచేసి ఉత్తమ కర్షకులుగా పేరెన్నిక కనటం నిజంగా మాకెంతో గర్వకారణం. ఈరోజున మాగ్రామంలో రైతుల దగ్గర 40 ఆయిల్ ఇంజన్లు, 6 ట్రాక్టర్లు ఉన్నాయి.

సర్పంచ్‌లు

మాగ్రామ పంచాయతీకి పంచాయతీ రాజ్యం అవతరణకు పూర్వం శ్రీమేడపాటి చిట్టివీర్రెడ్డిగారు సర్పంచ్‌గా పనిచేశారు. కొన్నాళ్ళు శ్రీమేడపాటి పరశురామి రెడ్డిగారు అధ్యక్షులుగా పనిచేశారు. పార్లమెంటు సభ్యులు శ్రీదాట్ల బలరామరాజుగారు సర్పంచ్‌గా పనిచేసిన తర్వాత శ్రీ సత్తి వెంకటరెడ్డి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై, ఆనాటినుంచి నేటివరకు మాగ్రామ పంచాయతీకి నాయకత్వం వహిస్తున్నారు.


శ్రీమేడపాటి పరశురామి రెడ్డిగారు సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత మూలపడివున్న గ్రంథాలయాన్ని పునరుద్ధరించారు, మంచి మంచి పుస్తకాలు కొని గ్రంథాలయం పనిజేసేలా కృషిచేశారు. కొన్ని రహదారుల నిర్మాణానికి, చెరువులు బాగుకు దోహదం చేశారు. బాటలకు ఇరు ప్రక్కల కొబ్బరి మొక్కలను నాటి గ్రామానికి మరింత శోభను సమకూర్చడమేగాక పంచాయతీ ఆదాయాన్ని పెంపొందించారు.

పంచాయతీరాజ్యం ప్రవేశపెట్టక పూర్వంనుంచి మాగ్రామ పంచాయతీలో ప్రజల సమైక్యత చెక్కు చెదరలేదు ఏకగ్రీవంగానే ఎన్నికలు జరిగాయి. 1964 సంవత్సరంలోనే పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీసత్తి వెంకటరెడ్డి స్థితిమంతుడైనా, ఆదర్శాలను పుణికి పుచ్చుకొన్న వాడు కనుక పెద్దతరం వారు శ్రీ వెంకటరెడ్డి నాయకత్వానికి అంగీకరించారు. అనూహ్యమైన కారణాలవల్ల మాగ్రామం కొన్నాళ్ళ ప్రగతి నత్త నడక పడిచిందని గ్రహించారు. ఏ విధంగానైనా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నారు శ్రీ వెంకటరెడ్డి.

పంచాయతీకి పన్నులు బకాయలు ఉండేవి. ఆ పన్నులన్నిటినీ వసూలుచేయటం జరిగింది. 1964-1965 సంవత్సరంలో మా గ్రామం పూర్తిగా పన్నులు వసూలుచేసి పన్నుల వసూళ్ళ ఉద్యమంలో నూతన చరిత్రను సృష్టించుకొంది. ఆనాటినుంచి నేటివరకు పూర్తి పన్నులు వసూలు చేస్తున్నది.

పరిరక్షిత మంచినీటి పథకం


మాగ్రామ ప్రజలు ఔదార్యానికి పెట్టింది పేరు. ప్రజా శక్తిని వినియోగించి ఆదర్శంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకుని 4000 గాలన్ల శక్తి గలిగిన పరిరక్షిత మంచినీటి ఓవర్



పరిరక్షిత మంచి నీటిపథకం
ఓవర్ హెడ్ ట్యాంక్

హెడ్ టాంకును 20,000 రూపాయల ఖర్చుతో నిర్మించారు. నీటిని వడపోసే యంత్రాన్ని 35,000 రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్నది. ఈ పరిరక్షిత మంచినీటి పథకం అమలు పరచటంవల్ల ఆరోగ్యపు అలవాట్లలో గణనీయమైన మార్పు వచ్చితీరుతుంది.

మా పంచాయతీ పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొంది. 11 మరుగు దొడ్లను నిర్మించింది. సాలీనా 9000 రూపాయలు పారిశుద్ధ్య సౌకర్యంకలగ జేసేనిమిత్తం ఖర్చుచేస్తున్నది.



ఆసుపత్రి భవనం

ఆసుపత్రి భవనానికి లక్షరూపాయల విరాళం

మాగ్రామంలో ఆసుపత్రి భవనాన్ని నిర్మించాలనుకున్నప్పుడు ప్రజలు ముందుకు వచ్చారు లక్ష రూపాయలు విరాళం అందజేసి, పశ్చిమగోదావరిజిల్లాలోనే ఆదర్శవంతులయ్యారు.

మా కవిటం గ్రామ పంచాయతీ 8 కిలోమీటర్ల రహదారులను వేసి సాలీనా 5 వేల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్నది. ఈ సంవత్సరం పాడుపడిన శెట్టిబలిజిపేట వీధులలో కంకర వేయించింది మా పంచాయతీ.

నర్సాపురం తాలూకాలోనే ప్రప్రథమంగా విద్యుచ్ఛక్తి గ్రామానికి తీసుకొని వచ్చిన ఘనత మా గ్రామానికే దక్కింది. వీధులలో 102 విద్యుద్దీపాలను నిర్వహిస్తున్నది. ఒక రేడియోను నిర్వహిస్తున్నది. 742 పుస్తకాలతో ఒక గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నది.

ఒకనాడు దేవాలయంలోకి హరిజనుల ప్రవేశం లేనిమాట నిజం. అయితే ఈనాడు మాగ్రామ ప్రజల దృక్పథాలలో చక్కని మార్పువచ్చింది. ఈనాడు హరిజనుల దేవాలయ ప్రవేశానికి ఏవిధమైన అడ్డంకులులేవు. హరిజనవాడలో విద్యుద్దీపాలు వేయించింది. 4 మరుగు దొడ్లను వేసింది. శ్రీ దాసరి పెరుమాళ్ళుగారు సాంఘిక సంక్షేమ శాఖామంత్రిగా ఉన్నప్పుడు హరిజనులకు నివేశన స్థలాలు ఇవ్వడంతోపాటు 12 నివాస గృహాలను నిర్మింపజేశారు. రహదారులను వేయించారు. ఈ నివాస గృహాల నిర్మాణంలో పంచాయతీ కూడా పాల్గొంది. హరిజనులు కూడా విద్యావంతులవుతున్నారు. దాదాపు 20 మంది ఉద్యోగాల్లో ఉన్నారు.

మహిళా మండలి

స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో మహిళలు సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనటానికి ముందుకు వచ్చేవారు కారు. 1959వ సంవత్సరములో శ్రీమతి మేడపాటి సుబ్బమ్మ అధ్యక్షురాలుగా, శ్రీమతి గోకరాజు సీతా మహాలక్ష్మమ్మ కార్యదర్శిగా, శ్రీమతి కర్రి లక్ష్మీ నరసమ్మ ఉపాధ్యక్షురాలుగా, 100 మంది సభ్యురాండ్రతో మహిళామండలి ఏర్పడింది. ప్రతి ఏడు కనీసం 20 మందికి తక్కువ కాకుండా కుట్టు పనుల్లో శిక్షణ ఇస్తున్నారు. 1966వ సంవత్సరంలో 60 మంది మహిళలకు అంబర్ చర్ఖా పనుల్లో శిక్షణ ఇచ్చింది. 1969 వ సంవత్సరం వరకు మహిళలకు సంగీతంలో శిక్షణ ఇచ్చే తరగతులను నిర్వహించింది. పిల్లలకోసం బాలవాడీని నిర్వహిస్తున్నది. 1971 నుంచి పోడూరు సమితి బలవర్ధక పథకాన్ని నడుపుతున్నది. మొదట్లో గ్రామ మహిళామండలి 7,500 రూపాయల ఆర్థిక సహాయం కేంద్ర సాంఘిక సలహా మండలినుండి పొంది 7,500 రూపాయలు ప్రజా విరాళాలు ప్రోగుజేసి 15,000 రూపాయల ఖర్చుతో భవనాన్ని నిర్మించింది. కార్యక్రమాలు విస్తృతమయిన కారణంగా ఇంకో భవనాన్ని నిర్మాణం చేయాలని మహిళా మండలి తల పెట్టింది. 15,000 రూపాయల ఖర్చుతో నిర్మించిన భవనానికి సమితి, పంచాయతీ విరాళాలు అందజేసింది. ఈ మండలి నిర్వహించే గ్రంథాలయంలో దాదాపు రెండు వేల పుస్తకాలు కూడా వున్నాయి.

మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఈ సంఘం రాష్ట్ర మహిళా సంక్షేమశాఖ సహకారంతో పదివేల రూపాయల విలువ జేసే ఒక ముద్రణాలయాన్ని ప్రారంభించింది. ముగ్గురు మహిళలకు జీవనోపాధి కల్పిస్తున్నది.

శ్రీ కర్రి వెంకటరెడ్డి నాయకత్వంలో నవభారత్ యువజన సంఘం పని చేస్తున్నది. జిల్లా పరిషత్తు నుంచి ఒక ఎకరం పొలాన్ని కౌలుకు తీసుకొని ఆధునిక పద్ధతులపై ప్రదర్శన సాగు క్షేత్రాలను నిర్వహిస్తున్నది.

పంచాయతీ రాజ్య రజతోత్సవాలు సందర్భంగా మూడు మాసాల వ్యవధిలో 40,000 రూపాయలు ఖర్చుచేసి పంచాయతీకి సొంత కార్యాలయ భవనాన్ని నిర్మించింది. గ్రామంలోని రైతులు ఎకరానికి ఒక బస్తా చొప్పున విరాళం ఇచ్చి సహకరించి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రజలకు మార్గదర్శకులయ్యారు. పూర్తి ప్రజా విరాళంపై నిర్మించిన గ్రామ పంచాయతీ శాశ్వత భవనాన్ని విద్యా శాఖా మంత్రి శ్రీ ఎమ్. వి. కృష్ణారావు ప్రారంభోత్సవం చేశారు.



రూరల్ బ్యాంకు సహాయంతో నిర్మించిన బియ్యం మిల్లు

(తరువాయి 14వ పేజీలో)

తెలుగు అకాడమి కార్యకలాపాలు

—శ్రీ ఎన్. వెంకటస్వామి

ఉన్నత స్థాయిలో బోధన భాషగాను, పాలన కనుకూలమైన భాషగాను తెలుగును సుసంపన్నంచేసి ఆధునికీకరించడం కోసం తగిన మార్గాలను సూచించవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1966లో ఒక నిపుణుల సంఘాన్ని నియమించింది. నాటి విద్యాశాఖ కార్యదర్శి శ్రీ జె. పి. యల్. గ్విన్ (ఐ.సి.యస్) దానికి అధ్యక్షుడు. ఈ విషయమై కూలంకషంగా పరిశీలించి కొన్ని సూచనలు చేస్తూ ఆ సంఘం 1967 ఏప్రిల్‌లో ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించింది. ఆ సూచనలలో రాష్ట్రస్థాయిలో తెలుగు భాషాసంస్థ స్థాపన ఒకటి.

గ్విన్ సంఘం రిపోర్టును, భారత ప్రభుత్వంవారి ప్రణాళికను ప్రాతిపదికగా తీసుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1968 జూన్ 12వ తేదీన (జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 1255 విద్యాశాఖ) ఒక అధికార పత్రం ద్వారా రాష్ట్ర స్థాయిని తెలుగుభాషా సంస్థను స్థాపిస్తూ దానికి 'తెలుగు అకాడమి' అని నామకరణం చేసింది. ఈ అకాడమి 1968 ఆగస్టు 6వ తేదినుంచి పని ప్రారంభించింది.

తెలుగు అకాడమి ముఖ్యోద్దేశాలు

1. ఉన్నత స్థాయిలో బోధన భాషగాను, పరిపాలన కనుకూల మైన భాషగాను తెలుగును నవీనంగా తీర్చిదిద్దడం.

2. తగిన పాఠ్యపుస్తకాలు, పఠనీయ గ్రంథాలు, సంప్రదింపు గ్రంథాలు, కోశాలు మొదలగునవి సమకూర్చి విశ్వవిద్యాలయాలు తెలుగును బోధన భాషగా చేయడానికి సహాయపడడం.

3. పరిపాలన భాషగా తెలుగును ఉపయోగించడంలో ప్రభుత్వానికి తోడ్పడడం.

తెలుగు అకాడమి సొసైటీలు రిజిస్ట్రేషన్ చట్టం క్రింద రిజిస్టరయిన సంస్థ. దీని పరిపాలనకు ఒక పాలక మండలి ఉంది. (బోర్ అఫ్ గవర్నర్స్) అధికార అనధికార వర్గాలకు చెందిన ఇరుతెగల వారూ ఈ బోర్డులో సభ్యులు. అకాడమి పాలక మండలికి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామాత్యులు అధ్యక్షులుగా ఉంటారు. మొట్టమొదటి అధ్యక్షులు శ్రీ పి. వి. నరసింహారావుగారు. ఇప్పుడు శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు అధ్యక్షులు. తెలుగు అకాడమి డైరక్టరు దీనిలో సభ్యునిగా, దీనికి కార్యదర్శిగా వ్యవహరిస్తారు. అకాడమి పరిపాలన విషయాలను, విద్యా విషయాలను పర్యవేక్షించే రెండు స్థాయి సంఘాలు — పాలక మండలిలోని కొందరితో-ఏర్పాటయి ఉన్నాయి. అకాడమి డైరక్టరు, వీటిలో కూడా సభ్యునిగా, వీటికి కార్యదర్శిగా వ్యవహరిస్తారు. అకాడమి డైరెక్టరు, పాలక మండలి ఆశయాలకు ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ అటు పరిపాలన విషయాలను ఇటు విద్యాసంబంధమైన కార్యక్రమాలను నిర్వహిస్తారు.

అకాడమి ఆశయాలను కార్యక్రమాలను అచరణలో పెట్టడానికి మూడు ముఖ్యమైన శాఖలద్వారా పని జరుగుతోంది. ఈ శాఖల అన్యోన్య సహకారంతో ఏకోన్ముఖంగా జరుగుతున్న కృషియే ఇటు బోధనా భాషగానూ అటు పాలనా భాషగానూ అన్ని అంచెలలోను తెలుగు క్రమ వికాసం పొందడానికి దోహదం చేస్తోంది. ఈ మూడు శాఖలు 1, పరిశోధన–సర్వేశాఖ, 2. బోధనా శిక్షణ శాఖ, 3. ప్రచురణశాఖ అనేవి.

పరిశోధన–సర్వేశాఖ

సామాజిక భాషా పరిశీలన ఈ శాఖ తలపెట్టిన బృహత్ప్రణాళికల్లో ఒకటి. ఆధునిక తెలుగు భాషకు సమగ్రమైన వర్ణనాత్మకవ్యాకరణం అవసరమని అకాడమి గుర్తించడమే ఈ ప్రణాళికను చేపట్టడానికి ముఖ్యకారణం. నిపుణుడైన భాషా శాస్త్రజ్ఞుడు పూర్వనిర్దిష్టమైన ప్రాంతానికి వెళ్ళి టేప్‌రికార్డర్ ద్వారా, ప్రశ్నోత్తరాల ద్వారా విషయ సేకరణచేసి భాషా సామగ్రిని 'అకాడమి'కి తేవడం జరుగుతుంది. దీని ఆధారంతో మొదట జిల్లాలవారిగా ప్రత్యేక పరిశోధనా పత్రికల ప్రచురణ జరుగుతుంది. ఇవి తెలుగులో ఉంటాయి. ఇంతవరకు తెలుగు మాండలికాల మీద తెలుగులో నాలుగు పరిశోధన పత్రికలు (బులెటిన్‌లు) కరీంనగర్, కడప, విశాఖపట్టణం, గుంటూరు జిల్లాల భాషా సంబంధమైనవి ప్రచురించడం జరిగింది. సంగ్రహవర్ణనాత్మక వ్యాకరణాల రూపంలో ఆంగ్ల భాషలో ప్రతి జిల్లాలోని మాండలిక భేదాలకు సంబంధించి వరంవరగా మోనోగ్రాఫ్‌లు వస్తాయి. ఇంతవరకు కరీంనగర్ మాండలికం మీద ఒక మోనోగ్రాఫ్ వచ్చింది. వరంగల్ మాండలికంమీద తెలుగులో ఒక బులెటిన్ అచ్చునకు సిద్ధంగా ఉంది. కడప, విశాఖపట్టణం, గుంటూరు. వరంగల్ జిల్లాల మాండలికాలమీద ఇంగ్లీషులో నాలుగు మోనోగ్రాఫ్‌లు సిద్ధమవుతున్నాయి. మరి రెండు జిల్లాల్లో అంటే కర్నూలు, పశ్చిమ గోదావరి జిల్లాలలో-కొంతవరకు సర్వే జరిగింది.

పరిశోధన—సర్వేశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన పరిశోధనా సంస్థతో కలిసి 'గోండి' భాషాధ్యయానికి సంబంధించిన కార్యక్రమాన్ని తలపెట్టింది. ఈశాఖ ఈ కార్యక్రమం కాకుండా మరి రెండు క్రొత్త ప్రణాళికలను కూడా చేపట్టింది. ఇందులో మొదటిది-న్యాయ-పరిపాలనకు సంబంధించిన పరిభాషా సేకరణ. అచ్చయిన పుస్తకాలలోనుంచి దీనికి సంబంధించిన పదాలను, ఇంచు

మించుగా 20,000 ను సేకరించడం ఈ ప్రణాళికా కార్యక్రమంలో ప్రథమదశ. పర్యటనలద్వారా జిల్లాలలో వాడుకలలో ఉన్న మాటల సేకరణ దీని తరువాత జరిగేవి. సేకరణ పూర్తి అయిన తరువాత సమస్తమైన పరిభాషా పదావళిని ఇంగ్లీషు తెలుగు క్రమంలో నిర్వచనాలతో సహా సిద్ధం చేస్తారు. దీనికి అనుబంధముగా తెలుగు–ఇంగ్లీషు క్రమములో కూడా సిద్ధంచేసిన పదావళి చేర్చడం జరుగుతుంది. ఇదంతా ఇంచుమించుగా మూడేండ్లు తీసుకొంటుందని అంచనా.

ఇక రెండవది—సామాజిక దృక్పథం ఉన్న ఆధునిక వచన రచనలలో వాక్య నిర్మాణ పద్ధతి పరిశీలన. ఆధునిక వచన రచనలు నవలలు మొదలైనవి ఈ పరిశీలనకు సామగ్రి. నేటి తెలుగు భాషకు సమగ్రమయిన వర్ణనాత్మక వ్యాకరణం వ్రాయడమనే బృహత్కార్యానికి ఈ పరిశీలన ఫలితాలు పనికివస్తాయి. ఇది ఇంచుమించుగా రెండు సంవత్సరాలు తీసుకుంటుందని అంచనా.

'సామాన్యభాషాశాస్త్రం' మీద "సర్ ఫెర్డినాండ్ సస్యూర్" వ్రాసిన పుస్తకం అనువాదం ముద్రణకోసం సంస్కరింపబడుతోంది. కొద్ది నెలలలో ఇది ప్రెస్‌కు పోతుంది.

పాఠ్య పుస్తకాలు

ఇంటర్మీడియట్, డిగ్రీ తరగతుల పాఠ్య ప్రణాళికలకు సంబంధించిన 21 విషయాలలో వాడబడే పారిభాషిక పదావళిని సంతరించడం, వాటిని గ్రంథాలలో వాడడం ఇదివరలో జరిగిన పనే. ఈ పదావళిని విషయాన్ని బట్టి విభజించి తాత్కాలికమైన పదావళి సంకలనాలు తయారు చేయడం జరిగింది. పరిమితమైన పద్ధతిలో వినియోగించుకోవడం కోసం ఇవి 1973లో మొదట అచ్చయ్యాయి. వివిధాలయిన పునరభ్యసన గోష్ఠుల అనుభవాన్ని పురస్కరించుకొని పఠన పాఠనాదులు నిర్వహిస్తున్న ఆచార్యుల పరిశీలనలను బట్టి 1975–1976 లో ఈ సంకలనాలన్నీ స్థిరరూపాన్ని పొందాయి. ఇప్పుడివి అమ్మకానికి లభించే సంకలనాలుగా అచ్చవుతున్నాయి. ఈ పారిభాషిక పదావళులలో జంతు శాస్త్రానికి సంబంధించింది అచ్చయింది. వృక్ష శాస్త్రానికి సంబంధించింది అచ్చులో ఉంది. మిగిలినవి కూడా తొందరగానే అచ్చవుతాయి.

వైజ్ఞానిక, మానసిక శాస్త్రాలకు సంబంధించిన నిఘంటువులు కూడా తయారవుతున్నాయి. సమాజ, సంఘ సంక్షేమ శాస్త్రాల నిఘంటువు, మానవశాస్త్ర, తత్త్వశాస్త్ర నిఘంటువులు, చరిత్ర, రాజనీతి శాస్త్ర నిఘంటువు అచ్చులో వున్నాయి. ప్రభుత్వ పాలనా శాస్త్ర, జంతుశాస్త్ర నిఘంటువులు, ఛందఃపదకోశం, వ్యాకరణ పదకోశం—అచ్చునకు పోతున్నాయి. మిగిలిన నిఘంటువులన్నీ వివిధ దశలలో 'తయారీ'లో ఉన్నాయి.

వివిధ విశ్వవిద్యాలయాలలో తెలుగులో, తెలుగుమీద పరిశోధనలు చేసిన చేస్తున్న వారికి సంబంధించిన వివరం తెలిపే సంహిత (Digest) ఒకటి "తెలుగు పరిశోధన సంహిత" అనే పేరుతో తయారయి 1976 లో అచ్చయివచ్చింది.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు మొదట్లో సిద్ధం చేసి ముద్రణకోసం తెలుగు అకాడమికి ఇచ్చిన ఇంగ్లీషు–తెలుగు నిఘంటువు సంస్కరణాన్ని పొంది అచ్చుకు సిద్ధమవుతోంది. దీనిలో సగం భాగాన్ని సంపాదకులు సిద్ధంచేసి ఇచ్చారు. ఇది ప్రెస్‌కు పోయింది. మిగిలిన భాగంకూడా త్వరలోనే ప్రెస్‌కు పోతుంది. దీనిలో ఇంచుమించుగా 20,000 ఆరోపాలు ఉంటాయి. విద్యార్థులకిది చాలా ఉపయోగంగా వుంటుంది.

ఈ సంవత్సరం జూన్ 10, 11 తేదీలలో జరిగిన 'ప్రయోజనాత్మకమైన తెలుగు భాష'ను గురించిన సదస్సులో పెద్దలు సూచించిన విధంగా వాణిజ్యానికి సంబంధించిన మాండలిక పదాల సేకరణను, ప్రచురణను బోర్డువారు అంగీకరించారు. నిఘంటు రూపంలో వచ్చే ఈ పనిని అనతికాలంలోనే చేపట్టడం జరుగుతుంది. మామూలుగా వాడుకలో వున్న మాండలిక పదాల సేకరణ ద్వారా వివిధ ప్రాంతాలలో సాంస్కృతికమైన పరస్పర ప్రభావాల పరిశీలన కూడా వారి సూచన ప్రకారం చేయవలసివుంది.

బోధన–శిక్షణ శాఖ

తెలుగు నేర్చుకోవాలనే కుతూహలం ఉన్న తెలుగురాని విద్యావంతులయిన వయోజనులకు ద్వితీయ భాషగా తెలుగు నేర్పడం పునరభ్యసన కార్యగోష్ఠులూ సదస్సులూ నిర్వహించడం, తెలుగు మాధ్యమంలో చదివే విద్యార్థులకు తెలుగులో పాటవాన్ని అధికం చెయ్యడంకోసం కళాశాలలలో తెలుగులో బ్రిడ్జి కోర్సులను నిర్వహించడం, ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదివే పాఠశాలా విద్యార్థులకు మంచి వాచకాలను తయారు చేయడానికి పనికివచ్చే శబ్దజాలాన్ని నిర్ణయించడంకోసం, విద్యార్థుల శబ్ద సంపదను పరిశీలించి సోపానక్రమంలో పౌనఃపున్య పట్టికలను తయారు చేయడం, ద్వితీయ భాషగా తెలుగును బోధిస్తూ వున్న మైసూరు, కేంద్రీయ భారతీయ భాషాసంస్థలకును, పునరధ్యయన కార్యక్రమాల వంటి వాటిలో సాయపడుతూ వుండడం ఈ శాఖ కార్యక్రమాలలో ముఖ్యమైనవి.

ఈ శాఖ ఇంతవరకు మూడునెలల శిక్షణ కాలం ఉన్న 8 ప్రాథమిక శిక్షణ తరగతులను, ఆరునెలల శిక్షణ కాలపరిమితి ఉన్న 4 ఉన్నత శిక్షణ తరగతులను నిర్వహించింది. ఇప్పుడు తొమ్మిదవ ప్రాథమిక శిక్షణ, ఐదవ ఉన్నత శిక్షణ తరగతులు నడుస్తున్నాయి. ద్వితీయ భాషగా తెలుగును నేర్చుకొంటూ ఉన్న ఇతర రాష్ట్రాల వారు, భాషా పరిసరాలను అవగాహన చేసుకోవడానికి వీలుగా ప్రతి సంవత్సరం జరిగే "పర్యటన"లను ఏర్పాటు చేయడంలోను వారికి పునరధ్యయన తరగతులు ఏర్పాటు చేయడంలోను, ఈ శాఖ 5 సందర్భాలలో మైసూరులోని భారతీయ భాషా సంస్థ వారితో సహకరించి పనిచేసింది. ఈ సంస్థవారి అభ్యర్థనానుసారం, 1973 జూన్‌లో—వివిధ ప్రాంతాలలో పాఠశాలలలో తెలుగురాని పిల్లలకు తెలుగు బోధిస్తూవున్న, తెలుగులో శిక్షితులయిన అధ్యాపకులకు (వీరి మాతృభాష తెలుగు కాదు) — మూడు వారాలపాటు రోహతక్ (హర్యాన) లో జరిగిన పునరధ్యయన కార్యక్రమాన్ని నిర్వహించడంలో అకాడమి, ఈ శాఖకు చెందిన ఇద్దరు ఆచార్యులను పంపి సాయపడింది.

కళాశాలా స్థాయిలో భాషేతర విషయాలు బోధించే వివిధ శాస్త్రాధ్యాపకులు తెలుగులో బోధించడానికి వీలుగా వారిని సజ్జీకృతులనుచేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని ఉద్దీపింపజేయడమే లక్ష్యంగా పునరభ్యసన కార్యగోష్ఠులను మూడు విశ్వవిద్యాలయ ప్రాంతాలలోను నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యగోష్ఠులు—1969, 1970–'71, 1972, 1975–'76 సంవత్సరాలలో జరిగాయి. ఈ శాఖ ఆధ్వర్యం కింద జరిగిన ఈ గోష్ఠులలో పరస్పర చర్చలవల్ల, నిపుణుల ఉపన్యాసాలవల్ల, ఇందులో పాల్గొన్న అధ్యాపకులు తరగతి దృష్ట్యా పాఠ్య ప్రణాళిక పరిధిని, పాఠ్య పఠనీయ గ్రంథాల మంచి చెడ్డలను, విలువలను చక్కగా గ్రహించడానికి అవకాశాలు కలిగాయి. అకాడమి ప్రచురించిన ఈ గ్రంథాల పరిశీలనవల్ల వీటిలో వారు సూచించిన సవరణలు, విషయ వివరణ సుబోధకంగా ఉండటానికి వారు చేసిన సూచనలు పుస్తకాల పునర్ముద్రణలో అకాడమికి చాలా సహాయపడుతున్నాయి 1975–76లో జరిగిన నాల్గవ పునరభ్యసన గోష్ఠుల కార్యక్రమాలకు, అకాడమి పాలక మండలి అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాసాంస్కృతిక శాఖామాత్యులు అయిన మాన్యశ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు హైదరాబాదులో ప్రారంభోత్సవం చేయడమేకాకుండా, గుంటూరు తిరుపతులలో జరిగిన ప్రాంతీయ కార్యక్రమాలను కూడా ప్రారంభించారు. మొత్తం కార్యగోష్ఠులలో వందలకొలది అధ్యాపకులు పాల్గొని తెలుగు మాధ్యమంలో వున్న వైశిష్ట్యాన్ని గుర్తించి తెలుగు మాధ్యమం సంపూర్ణంగా విజయవంతం కావడానికి తోడ్పడ్డారు.

ఇండియా, నేషనల్ బుక్‌ట్రస్ట్ వారు 1971 జూన్–జూలైలలో హైదరాబాదులో తెలుగు అకాడమిలో తెలుగు అనువాదకుల శిక్షణ కార్యగోష్ఠిని నిర్వహించినప్పుడు ఈ శాఖ వారితో సహకరించి పనిచేసింది. అంతేకాకుండా, అకాడమిలో పనిచేసే విద్యా విషయకోద్యోగుల ఉపయోగార్థం 1974 ఇదేమాదిరి అనువాదకుల శిక్షణ కార్యగోష్ఠిని ఒకదానిని నిర్వహించింది. 1971 సెప్టెంబరులో ఈ శాఖ ప్రభుత్వం వారు నిర్దేశించిన విధంగా తెలుగు లిపి సంస్కరణ సదస్సు నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. 1974 మే నెలలో భారతీయ విశ్వవిద్యాలయాలలోని తెలుగు శాఖల అధిపతులను, ఆచార్యులను ఆహ్వానించి ఒక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో తెలుగు పఠన పాఠనాదులలో చేయవలసిన మార్పులను గురించిన చర్చలు జరిగి సూచనలు చేయడం ఫలితంగా తేలింది.

ఇంటర్మీడియట్‌లో చేరిన విద్యార్థుల తెలుగు భాషా సామర్థ్యాన్ని ఇనుమడింపజేయడానికి, బోధన భాష మార్పువల్ల వచ్చే సంపూర్ణ లాభాలను వారు పొందడానికి ఈ "బ్రిడ్జికోర్సు" అనేదాన్ని తెలుగు అకాడమి రూపొందించింది, తెలుగులో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచడానికి పనికివచ్చే విధంగా అనుభవజ్ఞులు వ్రాసిన 48 పాఠాలు ఉన్న 'కోర్సు' ఇది. రోజుకు నాల్గు గంటల చొప్పున పన్నెండు రోజులు నిర్విరామంగా జరిగే ఈ కోర్సును పూర్వ నిర్ణీతమైన కళాశాలలలో విద్యార్థులు ఐచ్ఛికంగా వరించి లాభాన్ని పొందాలి అనే ఉద్దేశంతో ఇది రూపొందించబడింది. 1975 జనవరి-ఫిబ్రవరిలో స్థానికంగా ఉన్న రెండు కళాశాలలలో న్యూసైన్స్ కళాశాల, అమీర్‌పేట, నానక్‌రామ్ భగవాన్‌దాస్ సైన్స్ కళాశాల ప్రయోగాత్మకంగా ఇది నిర్వహించడం జరిగింది. ఫలితాలు ఆశాజనకంగా ఉండడంవల్ల ఇంకా కొన్ని కళాశాలలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సును అకాడమి నిర్వహిస్తుంది.

ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదివే పాఠశాలా విద్యార్థుల శబ్దసంపదను నిర్ణీతమైన పద్ధతిలో ఈ శాఖ పరిశీలిస్తోంది. ఇందుకు కావలసిన సామగ్రి, అచ్చయిన కొన్ని వాచకాలలో నుంచి, అయిదు జిల్లాలలో వరంగల్లు, మహబూబ్‌నగర్, కర్నూలు, గుంటూరు, విశాఖపట్టణం సుమారు 17,000 మంది బాలబాలికలు ప్రశ్నావళి పుస్తకాలలో ఇచ్చిన సమాధానాల నుంచి సేకరించడం జరిగింది. ఈ పుస్తకాలలో వచ్చే పదజాలానికి తరగతులవారీగా పౌనఃపున్య పట్టికలు తయారుచేసి సోపాన క్రమంలో పదజాలాన్ని సిద్ధంచేసి వాచకాలు వ్రాసేవారికి, అధ్యాపకులకు సాయపడడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. మొదటి తరగతికి సంబంధించినవని ఈ సంవత్సరాంతానికి పూర్తి అవుతుంది. ఈ కార్యక్రమానికి ఆధారసామగ్రి అయిన శబ్దజాలం 34 లక్షల వరకు ఉంటుంది. ఇది కొన్ని సంవత్సరాలు తీసుకొనే బృహత్పథకం.

తెలుగును అధికార భాషగా వాడటానికి, ప్రభుత్వశాఖలలో పనిచేసే ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి ఒక పథకాన్ని రూపొందించడం జరిగింది. ద్వితీయ భాషగా తెలుగు నేర్చుకొనే వారికి ఉపయోగించే విధంగా ఒక లఘు నిఘంటువు, పదబంధ సంకలనం, వ్యాకరణంలో కొన్ని అంశాలను గ్రహించి తెలుగు హిందీ సాదృశ్య వైరుధ్య పరిశీలన మొదలయిన కార్యక్రమాలు ఈ శాఖలో కొనసాగుతున్నాయి.

నవీనమైన పద్ధతులలో ద్వితీయ భాషాబోధన సాగించడానికి అనువుగా, ఒక భాషా ప్రయోగశాలనుకూడా అకాడమి స్థాపించడానికి నిరయించుకొంది. దీనివల్ల ఇతోధికంగా, తెలుగు నేర్చుకొనే వారికి సౌలభ్యం ఏర్పడుతుంది.

1972 జనవరి నుంచి, "తెలుగు" అనే త్రైమాసిక వైజ్ఞానిక పత్రిక ప్రచురణను కూడా ఈ శాఖ నిర్వహిస్తోంది.

శాస్త్రీయమైన పద్ధతిలో సంస్కృతంలో వాచకాలు వ్రాయడానికి వీలుగా సంస్కృత శబ్దసంపద పరిశీలన పథకాన్ని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇనస్ట్రక్షన్ ప్రత్యేకమైన గ్రాంటుతో అప్పగించగా, ఆ కార్యక్రమాన్ని ఈ శాఖ పూర్తిచేసింది.

ప్రచురణ శాఖ

తెలుగు అకాడమి 1974లో 62 పుస్తకాలను, 1976లో 58 పుస్తకాలను 1–8–1976 నాటికి 31 పుస్తకాలను ప్రకటించింది. ఇప్పటికి 82 పుస్తకాలు అచ్చులో ఉన్నాయి. ఇంకా 146 పుస్తకాలు వివిధ దశలలో తయారీలో ఉన్నాయి. ఇప్పటికి అకాడమి మొత్తం 414

ప్రచురణలు చేసింది. ఇంటర్మీడియట్ పుస్తకాల పునర్ముద్రణ, డిగ్రీ తరగతులలో మొదటి రెండు సంవత్సరాల పుస్తకాల పరిష్కృత పునర్ముద్రణ కార్యక్రమం జరుగుతోంది. ఇంటర్మీడియట్ స్థాయిలో కొత్తగా ప్రారంభం అయిన భూగర్భశాస్త్రం. సమాజశాస్త్రం విషయాలకు సంబంధించిన పుస్తకాలు, వాణిజ్య శాస్త్రంలోను, అర్థ రాజనీతి శాస్త్రంలోను. భౌతికశాస్త్రం, గణాంక శాస్త్రంలోను కొత్తగా చేపట్టిన విషయాలలో పుస్తకాలు ముద్రణకు తీసుకోవడం జరిగింది.

1974-1975 లో ఇంటర్మీడియట్ స్థాయిలో పరిష్కృత పునర్ముద్రణ ప్రారంభించినప్పుడు. రెండు సంవత్సరాల కోర్సుకు పనికివచ్చే విధంగా ఒక్కొక్క విషయానికి రెండు పుస్తకాలు (మొదటి సంవత్సరానికి ఒకటి, రెండవ సంవత్సరానికి ఒకటి) రెండు సంవత్సరాలకు పనికివచ్చేలాగ ఒక ప్రయోగదీపిక ప్రచురించే నిర్ణయం జరిగింది.

అకాడమి ప్రచురణలలో 64 పుస్తకాలు ద్వితీయ ముద్రణను, 25 పుస్తకాలు తృతీయ ముద్రణను, 16 పుస్తకాలు చతుర్థ ముద్రణను, 8 పుస్తకాలు పంచమ ముద్రణను, 2 పుస్తకాలు షష్ఠమ ముద్రణను 3 పుస్తకాలు సప్తమ ముద్రణను, ఒక పుస్తకం అష్టమ ముద్రణను పొందడం ముదావహం. 56 మోనోగ్రాఫులు కూడా కొత్తగా వ్రాయించడం జరుగుతుంది. దీనితో పుస్తకాల సంఖ్య 648 వరకు వస్తుంది.

1974-1976 మధ్య అకాడమి 151 పుస్తకాలు ప్రచురించింది. ఇంటర్మీడియట్ స్థాయి పాఠ్యగ్రంథాలు 66, డిగ్రీస్థాయి పఠనీయ గ్రంథాలు 282, ఇంకో 3 డిగ్రీస్థాయి పుస్తకాలు అచ్చులో ఉన్నాయి.

ఉన్నత స్థాయికి చెందిన ఇంగ్లీషు, సంస్కృత భాషలలో ఉన 25 పుస్తకాల అనువాదాలు అచ్చయ్యాయి 13 పుస్తకాలు అచ్చులో ఉన్నాయి, 18 పుస్తకాలు వివిధ దశలలో తయారీలో ఉన్నాయి

16 మోనోగ్రాఫులు అచ్చయ్యాయి, 12 అచ్చులో ఉన్నాయి 65 మోనోగ్రాఫులు తయారీలో ఉన్నాయి, ఇంకో 56 మోనోగ్రాఫు ను రచనకోసం కొద్దికాలంలోనే తీసుకోవడం జరుగుతుంది

వివిధ శాస్త్ర విషయాలకు సంబంధించిన 18 శాస్త్ర నిఘంటువులలోను 4 అచ్చులో ఉన్నాయి ఇంక నాల్గింటిని కొద్దికాలంలోనే అచ్చుకివ్వడం జరుగుతుంది. మిగిలినవి వివిధదశలలో తయారీలో ఉన్నాయి.

డిగ్రీస్థాయి దాకా తెలుగు మాధ్యమం ఉన్నప్పుడు, పోస్ట్-గ్రాడ్యుయేట్ స్థాయిలో ఆ మాధ్యం కొనసాగడం సహజంగదా. కాని ఇది విశేష ధనవ్యయంతో కూడినది కావడం వల్ల ఈ కార్యక్రమాన్ని అంచెల వారీగా తీసుకోవాలని అకాడమి సంకల్పించింది. ఈ కార్యక్రమంలో మొట్టమొదట—చరిత్ర, రాజనీతి శాస్త్రాలకు సంబంధించిన గ్రంథాలను ప్రచురిస్తే బాగుంటుందని నిర్ణయమయింది. తగిన ప్రయత్నాలు జరుగుతున్నాయి. త్వరలోనే ఇవి ఫలోన్ముఖం అవుతాయి.

'ప్రయోజనాత్మకమైన తెలుగు భాష'ను గురించిన సదస్సులో పెద్దలు తీర్మానించినట్లుగా—"అక్స్ఫర్ పాంప్లెట్ సీరీస్" పద్ధతిలో, వివిధ విషయాలమీద సులభశైలిలో, లఘుగ్రంథాలను అకాడమి ప్రచురించాలి" అనే విషయాన్ని సిద్ధాంతరీత్యా అకాడమి పాలక మండలి అంగీకరించడం ముదావహం.

"ప్రయోజనాత్మకమైన తెలుగు భాష" సదస్సు

అకాడమి లక్ష్యాలలో, అధికారభాషగా తెలుగు పరిపాలన వ్యవహారాలలో ప్రవేశపెట్టి తీర్చిదిద్దడంలో ప్రభుత్వంతో సమన్వయ సహకారం నెరపడం ఒకటి. తెలుగు భాషను వివిధరంగాలలో సుసంపన్నంగా ఆధునిక ప్రమాణాలతో రూపొందించడం మరొకటి. ఈ ఆశయాల, లక్ష్యాల సాధనకు గాను అకాడమి సదస్సులు, సమావేశాలు, గోష్ఠులు మొదలయినవి ఏర్పాటు చేయడం ఉచితమని అంగీకరించబడింది.

ఈ ఆశయాలకు అనుగుణంగా గడచిన జూన్ 10, 11 తేదీలలో తెలుగు అకాడమి, ఆగ్రాలోని కేంద్రీయ హిందుస్థాన్ సహకారంతో ఈ సదస్సును నిర్వహించింది. అధికారభాష, సాంకేతిక విజ్ఞాన, సామాజిక రంగాలలోను, ద్విభాషితా రంగాలలోను తెలుగును పటిష్ఠమైన మాధ్యంగా రూపొందించినదాన్ని గురించి అనేక రంగాలలో అనుభవ పూర్వులైన అధికార అనధికార ప్రముఖులు ఈ రెండు రోజుల చర్చలలోను పాల్గొని తమ అనుభవాన్ని విజ్ఞానాన్ని అందజేశారు. మొత్తం 32 పరిశోధనాత్మకమైన ప్రసంగ వ్యాసాలు చదవడం జరిగింది 151 మంది సదస్సులో పాల్గొని చర్చలు జరిపారు. రెండు రోజులు పాటు ప్రతిరోజూ చర్చాగోష్ఠులు జరిగాయి. ప్రసంగ వ్యాసాల పఠనం తర్వాత జరిగిన చర్చలు, తీసుకొన్న నిర్ణయాలు, సూచనలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి.

సదస్సు చేసిన సూచనలు ఇరవై ఉన్నాయి అవి ఇవి:

1 భారత రాజ్యాంగానికి ముసాయిదా తెలుగు అనువాదాన్ని త్వరలో ప్రకటించాలి.

2. శాసనాలు, చట్టాల, బిల్లుల అధికారిక పాఠాలను మొట్టమొదట తెలుగులోనే సిద్ధంచెయ్యాలి

3 ఇతర భాషాపదాలను ఎరువు తెచ్చుకొని పరిభాష సిద్ధం చెయ్యాలి.

4 పిటిషన్లు మొదలైనవాటి నమూలను ప్రమాణీకరించాలి

5. ప్రతిప్రభుత్వ శాఖలోనూ వాడుక భాషలో నిపుణులైన అధికారు లుండాలి.

6. అన్నిశాఖల్లోనూ ఉన్నత స్థాయిలోకూడా తెలుగు వాడుక పెంచాలి.

7. కావలసినన్ని తెలుగు టైపు రైటర్లు సప్లయి చెయ్యాలి.

8. అధికారభాషగా తెలుగును అభివృద్ధిచేయటానికి కేంద్ర ప్రభుత్వం కూడా సహాయం చెయ్యాలి.

9. ఐ.టి.ఐ. పాలిటెక్నిక్ కోర్సులలో వ్యవసాయ వైద్య రంగాల్లోను కావలసిన పరిభాషను సిద్ధంచేసి తెలుగును బోధన మాధ్యమం చెయ్యాలి.

10. ఒకే విధమైన పరిభాషను అన్ని రంగాల్లోనూ వాడాలి.

11. స్నాతకోత్తర స్థాయిలోకూడా తెలుగును బోధన మాధ్యమంగా ప్రవేశపెటాలి.

12. పాఠ్యగ్రంథాలను చౌకధరలకు అమ్మాలి. గ్రంథాలయాలు వాటిని కొనేటట్లు చెయ్యాలి.

13. ప్రతి శాస్త్ర విషయానికి ప్రత్యేకమైన మాసపత్రికలు ప్రచురించాలి.

14. పాఠ్యగ్రంథ ప్రచురణను జాతీయం చేయాలి.

15. మాండలిక వృత్తిపదాలను సేకరించి నిఘంటువులు నిర్మించాలి.

16. పరిపాలన, న్యాయవ్యవహారాలకు సంబంధించిన పదకోశం తయారు చెయ్యాలి.

17 మాండలిక పదసేకరణచేసి ఉపాధ్యాయ శిక్షణలో ఉపయోగించాలి.

18. ప్రత్యేక నైపుణ్యాలకు కావలసిన ప్రత్యేక పదాలతో బోధన సామగ్రి సిద్ధం చెయ్యాలి.

19. పాఠ్య గ్రంథాలలోని భాష, శైలి సులభీకరించాలి.

20. భారతీయ సమిష్టి సంస్కృతిని అవగాహన చేసుకోవడానికి జాతీయ సమైక్యతను పరిరక్షించటానికి ఇతర భాషలను కూడా మాతృభాషలతో బాటు అధ్యయనం చేయటం ప్రోత్సహించాలి.

అకాడమి తన లక్ష్యాలకు అనుగుణంగా పైవాటిలో కొన్నింటిని అప్పుడే ఆచరణలో పెట్టింది. కొన్ని ఇదివరకే ఆచరణలో ఉన్నాయి. కొత్త కొత్త పరిశోధన పథకాలను అకాడమి చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బృహత్తర లక్ష్యసాధన కోసం రాష్ట్ర స్థాయి తెలుగు భాషాసంస్థగా తెలుగు అకాడమి స్థాపించింది. ఇట్లాంటి సంస్థను స్థాపించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసిన కమిటీ, ఈ సంస్థ అటు ప్రభుత్వంతోను ఇటు విశ్వవిద్యాలయాలతోను సన్నిహిత సంబంధం నెలకొల్పుకోవాలనీ అదిచేపట్టే పథకాలను ఎప్పటిప్పుడు అకాడమి పర్యాలోచించవలసి ఉంటుందని, తెలుగు భాషాభివృద్ధికి సంబంధించిన విధానవిషయాలన్నింటిలోనూ ప్రభుత్వము విశ్వవిద్యాలయాలూ దానిని సంప్రదిస్తూ ఉండేటటు ఒక ఆచారం నెలకొంటుందని తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ ఆచారము చాలావరకు ఈపాటికే నెలకొని ఉంది. ఈ మూడు ప్రభుత్వమూ, విశ్వవిద్యాలయాలు, అకాడమి-కలిసికట్టుగా పనిచేసూ ఉండడం అందరికీ ఆహ్లాదకరమైన విషయం. ఇందుకు తోడ్పడుతూ శక్తివంచన లేకుండా సహాయ సహకారాలందిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, విశ్వవిద్యాలయాలకు, విశ్వవిద్యాలయాల ఆచార్యులకు, కళాశాలల అధ్యక్షులకు, అధ్యాపకులకు, విద్యార్థులకు తెలుగు ప్రజలకు అందరికీ అకాడమి తన కృతజ్ఞతలు తెలుపుకొంటూంది. ★

కవిటం —నాడు : నేడు

(9 వ పేజీ నుండి)

మా గ్రామంలో గ్రామీణ బ్యాంకు రైతులకు అప్పులను సమకూర్చటంతో పాటు పంచదార, వస్త్రాలను కూడా చౌక ధరకు అందజేస్తున్నది. శాశ్వత భవనాన్ని ఈ బ్యాంకు ఏర్పాటు చేసుకొంది. బియ్యం ఆడే మిల్లును ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయంతో మా ఊరి బ్యాంకు ఏర్పాటు చేసుకున్నది.

పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యాక, శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని పునరుద్ధరించడం జరిగింది. తరువాత ఇటీవలకాలంలో ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చటానికి వెయ్యి రూపాయలు విరాళాన్ని ప్రజలు అందజేశారు. ఉన్నత పాఠశాలగా మార్చటానికి ప్రజలు కృషి చేస్తున్నారు. హరిజనవాడలో పాఠశాల నిర్మాణానికి గాను కవిటం పంచాయతీ మూడు వేల రూపాయలు విరాళం ఇచ్చింది. కవిటంలో సోడూరు పంచాయతీ సమితి ఆధ్వర్యంలో ఆరు ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి.

కవిటం పంచాయతీకి ఉపాధ్యక్షులుగా ఉన్న శ్రీ కర్రి రెడ్డియ్య గారు మా గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను కల్పించుకున్నారని చెప్పుతూ పంచాయతీ చెరువులలో చేపల పెంపకంవల్ల 6430 రూపాయలు, సంతను నిర్వహించడం వల్ల 2,865 రూపాయలు, ఆదాయం సంపాదిస్తున్నది. రైతులకు పోరంబోకు భూములపై కొబ్బరిచెట్లు వేసి పెంచుకొనేలా ప్రోత్సహించింది. ఈనాడు మా గ్రామ పంచాయతీలో 1,511 కొబ్బరి మొక్కలను రైతులు వేసుకొన్నారు. కొబ్బరి మొక్కకు 5 రూపాయల చొప్పున 7,555 రూపాయలు ఆదాయం సంపాదిస్తున్నది. మా గ్రామ పంచాయతీ సాలుసరి ఆదాయం 37,000 రూపాయలని అన్నారు.

పౌర సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆదాయాన్ని పెంపొందించుకొనటంలో అద్వితీయమైన కృషి చేసిన మా కవిటం గ్రామపంచాయతీ ఆదర్శంగా రూపురేఖలు దిద్దుకొంటున్నది. యువకులైన శ్రీ సత్తి వెంకటరెడ్డి నాయకత్వం, ఈ ప్రగతికి దోహదం చేసిందని ఘంటా పథంగా చెప్పగలను.

సీ రి య ల్ :



హరిజన వాడ

— శ్రీ ఉన్నవ మదన మోహనరావు

-6-

'అమ్మాయ్, లక్ష్మీ ! ఒకసారి ఇటురా తల్లీ !' తన గదిలో కూర్చొని పిలిచాడు చౌదరి కుమారైను.

'ఏమిటి నాన్నా? పిలిచారా !' అంటూ లక్ష్మి గుమ్మం దగ్గరికి వచ్చి నిలబడింది చేతిలోని పుస్తకంలో వేలువుంచి మడత పెట్టి పట్టుకొని.

'ఏమిచేస్తున్నావమ్మా? అన్నాడు చౌదరి ఎంతో లాలనగా.

'మాలపల్లి' నవల చదువుకుంటున్నాను నాన్నా!' సమాధాన మిచ్చింది లక్ష్మి.

'ఎప్పుడూ చదువేనటమ్మా! రా లోపలికి వచ్చి కూర్చో! నీతో ఒక ముఖ్యమైన విషయం మాటాడాలి!' అన్నాడు చౌదరి.

లక్ష్మి లోపలికి వచ్చి తండ్రికి ఎదురుగా సోఫాలో కూర్చుంటూ, 'మరి ఏం చేయమంటారు నాన్నా ! లంకంత ఇల్లు! మరి నీవేమో ఎప్పుడూ ఆవూరు, ఈవూరు తిరుగుతూ వుంటావాయె. ఈ పుస్తకాలే నాకు స్నేహితులు. వీటితోటే కాలక్షేపం!'

'నిజమే, తల్లీ ! ఇన్నాళ్లూ నీ సంగతే నేను పట్టించుకోలేదు! ఏదో నా గొడవలే నావిగాని, లంకంత ఇంటిలో నిన్ను ఒంటరిగా విడిచి పోతున్నాననే ఆలోచనే రాలేదు నాకు! అందుకనే నిన్ను ఒక అయ్య చేతిలో పెడదామని అనుకుంటున్నాను ! అప్పటికి నా బరువు తీరుతుంది ! బాధ్యత తీరుతుంది!?'

'అయితే నేను నీకు అంత భారంగా వున్నానా నాన్నా!'

'భారం అంటే, పెళ్లీడు వచ్చిన ఆడపిల్లను ఎప్పటికయినా ఒక ఒక అయ్య చేతిలో పెట్టవలసిందేగా తల్లీ!'

'ఇప్పుడు అంత తొందర ఏమొచ్చింది నాన్నా!' అన్నది సిగ్గుతో తల వంచుకొని లక్ష్మి.

'నాకు తొందరేనమ్మా! నీకు తొందర లేకపోవచ్చును గాని ! మీ అమ్మే గనక బ్రతికివుంటే ఈ పరికి నీ పెండ్లి చేయమని ఎన్నిసార్లు నన్ను వత్తిడి పెట్టేదో !'

భార్య స్మృతికి రాగానే చౌదరి కన్నులు చెమర్చాయి ! లక్ష్మి కూడ తండ్రి చూడకుండా కొంగుతో కళ్లు అద్దుకున్నది !

'ఏమోనమ్మా ! ఒక్కగానొక్క పిల్లవి ! ఆడ పిల్లను ఇచ్చుకునేటప్పుడు కలిగిన ఇంట్లో ఇవ్వమన్నారు పెద్దలు. అందుకనే కాస్త కలిగిన సంబంధంకోసం ఇన్నాళ్లూ చూస్తున్నాను !'

'మన ఆస్తి మనకు చాలదా నాన్నా !'

'చాలదని కాదమ్మా ! మన అంతస్తుకు తగ్గ సంబంధం తేవాలా మరి? లేకపోతే నలుగురూ ఏమనుకుంటారు?' అందుకనే మొన్న ఒక సంబంధం చూశాను! పిల్లవాడు ఇంజనీరు ! వరంగల్లులో స్వంతంగా ఫరం పెట్టాడు. ఏ క్లాసు కాంట్రాక్టులన్నీ వాళ్ల వే. తల్లీ తండ్రికి ఒక్కడే కొడుకు ! బాగా స్థితిమంతులు. వయసు కూడ ఎక్కువలేదు! ఇరవై అయిదు, ఇరవై ఆరు సంవత్సరాలు వుంటాయేమో ! అందగాడనే చెప్పవచ్చు ! రేపు ఆదివారం నిన్ను చూడటానికి వస్తామని చెప్పారు.'

లక్ష్మి గుండెలో రాయి పడింది ! నాన్న ఇంత త్వరగా సంబంధం తెస్తాడని అనుకోలేదు ! మౌనంగా వుండి పోయింది.

'చూడుతల్లీ ! నీకు ఎలా చెప్పాలో నాకు తెలియటంలేదు ! ఈ సంబంధం నాకు పూర్తిగా నచ్చింది. పిల్లవాడు రూపసి. అందులో సందేహంలేదు ! అయినా నీకు నచ్చితేనే చేసి కొందువుగాని ! నీకు నచ్చని సంబంధం నేను మాత్రం బలవంతంగా చేస్తానా? వాళ్ళు వస్తారుగా? పిల్లవాణ్ని చూసిన తరువాత నీ అభిప్రాయం చెప్పు ! నీకు కూడ పిల్లవాడు నచ్చుతాడనే నా నమ్మకం !' అన్నాడు చౌదరి ఉద్విగ్నంగా !

లక్ష్మికి ఆ రాత్రి ఆలోచనలతో నిద్ర పట్టలేదు ! తనకు కాబోయే భర్త ఎటువంటి వాడో? స్త్రీని గౌరవించేవాడో లేక బానిసగా చూసేవాడో? లేక విలాస వస్తువుగా పరిగణించేవాడో?

తన అభిప్రాయాలను మన్నించేవాడు లభిస్తాడో లేదో చెప్పటం కష్టం.

అయినా ఈ పెళ్ళిళ్ళు ఏమిటి? ముక్కూ మోహం తెలియని ఇద్దరు ఒకసారి చూడగానే ఒకళ్ళ నొకళ్ళు ఏలా అర్థం చేసికో గలుగుతున్నారు? వివాహానికి కావలసినది ప్రేమకదా? ఆ ప్రేమ స్త్రీ పురుషులు భార్యా-భర్తలుగా మారగానే కలుగుతున్నదా? ప్రేమ కలుగటానికి సహచర్యం అవసరంకదా? అట్టి సహచర్యం లేనిదే ప్రేమ ఎలా ఉద్భవిస్తుంది? అందుకనే పాశ్చాత్య దేశాలలో స్త్రీ పురుషులు కొంతకాలం స్నేహం నెరిపిన తరువాతగాని వివాహం చేసికోరు ! అయినా అక్కడ వివాహ జీవితం మన దేశంలో వున్నంత పటిష్టంగా లేదు. విడాకులు వారి పెండ్లిళ్లను వెన్నంటి వస్తున్నవే? కారణం ఏమిటి?

మరి మన దేశంలో సహచర్యం లేకుండానే ముక్కూ మొహం తెలియని వాళ్ళు పెళ్ళి చేసికొని తరువాత ప్రేమించు కొనగలుగుతున్నారే? వారి జీవితాలు సుఖప్రదంకూడ అవుతున్నాయిగదా !

ప్రేమ వివాహాలు, వర్ణాంతర వివాహాలు ఇటువంటి వాటికి దంపతులకు ఆత్మబలంకావాలి. ప్రకాశం ఒకసారి చెప్పాడు !

ప్రకాశం సంగతి గుర్తుకు రాగానే తనకు ఎందుకింత ఉల్లాసం కలుగుతున్నది?

తను ప్రకాశాన్ని ప్రేమిస్తున్నదా ? ఏమో చెప్పలేదు ! ప్రకాశాన్ని చూసినా, ప్రకాశంతో మాటాడినా తనకు తెలియకుండానే పరవశం ఎందుకు కలుగుతున్నట్లు? ఇది సహవాస జనితమైన ప్రేమయేమో !

తను ప్రకాశాన్ని ప్రేమిస్తున్నదా ! ఈ ప్రశ్న ఏ వంద సార్లో వేసికొన్నది లక్ష్మి !

మరి ప్రకాశం తనను ప్రేమిస్తున్నాడా ! అది ఎలా తెలుస్తుంది. ప్రకాశం నిండుకుండ వంటి వాడు. తొణకడు—బెణకడు. ప్రకాశం లోకపు రీతులు ఎరిగినవాడు. అందుచేతనే ఒక వేళ తాను నన్ను ప్రేమించినా బయటకు వెళ్ళ బుచ్చలేదేమో, సమాజంలో వున్న అంతస్థులు చూసి వూరుకొని వుంటాడు. కాని ప్రకాశానికి అటువంటి భేదభావం లేదు కదా ! అయినా హరిజనుడు గదా ! తన కోరికను వెలిబుచ్చే అవకాశం ప్రకాశానికి వుండదు ! ఒకవేళ తను ప్రేమిస్తున్నానని చెపితే ఏమంటాడో ?

ప్రకాశం హృదయాన్ని తను ఎంతో లోతుగా పరిశీలించింది. ప్రకాశానికి తనంటే అభిమానం వున్నది. కాని తను అందని ద్రాక్ష పండు అనుకొని వుంటాడా !

ఆలోచనలతోనే తెల్లవారి పోయింది లక్ష్మికి.

ఆదివారం వచ్చింది.

ఆ రోజు భార్యను ఎన్నిసార్లు తలచుకున్నాడో చౌదరి. జీవితంలో ఎన్ని వుంటేనేం ఇల్లాలు లేని ఇల్లు దీపం లేని ఇల్లు ఆ లోటు తీరేది కాదు.

అప్పలమ్మ లక్ష్మికి అలంకరణ చేసింది। సాయంత్రం మూడు గంటలకల్లా పెళ్లికొడుకు, తల్లీ—తండ్రీ వచ్చారు.

చౌదరి అందరిని ఆప్యాయంగా ఆహ్వానించాడు. కుశల ప్రశ్నలు అయిన తరువాత అందరూ హాలులో సోఫాలలో కూర్చున్నారు. లక్ష్మికూడ వచ్చి తండ్రి పక్కనే సోఫాలో కూర్చుంది.

అప్పలమ్మ అందరికి ఫలహారాలూ-కాఫీలు అందించింది.

పెండ్లికొడుకు పేరు రవి కుమార్. అందగాడనే చెప్పవచ్చు. మంచి ఖరీదైన సూటు వేసికొన్నాడు. ఉంగరాలు తిరిగిన జుత్తు, గౌరవర్ణం, కళ్ళు ముక్కూ తీర్చి దిద్దినట్టుగా వున్నాయి ! కళ్ళలో కొంటెతనం తొంగి చూస్తూ వున్నది.

లక్ష్మిని చూస్తూ వుండిపోయాడు రవికుమార్. లక్ష్మి కూడ రెండు మూడు సార్లు తలెత్తి రవికుమార్ వైపు చూసింది.

'ఏం పేరమ్మా !' అడిగింది రవికుమార్ తల్లి నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ.

'లక్ష్మి'—జవాబిచ్చింది.

'లక్ష్మి' లాగనే వున్నది. అనుకున్నది మనసులోనే రవికుమార్ తల్లి.

ఇంకా ఏవో రెండుమూడు ప్రశ్నలు అడిగింది పెళ్లికొడుకు తల్లి. లక్ష్మి అన్నింటికి సమాధానం చెప్పింది.

'నేను కొన్ని ప్రశ్నలు అడగవచ్చా అమ్మాయిని ?' అన్నాడు రవికుమార్ చౌదరి గార్ని ఉద్దేశించి.

'ఓ దానికేం ? తప్పక అడగండి ! ఈ రోజుల్లో యువతీ యువకులు వివాహానికి పూర్వం ఒకరి అభిప్రాయాలు అభిరుచులు తెలుసుకొన గోరటంలో తప్పేమీ లేదు !' అన్నాడు చౌదరి.

'చూడండి లక్ష్మిగారూ ! మీకు సంగీతం వచ్చా ?' ఇంటర్వ్యూలో కేండిడేట్‌ను ప్రశ్నించిన అధికారిలా పోజుపెట్టాడు రవికుమార్.

'రాదండి !' ముక్తసరిగా జవాబిచ్చింది లక్ష్మి.

(సశేషం)

రాజధాని విశేషాలు

భూగర్భ సంపదపై శ్రీ ఖండారే సూచన:

రాష్ట్రగవర్నర్ శ్రీ ఖండారే డిసెంబర్ 4 వ తేదీన భారత భూగర్భ పరిశోధన సంస్థ 125 వ వార్షికోత్సవం ప్రారంభిస్తూ, భూగర్భ సంపదను వెలికి తీయడం ద్వారా భారత దేశ ఆర్థికాభివృద్ధికి స్థిరత్వం చేకూర్చాలని, దీనితోపాటు మానవుల మేధా వికాసానికి, మూఢ విశ్వాసాలను తొలగించడానికి పాటు పడాలని శాస్త్రజ్ఞులను కోరారు.

ముఖ్యమంత్రి మూడేళ్ళ పాలన

ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు పదవీ బాధ్యతలను స్వీకరించి డిసెంబరు 10వ తేదీకి మూడు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, నగర కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రిని అభినందించారు. నగర కాంగ్రెస్ కార్యవర్గం అధ్యక్షుడు శ్రీ కొత్తూరు సీతయ్యగుప్త అధ్యక్షతన సమావేశమై ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం సాధించిన విజయాలను పేర్కొంటూ, ఆయనను అభినందిస్తూ తీర్మానించింది.

రాష్ట్ర కురుమ మహాసభ అభ్యర్థన

వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి శ్రీ కె. వి. నరసప్ప అధ్యక్షతన డిసెంబర్ 12, 13వ తేదీలలో లేడీ హైదరీక్లబ్బులో జరిగిన రాష్ట్ర కురుమ మహాసభ రాష్ట్రంలో ఉన్ని బోర్డు ఏర్పాటు చేయాలని, ఉన్ని పరిశ్రమ వ్యవహారాలను చూడటానికి ప్రత్యేక డైరెక్టరేటు స్థాపించాలని, కురుమలను షెడ్యూల్డు తరగతుల జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. గవర్నరు శ్రీ ఖండారే ప్రారంభోత్సవం చేశారు. మంత్రులు శ్రీయుతులు చొక్కారావు, కేశవులు, అంజయ్య, రాజారామ్, శ్రీమతి కృష్ణవేణి సంజీవయ్య మున్నగు వారు ప్రసంగించారు. మహాసభ ముగింపు సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, మహాసభ తీర్మానాలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు.

అలీయావర్ జంగ్ అంత్యక్రియలు

డిసెంబర్ 11వ తేదీన బొంబాయిలో మరణించిన మహారాష్ట్ర గవర్నర్ శ్రీ అలీయావర్ జంగ్ భౌతికకాయాన్ని ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తీసికొనివచ్చి అమీర్‌పేటలోని ఆతని పూర్వుల సమాధులవద్ద రాజలాంఛనాలతో ఖననముచేశారు. గవర్నర్, ముఖ్య మంత్రి, పలువురు ప్రముఖులు అలీయావర్ జంగ్ గుణగణాలను, పరిపాలనా దక్షతను పాండిత్యాన్ని గురించి ప్రసంగించారు. అలీయావర్ జంగ్ తాను సేకరించిన ఉర్దూ, పార్సి, ఇంగ్లీషు అపూర్వ పుస్తకాలు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి బహూకరించినట్లు విశ్వవిద్యాలయంలో జరిగిన సంతాప సభలో వైస్‌ఛాన్సలర్ శ్రీ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు.

సాలార్ జంగ్ మ్యూజియం రజతోత్సవం

డిసెంబర్ మూడవ వారంలో సాలార్‌జంగ్ మ్యూజియం రజతోత్సవాలు వైభవంగా జరిగాయి. కేంద్ర విద్యా శాఖా మంత్రి శ్రీ నూరుల్ హసన్ ఉత్సవాలు ప్రారంభిస్తూ, ఈ మ్యూజియం దేశ సంస్కృతిని ప్రతిబింబించే కేంద్రమని ప్రశంసించారు. ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించిన గవర్నర్ శ్రీ ఖండారే మ్యూజియంలు సాంస్కృతిక పునరుజ్జీవనానికి దోహదంచేస్తా యన్నారు. రాష్ట్రవిద్యా శాఖా మంత్రి శ్రీ మండలి వేంకట కృష్ణారావు మ్యూజియంల నిర్వాహకుల సభకు ప్రారంభోత్సవం చేశారు. ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. తంతి తపాలా శాఖ ప్రకటించిన ప్రత్యేక తపాలా బిళ్లను శ్రీ నూరుల్ హసన్ విడుదల చేశారు. ప్రారంభంలో సాలార్‌జంగ్ వంశీయుడైన నవాబ్ అబ్బాస్ యార్ జంగ్ స్వాగతం చెప్పారు.

వివేచన పత్రిక ప్రారంభోత్సవం

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రారంభించిన పరిశోధనాత్మక పత్రిక 'వివేచన' ప్రథమ సంచికను డిసెంబర్ 17వ తేదీన వైస్‌ఛాన్సలర్ శ్రీ జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తూ, విద్యా ప్రమాణాలు పెంపొందడానికి ఉత్తమబోధనతోపాటు పరిశోధన కూడ అవసరమనిఅన్నారు. 'వివేచన' ప్రామాణికమైన పత్రికగారూపొందాలని కోరారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ బి. రామరాజు స్వాగతం చెబుతూ, తెలుగుశాఖ కృషిని వివరించారు. అధ్యక్షత వహించిన ఆర్ట్సుకళాశాల ప్రిన్సిపాల్ శ్రీ రామరెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇదివరకు మూడు శాఖలు పత్రికలు ప్రచురిస్తున్నాయని, ఇది నాల్గవ శాఖ అని వ్యాసాల ఎన్నికకు నిపుణుల సంఘం వుండాలని సూచించారు. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం విశ్వవిద్యాలయాలలో పరిశోధన ప్రాధాన్యం వివరించారు. విశ్వవిద్యాలయంలోని వారి సృజనాత్మక కృషి ప్రచురణకు మరొక పత్రిక ఉండాలని డాక్టర్ సి నారాయణ రెడ్డి సూచించారు.

నాటక రంగానికి శ్రీ రంగారెడ్డి హామీ

రాష్ట్ర ఆర్థిక సమాచార శాఖల మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి డిశంబర్ 20వ తేదీన గాంధీభవన్‌లో రంగస్థల కళాకారుల సప్తమ మహాసభకు ప్రారంభోత్సవం జరుపుతూ, రాష్ట్రంలో నాటకకళాభివృద్ధికి ప్రభుత్వం అన్నివిదాల తోడ్పడుతుందన్నారు. సాంస్కృతిక వ్యవహారాలకు ప్రత్యేక డైరెక్టరేట్ ఉండాలని ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ బి కృష్ణంరాజు చేసిన సూచనను మంత్రి పరిశీలిస్తామన్నారు. అధ్యక్షతవహించిన శ్రీమతి కమలాదేవి ఛట్టోపాధ్యాయ నాటక కళ విశిష్టతను వివరించారు. చలనచిత్ర నటిశ్రీమతి జమునారామణారావు, సంగీత నాటకఅకాడెమి అధ్యక్షుడు శ్రీ కె. వి. గోపాలస్వామి, శ్రీ. పి. గోవిందచౌదరి, శ్రీ నేరెళ్ల వేణుమాధవ్, డాక్టర్. సి. నారాయణరెడ్డి మున్నగువారు నాటక కళ గురించి ప్రసంగించారు.

—శ్రీ తిరుమల రామచంద్ర

చేనేత, చేతి పరిశ్రమల సరుకులకు విదేశాలలో మార్కెట్లు

డాక్టర్ ఆర్. వి. రావు

చాల కాలం నుండి, శతాబ్దాలుగా, ఆంధ్రప్రదేశం నుండి చేతిపరిశ్రమలు, చేనేత వస్త్రాలకు విదేశాలలో చాల గిరాకీవుండేది. వీటిని అచ్చట అమ్మి, మనకు కావలసిన సామగ్రి విదేశాల నుండి మనం తెచ్చుకుంటూవుండేవారం. కనుక వాటి వలన విదేశమారకం మనకు లభించటమేగాక, మన సంస్కృతి, నాగరికత విదేశాలకు పోయే అవకాశం మనకు వుండేది. బ్రిటిషు యుగంలో, యీ అవకాశం పోవటమేకాక, మనకు విదేశములతో స్వతంత్ర వ్యాపారం చేసికొనే భాగ్యం పోయింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాకా, తిరిగి మన కుటీర పరిశ్రమలకు ప్రభుత్వం దోహద మిచ్చారు. దానితో మన రాష్ట్రంలోని చేతి పరిశ్రమల సరకులకు విదేశాలలో మార్కెట్లు రావటం మొదలుపెట్టాయి.


మన సరకులు, అందచందాలకు పెట్టింది పేరు. కలంకారి వస్త్రాలు అతి పురాతనం నుండి, విదేశాలకు ఎగుమతి అయ్యేవి. మన దేశం సందర్శించిన యాత్రికులు, మన సరకులు చూసిన పెద్దమనుషులు యిచ్చిన అభిప్రాయాలు చదివుతే, మన చేతి పరిశ్రమలకు గొప్ప విశిష్టత వున్నదని తెలుస్తుంది. ఎరిత్రియన్ సముద్రానికి చెందిన పెరిప్లసీ వ్రాయుచు మచిలీపట్నం(బందరు) ప్రాంతంలో, ముస్లిములు, యితర రంగుల అద్దకాల బట్టలు దొరికేవని, వర్ణించాడు. ఫ్రెంచి తత్వజ్ఞుడు బందరు అద్దకాలంటే ఫ్రెంచివారికి ఎంతో యిష్టమని, అవి ఆదర్శ ప్రాయంగా వుంటాయని వ్రాశాడు. కలంకారి బట్టలగురించి పురాణములలోకూడ పేర్కొనబడింది. 1618–22 సంవత్సరముల లోవి ఇంగ్లీషు ఫ్యాక్టరీ రికార్డుల ప్రకారం వరంగల్‌లో నేసిన బట్టలు పారిశ్రామిక దేశములో కొనేవారని తెలుస్తుంది. పశ్చిమ గోదావరిజిల్లా నరసాపురంలో గొప్ప నాణ్యమైన ఓడలు నిర్మించి, అక్కడనుండి ఎర్రసముద్రం తూర్పుదేశాలలో వర్తకవ్యాపారాలు చేసేవారని, ఈ రికార్డుల రూపేణా తెలుస్తుంది.

ఏది ఎట్లున్నా ఆధునిక దేశాలు తాము తయారుచేసుకొన్న సరకులు విదేశాలకు పంపి, విదేశమారకం సంపాదించి, దానితో మనకు కావలసిన సరకులు దిగుమతి చేసుకోవాలి. ఎగుమతులకు మించిన సరకులు దిగుమతిచేసుకొంటే, మనకు నష్టం జరుగును. ఇదివరలో వ్రాసినట్లు బ్రిటిషువారి కాలంలో మన ముడిసరకులు అక్కడకు ఎగుమతి చేసికొని, వాటిని వస్తువులుగా మార్చి దిగుమతి చేసేవారు. ప్రత్తి వాటికి ఎగుమతిచేసి, వస్త్రాలు దిగుమతి చేసికొనేవారము. దానితో ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లాయి. అంతేకాక బ్రిటీషువారి కాలంలో మన కుటీరపరిశ్రమలు నాశనం



మహబూబ్ నగర్ నూలుమిల్లుకు ప్రారంభోత్సవం చేస్తూన్న ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు.

చేశారు. ముస్లిముప్రభువులు వాటి అభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారు. దానికి కారణం వారు యీ దేశంలోనే వుండుటకు సిద్ధపడ్డారు. మనకు స్వాతంత్ర్యం వచ్చాకా, మన పరిశ్రమలకు, ముఖ్యంగా కుటీరపరిశ్రమలకు ఆర్థికప్రగతిలో గొప్ప స్థానం యిచ్చి, వాటి అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో తోడ్పడ్డారు. ఎంత చెప్పినా, ప్రపంచ మార్కెట్లలో, భారతదేశ భాగం చాల తక్కువశాతం మాత్రమే. దానిలో 5 శాతం మాత్రమే, ఆంధ్రప్రదేశానికి దక్కుతోంది. ఇది చాల శోచనీయం, 1965–75 లో, 45 కోట్ల విలువ గల సరకులు ఎగుమతి చేశాం. 1974–75లో, ఇది 164 కోట్లకు పెరిగింది. మనకు ప్రకృతి సౌకర్యాలు బాగా వున్నాయి. ఈ హంగులు బాగా వుపయోగించి మనం, మన ఉత్పత్తిచేసిన సరకులు వివిధ దేశాలలో అమ్మాలి. తగు వాతావరణం, తేవటానికి ప్రభుత్వము చాల తోడ్పడుతోంది. మన రాష్ట్రపు ఎగుమతులు చూస్తే 1974–75లో చేసిన 164కోట్ల ఎగుమతులలో, 73 కోట్ల రూపా



మహబూబ్‌నగర్ నూలుమిల్లు ప్రారంభోత్సవం నాడు ముఖ్యమంత్రి ప్రసంగం. చేనేత శాఖమంత్రి శ్రీ కె. వి. కేశవులు చిత్రంలో వున్నారు

యల విలువగల పొగాకు, 43 కోట్ల విలువగల చక్కెర, 4 కోట్ల విలువగల అభ్రకం, 4 కోట్ల విలువగల ఆముదం నూనె, 2 కోట్ల విలువగల చందనంనూనె, తదితర వస్తువులు వున్నాయి. మన రాష్ట్రం నుండి ఎర్రచందనం, చేనేత వస్త్రాలు, తయారయిన దుస్తులు, చేతి పరిశ్రమలసరకులు, తాటిపీచు, మొదలగు వస్తువులు ఎగుమతులలో వున్నాయి ముఖ్యంగా, మన చేనేత, చేతి పరిశ్రమల సరకుల ఉత్పత్తి ఎంతో హెచ్చుచేయటానికి వీలుంది. దీనికి కారణం, మన రాష్ట్రంలో 6 లక్షల చేనేత మగ్గాలేకాకా, లక్షలాది హస్తకారులు కూడ వున్నారు వారికి ఎన్ని కష్టాలు వచ్చినా ఓర్చుకోగల శక్తి వుంది. మన ప్రయత్నాలు కూడ ఫలితాలిస్తున్నాయి.

మన రాష్ట్రంలో 6 లక్షలకు పైగా చేనేత మగ్గాలున్నాయి. అనేక రకాల చేనేతవస్త్రాలు తయారు అవుతున్నాయి. ఇప్పటి వరకు ఇతర రాష్ట్రాలు కొన్ని బట్టలుకొని వాటిని. వారి రాష్ట్రాల నుండి పంపటంవలన ఆబట్ట ఆ రాష్ట్రాలకే అని అందరు అనుకొనేవారు. అనుకొనుచున్నారు కూడ. అంతేకాక, వాటిని మద్రాసు, బొంబాయి రేవు పట్టణాల నుండి పంపేవారు. శ్రీ కె. వి. కేశవులు చేనేత మంత్రి అయ్యాక, రాష్ట్రంలోనే రెడీమేడ్ దుస్తులు తయారు చేయించి, నేరుగా విదేశాలకు పంపే ఏర్పాటులు చేశారు. ప్రభుత్వం స్థాపించిన Fedaration of GovernmentMaker's Co-operatives, A.P. Textile Development Corporation, యీ విషయంలో యెంతో పనిచేస్తున్నాయి. ఈ నాడు పట్నంలోను, యితర ప్రాంతాలలోను 3000 షర్టులు రోజూ తయారు అవుతున్నాయి. ఇప్పటి వరకు 20 లక్షల రూపాయల విదేశమారకం సంపాదించాం. మంత్రి శ్రీ కేశవులుగారు A. P. State Trading Corporation అధ్యక్షులు శ్రీ కె. పున్నయ్యగారు యీ రంగంలో అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారు.

చేనేత, చేతి పరిశ్రమల అభివృద్ధికి మనం ఎంతో చేయవచ్చు. అందచందాల వస్తువులు మనం ఎన్నో చేస్తున్నాం. విదేశాలలో గొప్ప మార్కెట్లు వున్నా లాభం తీసుకోలేకున్నాం. ఒకసారి కీ॥ శే॥ కళా వెంకట్రావుగారు, కొండపల్లి బొమ్మలకు వ్యాగన్లలో పంపినా గిరాకీ వున్నా, ఎద్దుబండ్లలో పంపే ఉత్పత్తి కూడ లేక పోవుట చాల శోచనీయమన్నారు. దానిలో చాల సత్యముంది. ఇవి మన సాంస్కృతిక రాయబారులు. విదేశమారకం లభించేటట్లు చేస్తాయి గనుక, వీటి అభివృద్ధికి మనం నడుంకట్టుకోవాలి.

ఈ నాడు మనరాష్ట్రం చేనేత, చేతి పరిశ్రమల సరకులు విదేశాలలో అమ్ముతున్నారు, ఆ వివరాలు :—
యీ క్రింద యిచ్చిన పట్టీ బట్టి తెలుస్తుంది.

వస్తువులు	ఎగుమతి చేసికొంటున్న దేశాలు
లుంగీలు, సరగులు	దక్షిణ తూర్పు ఆసియా, ఆఫ్రికా.
సిల్కులు	యూరప్, ఆస్ట్రేలియా, అమెరికా, జపాను.
మదరాసు చేతిరుమాళ్లు (మదరాసు నుండి ఎగుమతి అవుతున్నాయి గనుక యీ పేరు వచ్చింది)	నైజీరియా, ఘనా, జాంబియా, యితర ఆఫ్రికన్ దేశాలు.
షర్టులు	అమెరికా, పశ్చిమ జర్మనీ, యితర దేశాలు.
కంబళ్లు	సిలను
హిమ్రు	అమెరికా, జపాన్
కలంకారి	అమెరికా, జపాన్
బిద్రి	అమెరికా
లేసు	ఆస్ట్రేలియా, పశ్చిమ జర్మనీ, అమెరికా.
ఆట సామానులు నిర్మల్	అమెరికా
యీతాకుల బుట్టలు	అమెరికా

పైన సూక్ష్మంగా వ్రాసిన దానిని బట్టి, మన రాష్ట్రం నుండి, విదేశాలకు చేతి, చేనేత పారిశ్రామిక వస్తువులు పోవచ్చునని మనకు తెలుస్తుంది. కాని విదేశమారకం, లభించాలంటే, మనం మన వనరులను మంచిగా వుపయోగించుకోవాలి.

ఆంధ్రప్రదేశం, చేనేత, చేతి పరిశ్రమల ఎగుమతి వలన విదేశమారకం సంపాదించటమేగాక, తన సంస్కృతి, నాగరికత విదేశములకు పంపగలదు. ప్రాచీనకాలంలో ఆంధ్రులు విదేశాలతో వర్తక వ్యాపారాలు చేసేవారు. తిరిగి ఆ సువర్ణయుగం మన రాష్ట్రానికి వచ్చేటట్లు చేయటానికి మనం నడుం కట్టుకోవాలి. మార్కెట్లను కూడ మనం సరిగా పరిశీలించాలి. ఈ పరిశ్రమలు ఆర్థికంగా వెనుకబడ్డ వారికి, ఉపాధి సౌకర్యాలు యిస్తాయి గనుక, ప్రధాని 20 అంశాల ప్రణాళికలో వీటికి ప్రత్యేక స్థానం వుంది గనుక మనం యీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసికోవాలి.

భారత యువజనోద్యమ నాయకుడు

సంజయగాంధీ

ఆంధ్ర ప్రదేశ్ సందర్శన......

భారత యువజనోద్యమ నాయకులు శ్రీ సంజయగాంధీ సతీమణి సమేతంగా డిసెంబరు 24, 25 తేదీలలో ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించారు. మూడుసార్లు తుఫానుకు గురయై అనేక కష్ట నష్టాలను ఎదుర్కొంటున్న మన రాష్ట్రంలో వివిధ ప్రాంతాలను పరిశీలించి, ప్రజలను కలుసుకుని ప్రత్యక్షంగా మాట్లాడి వారి కష్టాలను తెలుసుకుని శాయశక్తులా సహాయం చేయడానికి ప్రయత్నించడమే శ్రీ సంజయ్ పర్యటనలో ప్రధానోద్దేశం.

సరిగ్గా డిసెంబరు 24వ తేదీన 8-15 గంటలకు విమానం దిగిన శ్రీ సంజయ్‌గాంధీ దంపతులకు బేగంపేట విమానాశ్రయంలో అఖండ స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు మంత్రివర్గ సహచరులు, ఎ.పి.పి.సి. అధ్యక్షులు శ్రీ మునలయ్య, కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ అర్స్, పార్లమెంటు సభ్యులు శాసన సభ్యులు, యువజన కాంగ్రెసు కార్యకర్తలు, అధికార ప్రముఖులు శ్రీ సంజయ్‌గాంధీ దంపతులకు హార్దిక స్వాగతం చెప్పారు. శ్రీ సంజయ్‌గాంధీ దంపతులను సభాస్థలి వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటామని ఐదువేల మంది యువతీ యువకులతో శ్రీ సంజయ్‌గాంధీ ప్రతిజ్ఞ చేయించారు.

విమానం దిగిన వెంటనే వెళ్ళి శ్రీ సంజయ్‌గాంధీ నిజాం కాలేజీ మైదానంలో బ్రహ్మాండమైన బహిరంగ సభలో ప్రసంగించారు. దాదాపు రెండు లక్షల మంది ప్రజలు హాజరైన ఈ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు అధ్యక్షత వహించారు.

దేశమంతటికీ ధాన్యం సరఫరా చేసే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల తుఫాన్‌వల్ల ప్రజలు, ముఖ్యంగా రైతులు తమ సర్వస్వం కోల్పోయారని చెబుతూ మనమంతా అండగా నిలిచి నట్లయితే వచ్చే పంటకాలానికల్లా వారు కోలుకుంటారని శ్రీ సంజయ్‌గాంధీ అన్నారు. స్వాతంత్ర్య సముపార్జన నాటి నుండి నేటి వరకు దేశ జనాభా రెట్టింపు కావడంవల్ల ప్రగతి ఫలితాలు పేదలకు దక్కకుండా పోతున్నాయని అందుకే కుటుంబ నియంత్రణను పాటించాలని తాము కోరుతున్నామని శ్రీ సంజయ్‌గాంధీ అన్నారు. వరకట్న దురాచారంవల్ల వేలాది కుటుంబాలు చితికి పోతున్నాయి కాబట్టి ఆ పద్ధతికి స్వస్తి చెప్పాలని అంటున్నాం. ఇవన్నీకూడా ప్రజాహిత కార్యక్రమాలే.

దేశంలోని యువకులలో శ్రీ సంజయ్‌గాంధీ నూతన ఆశలు చిగురింపజేశారని ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు అభివర్ణించారు. శ్రీ సంజయ్‌గాంధీ నాయకత్వాన్ని చూసి భారత కమ్యూనిస్టుపార్టీ వంటి రాజకీయ పక్షాలు భయపడుతున్నాయని, అందుకే ఆయన పంచసూత్ర పథకాన్ని వ్యతిరేకిస్తున్నాయని శ్రీ వెంగళరావు అన్నారు. కమ్యూనిస్టుల విషయంలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ వైఖరి సరియైనదేనని, ఆమెకు ఈ రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వం సంపూర్ణ మద్దతును అందజేస్తారని ఆయన ప్రకటించారు. అవసర సమయంలో ఈ దేశంలోని యువకులకు శ్రీ సంజయ్‌గాంధీ నాయకత్వం లభించడం అదృష్టకర విషయమని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కె. శేషగిరిరావు తమ స్వాగతోపన్యాసంలో శ్లాఘించారు. ఏ.పి.సి.సి. అధ్యక్షుడు శ్రీ తాడేపల్లి మునలయ్య, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కొత్తూరు సీతయ్యగుప్త అఖిలభారత యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఇంద్రసేన రెడ్డి ప్రభృతులు కూడా ప్రసంగించారు. నిజాం కాలేజీ మైదానంలో జరిగిన బహిరంగసభలకు ఇంతటి జనం మునుపెన్నడూ రాలేదు.

చిత్తూరు, నెల్లూరు జిల్లాలలో

25వ తేదీ బయలుదేరి శ్రీ సంజయ్‌గాంధీ హైదరాబాదు నుండి విమానంలో తిరుపతి వెళ్ళారు. తిరుపతి విమానాశ్రయంలో దిగగానే రాయలసీమ డెవలప్‌మెంటు బోర్డు అధ్యక్షులు శ్రీ వీరరాఘవులు నాయుడు, పార్లమెంటు సభ్యులు శ్రీ నేదురుమల్లి జనార్దనరెడ్డి, కలెక్టర్ పలువురు లెజిస్లేటర్లు, పార్లమెంటు సభ్యులు ఆయనకు ఘన స్వాగతం చెప్పారు. తుఫానులవల్ల జరిగిన నష్టాలను తెలిపే చార్టును, ఫొటోలను ఆయన చూశారు. జరిగిన నష్టాన్ని కూలిపోయిన ఇండ్ల వివరాలు, మరణాలను కలెక్టరు ఆయనకు వివరించారు.

తిరుపతి నుంచి టాపులేని కారులో ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ కొత్త రఘురామయ్య, రాష్ట్ర మంత్రులు శ్రీ చొక్కారావు, నరసారెడ్డి, రాజమల్లు, స్పీకరు శ్రీ ఆర్. దశరథరామరెడ్డి, రాయలసీమ అభివృద్ధి మండలి అధ్యక్షులు శ్రీ వీరరాఘవులు నాయుడు ప్రభృతులు వెంటరాగా శ్రీ సంజయ్‌గాంధీ కాళహస్తి వెళ్ళారు. దారి పొడవునా అసంఖ్యాక ప్రజానీకం ఆయనకు స్వాగతం పలికారు.

శ్రీ కాళహస్తి సమీపంలో వరదలకు పూర్తిగా కొట్టుకు పోయిన అల్లిమడుగు యనాది కాలనీని శ్రీ సంజయ్‌గాంధీ చూశారు. కాలనీ ప్రజలను పరామర్శించారు. చిత్తూరులోని మూడు తాలూకాలలో తుఫాను దెబ్బతిన్న వారికి సహాయం చేయడానికి, చెరువులు, రోడ్ల మరామ్మతులకు 187 లక్షలు అవసరమని కలెక్టరు ఆయనకు వివరించారు.

నాయుడుపేటలో

కుటుంబనియంత్రణను పటిష్టంగా అమలుజరిపితేనే దేశం ముందడుగు వేయగలదని, ఇది కేవలం ప్రభుత్వానికో, యువజన కాంగ్రెసుకో సంబంధించిన సమస్యగా భావించి ఉపేక్షించక, ఈ సమస్యా పరిష్కార కృషిలో యావద్దేశ ప్రజలు సహకరించాలని శ్రీ సంజయ్‌గాంధీ నాయుడుపేటలో జరిగిన బ్రహ్మాండమైన సభలో విజ్ఞప్తి చేశారు.

'దేశంలోని పేదరికాన్ని నిర్మూలించాలంటే జనాభా పెరుగుదలను అరికట్టాలి. మనకు స్వాతంత్ర్యం వచ్చాక ఎంతో ప్రగతిని సాధించాం. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందాం. స్వాతంత్ర్యం రాకముందు గుండుసూదికి కూడా విదేశాలపై ఆధారపడుతూ వున్నాం. అటువంటిది ఈనాడు విమానాలను సైతం ఉత్పత్తి చేసుకుంటున్నాం. అయితే ఇంత పురోభివృద్ధి సాధించిన మన దేశంలో పేదరికం పెరుగుతూనే వున్నది. దానికి ప్రధానమైన కారణం జనాభా పెరుగుదల.

'ఇటీవల తుఫానులో దాదాపు వంద మందికిపైగా మరణించారని, పశువులకు, పంటలకు విపరీత నష్టం వాటిల్లిందని తెలుసుకొని ఈ ప్రాంతానికి స్వయంగా చూడాలని వచ్చాను. తుఫాను బాధిత ప్రాంతాలన్నిటిని నేను చూడలేకపోయినా, నేను చూచినంతవరకు చాలా పెద్దనష్టం సంభవించింది. ప్రకృతి భీభత్సాలకు గురయ్యేది నష్టపడేది ఎక్కువగా నిరుపేదలే. ఈ కష్టకాలంలో సహాయం చేయడం—వారికన్నా పై స్థాయిలో వున్నవారు వారిని ఆదుకోవడం మానవధర్మం' అని శ్రీ సంజయ్‌గాంధీ అన్నారు.

ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు మాట్లాడుతూ మన రాష్ట్రంలో వరదలకు గురైన ప్రాంతాలను చూడడానికి శ్రీ సంజయ్ గాంధీ వచ్చారని, లోగడ ఒకసారి విమానంలో ఈ ప్రాంతాన్ని చూశారని, మరొకసారి స్వయంగా చూస్తే మనకు ఎక్కువ సహాయం చేయించగలరనే ఉద్దేశ్యంతో ఆహ్వానించామని అన్నారు.

పార్లమెంటు సభ్యుడు శ్రీ నేదురుమల్లి జనార్దనరెడ్డి స్వాగతం చెప్పారు.

శ్రీ సంజయ్‌గాంధీ టాపులేని కారులో నాయుడుపేటకు రాగానే ప్రజలు హర్షాతిశయంతో ఉత్తేజకరమైన స్వాగతం ఇచ్చారు. శ్రీ సంజయ్ రాకకోసం జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి బస్సులలో, లారీలలో, కార్లలో, రైళ్ళలో వేలాది జనం నాయుడుపేటకు చేరారు. స్వర్ణముఖి నదీతీరాన విశాలమైన మైదానంలో ప్రత్యేకంగా ఏర్పరచిన సభాస్థలి 40 వేల మంది ప్రజలతో కిటకిటలాడింది

తుఫాను వరదలకు గురైన ప్రాంతాలలో తీసిన ఫొటోలను, ప్రత్యేక షామియానాలో శ్రీ సంజయ్ గాంధీ చూచేందుకు వీలుగా అమర్చారు. జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ ఆనం భక్తవత్సలరెడ్డి శ్రీ సంజయ్‌గాంధీగారికి నివేదికను సమర్పిస్తూ తుఫాను వరదవల్ల జిల్లాకు 20 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని అన్నారు.

గన్నవరం

శ్రీ సంజయ్ గాంధీ చిత్తూరు, నెల్లూరు జిల్లాల పర్యటనానంతరం గన్నవరం మీదుగా ఆకివీడు వెళ్ళారు.

వరుసగా సంభవించిన తుఫానులవల్ల ఎంతగానో కష్టనష్టాలకు గురి అయిన ఆంధ్ర ప్రదేశ్ రైతులకు వచ్చే పంటలకు ఆర్థిక స్థోమతను కల్పించడం ప్రభుత్వం తక్షణ కర్తవ్యమని గన్నవరం సభలో ఆయన ఉద్బోధించారు. తమ పర్యటనలో పెక్కు కూలిపోయిన ఇళ్లు, ధ్వంసమయిన పంట పొలాలను తాము చూచామని అయితే ప్రజలు ధైర్యంతో నిలబడి నష్టాలను పూరించుకునే కార్యక్రమాలలో నిమగ్నమై వున్నారనీ, ఇది తమకు సంతోషం కలిగించిందన్నారు. తుఫాను దెబ్బతిన్న ప్రజలకు సహాయం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం కృషిని ఆయన మెచ్చుకున్నారు. ఇలాంటి సమయాలలో ఇతర రాష్ట్రాలకంటె ఆంధ్రప్రదేశ్ ప్రశంసనీయమైన తోడ్పాటును ప్రజలకు అందజేసిందని ఆయన అభినందించారు.

తుఫానువల్ల పేదలు ఎక్కువగా నష్టపడినట్టు తమకు ఈ పర్యటనలో కనిపించిందని మెరుగైన స్థితిలో వున్న పొరుగువారు వారిని ఆదుకుని వారి ఇల్లు నిలబెట్టాలని శ్రీ సంజయ్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి మూడు దశాబ్దాలు అవుతున్నప్పటికీ పారిశ్రామికంగా, వ్యవసాయికంగా, ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ పేదరికం తొలగిపోలేదనీ ఇందుకు కారణం ఒకటేనని, అభివృద్ధి రేటుతో పాటు జనాభా పెరుగుదల పోటీపడి పెరిగిందని శ్రీ సంజయ్‌గాంధీ చెప్పారు.

విమానాశ్రయంలో సభావేదికకు ప్రక్కన ప్రత్యేకంగా అమర్చిన ఫోటోల ప్రదర్శనను శ్రీ సంజయ్‌గాంధీ అంతకు ముందు తిలకించారు. జిల్లాలో తుఫానులవల్ల జరిగిన నష్టాన్ని తెలిపే ఫోటోలు ఆ ప్రదర్శనలో వున్నాయి జిల్లాకలెక్టరు శ్రీ సి ఎస్ రావు ఆయనకు తుఫానువల్ల జరిగిన నష్టాలను వివరించారు.

ఆకివీడు

దేశం అభివృద్ధి పథంలో అప్రతిహతంగా పురోగమించడానికై కుటుంబనియంత్రణ వరకట్న వ్యతిరేక, కుల నిర్మూలన కార్యక్రమాలను ద్విగుణీకృతోత్సాహంతో అమలు జరపాలని సాంఘిక దురాచారాల నిర్మూలనకు నిరంతర పోరాటం సాగించాలని శ్రీ సంజయ్‌గాంధీ ఆకివీడులో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగ సభలో ప్రసంగిస్తూ ప్రజలకు పిలుపునిచ్చారు. కులవ్యవస్థ నిర్మూలనకు ప్రజానీకం నేడు బద్ధులుకావాలని వరకట్న వ్యతిరేక ఉద్యమాన్ని పటిష్టంగా అమలు జరుపడానికి మహిళలు దీక్షతో ముందడుగు వేయాలని ఆయన వివరించారు వరకట్నం తీసుకోకుండా వివాహం చేసుకునే యువతీ యువకులకై యువజన కాంగ్రెసు ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినదనీ, ఈ కార్యక్రమంపట్ల ఉత్సాహం వున్న యువతీ యువకులు ఈ విభాగంలో తమ పేర్లను నమోదు చేసుకొనవచ్చునని ఆయన అన్నారు పారిశ్రామిక వ్యవసాయిక ఉత్పత్తులు పెరిగినప్పటికీ జనాభా నియంత్రణ కానిదే ఈ ఉత్పత్తి ఎంత పెరిగినప్పటికి అంతగా ప్రయోజనం ఉండదని ఆయన అన్నారు.

ఆకివీడు సభలో ప్రసంగం ముగిస్తూ "అధికంగా మాట్లాడడం నా ప్రకృతికి వ్యతిరేకం. మాటలుమాని, పనులుచేయండి" అని కోరారు.

ఆయన వచ్చిన హెలికాప్టర్ ఆకివీడు హైస్కూలు మైదానంలో దిగింది. అనంతరం అక్కడ అధికార, అనధికార ప్రముఖులను ఆయనకు పరిచయం చేశారు. ఆయన వెంట ముఖ్యమంత్రి కేంద్రమంత్రి, శ్రీ రఘురామయ్య ప్రభృతులు వున్నారు.

లఘు పరిశ్రమల మంత్రి శ్రీ వై. నారాయణస్వామి, సహకార శాఖమంత్రి శ్రీ బత్తిన సుబ్బారావు, కలెక్టరు శ్రీ జె. రాంబాబు యువజన కాంగ్రెసు నాయకుడు శ్రీ కె. సత్యనారాయణరాజు, శ్రీ కె. ప్రభాకరరాజు ప్రభృతులు శ్రీ గాంధీకి స్వాగతం చెప్పారు. ఆయన హెలికాప్టర్ నుండి దిగగానే వేలాదిమంది ప్రజలు జయ జయ ధ్వానాలు చేశారు.

బహిరంగ సభకు ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు అధ్యక్షత వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా రైతులు 8 లక్షల టన్నుల బియ్యం లెవీని యిచ్చి ఆదర్శ ప్రాయులయినారని శ్రీ వెంగళరావు తమ ప్రసంగంలో పేర్కొన్నారు.

డిసెంబరు 25 వ తేదీ సాయంత్రం శ్రీ సంజయ్‌గాంధీ కొత్తగూడెంకు 10 మైళ్ల దూరంలో గల యనాంబిలిలో ఆశ్రమ పాఠశాలకు శంకుస్థాపన చేశారు. గిరిజనులకు ఋణాలమొత్తాలు పంపిణీచేశారు. ఒకే రోజు ఇంత పెద్ద మొత్తంలో ఋణాలను గిరిజనులకు పంపిణీ చేయడం, భారత దేశంలోనే ఇది మొదటి ఘటన అయి వుంటుందని. చెపుతూ, గిరిజనుల అభివృద్ధికి ఇరవై అంశాల కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి గిరిజన సబ్ ప్లానింగ్ ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

గిరిజనులు ఎంతో వెనుకబడిన వారైనా వారి నుంచి మనం నేర్చుకోవలసిన అంశాలువున్నాయి. ముఖ్యంగా గిరిజనులు వరకట్న పిశాచాన్ని దగ్గరకు రానివ్వరు. వరకట్నం ఇచ్చే దుస్సంప్రదాయం వారిలోలేదు అభివృద్ధి చెందిన మనం కూడా వారి నుంచే ఇది నేర్చుకోవలసిన అంశమని సంజయ్‌గాంధీ అన్నారు.

యువజన సంఘ కార్యక్రమాలలో కుటుంబనియంత్రణ అతి ముఖ్యమైనదని పరిమిత కుటుంబాన్ని పాటించని యెడల మనం సాధిస్తున్న అభివృద్ధి అంతా బూడిదలో పోసిన పన్నీరు కాగలదని ఆయన అన్నారు.

కులతత్వం, ప్రాంతీయ తత్వాలను గురించి శ్రీ సంజయ్ గాంధీ ప్రస్తావిస్తూ వీటిని నిర్మూలించనిదే అభివృద్ధి అసాధ్యమన్నారు.

ఒకేరోజున ఇంత పెద్ద మొత్తాలను గిరిజనులకు అందించడం ముఖ్యమంత్రి అన్నట్లు ఒక రికార్డేనని. అయితే ఈ రికార్డును అధిగమించ వలసిన బాధ్యత కూడా ముఖ్యమంత్రిదేనని శ్రీ సంజయ్ హర్షధ్వానాల మధ్య అన్నారు.

శ్రీ సంజయ్‌గాంధీ ఖమ్మం జిల్లాలోని వివిధ వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు మంజూరు చేసిన మూడున్నర కోట్లు రూపాయల ఋణాలను పాడిపశువులు, ఇంజన్లు తదితర వ్యవసాయిక పరికరాల రూపంలో గిరిజనులకు పంపిణీచేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు ఇటీవల సంభవించిన నష్టాలను గురించి వివరిస్తూ చెట్లు నాటే కార్యక్రమాన్ని అధికంగా పాటించివుంటే, వరదలవల్ల ఇంత ప్రమాదం జరిగేది కాదన్నారు.

తొలుత రాష్ట్ర మం[illegible] శ్రీ భాట్టం శ్రీరామమూర్తి శ్రీ సంజయ్‌గాంధీకి స్వాగతం [illegible]తూ, మనఆశలకు ఆశయాలకు ఆయన ప్రతిబింబమన్నారు. మన రాష్ట్రం కష్ట సమయంలో వారు పర్యటించడం చాలా సంతోషమని శ్రీ సంజయ్ తక్కువగా మాట్లాడి ఎక్కువగా పనిచేసే నాయకుడని అన్నారు.

శ్రీ సంజయ్ గాంధీ వెంట శ్రీ కొత్త రఘురామయ్య, విద్యాశాఖ మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు, శ్రీ జలగం ప్రసాదరావు పలువురు శాసనమండలి సభ్యులు అధికారులు, అనధికారులు వున్నారు.

అనంతరం గిరిజన ఆశ్రమ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.

గిరిజనులకు సహాయం

"యువజన నాయకుడు శ్రీ సంజయ్ గాంధీ కొత్తగూడెం సందర్శిస్తున్న సందర్భంగా నేడు గిరిజనులకు మూడు కోట్ల 50 లక్షల రూపాయల సహాయం అందచేయడం జరిగింది. ఒక రోజులో ఇంత పెద్ద మొత్తం సహాయం బహుశా మనదేశంలో ఇదే మొదటిసారి.

సమాజంలో బలహీన వర్గాలు, దళిత వర్గాలు ఎంతో నష్టపోయి వుండగా గిరిజనులు మరీ ప్రయోజనాలు పొందలేకపోయారు. గిరిజనులు సమాజానికి చాలాకాలం ఎంతో దూరంగా ఉంటూ వచ్చారు. విద్యా సౌకర్యాలు అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు చాలా కాలం వారికి అందలేదు. ప్రత్యేకమయిన అలవాట్లు—ప్రత్యేక మానసిక పరిస్థితులలో ఉన్న గిరిజనులు — ఇతర సమాజానికి దూరంగా ఉంటూ — తాము వేరు అనే అభిప్రాయంతో ఉంటూ వచ్చారు. అమాయకులైన వారిని కూడా కొందరు స్వప్రయోజన పరులు ఉపయోగించుకోవడానికి ప్రయత్నించారు. వారిని కూడా ఇతరులతో సమానంగా అభివృద్ధి చేసి జాతీయ అభివృద్ధి కార్యక్రమాలలో వారు పాల్గొనేటట్లు చేయాలని ప్రభుత్వం నిశ్చయించి వారి అభివృద్ధికి అనేక కార్యక్రమాలను ప్రారంభించింది.

గిరిజనుల అభివృద్ధికి మన రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్ద యెత్తున కార్యక్రమాలు ప్రారంభించింది. వారికోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను కూడా నెలకొల్పడం జరిగింది వారికి విద్యా సౌకర్యాలు కల్పించడానికి కూడా ప్రభుత్వం పెద్దయెత్తున కార్యక్రమాలు ప్రారంభించింది నేడు గిరిజనులకు మూడుకోట్ల 50 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయడం గిరిజనుల అభివృద్ధిపై ప్రభుత్వానికి గల ప్రత్యేక అసక్తికి నిదర్శనం. ఈ సహాయం కూడా చాలా భాగం వస్తురూపేణా జరగడం ముదావహం. గిరిజనుల అభివృద్ధి చరిత్రలో ఇది స్వర్ణాక్షరాలతో లిఖింపదగినరోజు అని చెప్పవచ్చు."

ఆంధ్ర దేశ్‌లో 5 సూత్రాల కార్యక్రమం

కుటుంబ నియంత్రణ :

ఈయేడు ఆరు లక్షల మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలని లక్ష్యం. డిసెంబరు 16 వ తేదీ నాటికి 6,05,439 మంది యీ చికిత్స పొందారు లక్ష్యాన్ని అధిగమించాం. గ్రామీణ ప్రాంతాల్లో ఆపరేషన్ థియేటర్లు అభివృద్ధి చేయడానికి రూ. 41.14 లక్షలు మంజూరుచేశారు. ప్రభుత్వోద్యోగుల విషయంలో అనేక ప్రోత్సాహక చర్యలు యిటీవలే ప్రభుత్వం ప్రకటించింది. కుటుంబ నియంత్రణ పాటించని వారికి కొన్ని నిషేధాలు కూడా ప్రకటించారు.

నిరక్షరాస్యతా నిర్మూలన:

ప్రస్తుతం రైతుల వృత్తికి అత్యవసరమైన విషయాలతో కూడిన అక్షరాస్యతా పథకం అనేది 10 జిల్లాలలోనూ, మామూలుగా పాఠశాలల్లో చెప్పే పద్ధతుల్లో కాక సంప్రదాయేతర పద్ధతులలో కొనసాగే అక్షరాస్యతా పథకం 2 జిల్లాల్లోనూ అమలుజరుగుతున్నది.

వరకట్న నిషేధం:

1961 వ సంవత్సరపు వరకట్న నిషేధ చట్టానికి కొన్ని సవరణలను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వ్రాసింది.

వన మహోత్సవం:

జంట నగరాలలో 10,000 మొక్కలను నాటే ఒక ప్రత్యేక బృహత్ కార్యక్రమాన్ని హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్ వారు చేపట్టారు. అటవీశాఖవారు 15 లక్షల మొక్కలను పంపిణీ చేశారు

కుల నిర్మూలన:

షెడ్యూలు కులాల వారితో కులాంతర వివాహం జరిగిన దంపతులకు రూ. 1,000లు, వెనుకబడిన వర్గాల వారితో వివాహం జరిగిన దంపతులకు రూ. 320లు ప్రభుత్వం గ్రాంటుగా యిస్తున్నది.

* * *

పైలట్‌గా సంజయ్

శ్రీ సంజయ్‌గాంధీ తాము ప్రయాణిస్తున్న విమానానికి తామే చోదకుడుగా వ్యవహరించారు.

హైదరాబాద్ నుంచి తెల్లవారుఝామున బయలుదేరి తిరుపతి, అక్కడనుంచి గన్నవరం వరకు తాను ప్రయాణిస్తున్న ఆవ్రో విమానాన్ని ఆయనే నడిపారు.

రికార్డు స్థాయిలో ఋణాల పంపిణీ

యువజన నాయకుడు శ్రీ సంజయ్‌గాంధీ, ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుతోపాటు ఖమ్మం జిల్లా వచ్చిన సందర్భంగా డిశంబరు 25 వ తేదీ క్రిస్‌మస్ పండుగ రోజున యానంబైలిలో 1,740 మంది షెడ్యూలు జాతుల వారికీ, 3,335 మంది షెడ్యూలు కులాల వారికీ, 2,204 మంది వెనుకబడిన తరగతుల వారికీ 1,017 మంది తదితర బలహీన వర్గాల వారికీ — అంటే మొత్తం 8,296 మంది ప్రజలకు రూ. 2,11,18,350 ల విలువగల ఋణాలను పంపిణీ చేశారు. 1,966 మంది భూమి సాగు కోసమూ 1,877 మంది బావుల త్రవ్వకం కోసమూ, ఉన్న బావులను మెరుగు చేసుకొనేందుకు 195 మందీ, యీ ఋణ సహాయాన్ని చెక్కుల రూపంలో పొందారు. 1,406 మందికి పాడి పశువులు, 964 మందికి గొఱ్ఱెల పెంపకం యూనిట్లు, 609 మందికి దుక్కిటెద్దుల యూనిట్లు లభించాయి. వివిధ వృత్తులకు సంబంధించిన 300 మందికి స్వయం ఉపాధి సౌకర్యాలు లభ్యమయ్యాయి. పిగ్గరీ, కోళ్ళ పెంపకం యూనిట్లు, ట్రాక్టర్లు, లారీలు ఎడ్ల బళ్ళు, కుట్టు యంత్రాలు, మత్స్య పారిశ్రామికులకు నైలాన్ దారం వలలూ తదితరాలెన్నో సమకూడాయి.

అదే రోజున బూర్గంపాడు, ఎల్లందు, కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లి, మధిర, ఖమ్మం తాలూకాల్లో 173 గ్రామాలకు చెందిన 9,102 మందికి 848 ఎకరాల మేరకు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు.


ఖమ్మం, సత్తుపల్లి, ఎల్లందు, కొత్తగూడెం, బూర్గంపాడు తాలూకాలకు చెందిన భూమిలేని నిరుపేదలకు యువజన నాయకుడు శ్రీ సంజయ్‌గాంధీ యానంబైలిలో 709 ఎకరాల 97 సెంట్ల భూమికి చెందిన 242 పట్టాలను పంపిణీ చేశారు.

* * *

నూతన దంపతులకు ఆశీస్సులు

శ్రీ సంజయ్‌గాంధీ రాక సందర్భంగా ఇల్లెందు గెస్టుహౌస్‌లో 320 వర్ణాంతరవివాహాలు జరిగాయి. శ్రీ సంజయ్‌గాంధీ ఈ నూతన వధూవరులందరికి ఆశీస్సులు, అక్షతలతోపాటు నూతన వస్త్రాలను కూడ ఇచ్చి సత్కరించారు. ఈ ఋతువులో పుష్కలంగా లభించే బంతిపూల ప్రభావం సంజయ్ ఉపన్యసించిన సమావేశ స్థలికి ఎంతో అందాన్ని, నిండుతనాన్ని చేకూర్చింది. కొత్తగూడెం స్టేడియంలో అపూర్వమైన రీతి పుష్పగుచ్ఛాల అలంకరణలతో, రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించబడ్డది సభాస్థలిలో మార్గంలో పూలతో అలంకరించిన గేట్లను నిర్మించి, ప్రధాని శ్రీమతి గాంధీ, ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు, శ్రీ సంజయ్ గాంధీల ఫోటోలతో అలంకరించారు.








హైదరాబాదులో

సంజయ్‌గాంధీ










కొత్తగూడెం


యానాంబిలి

















★ ఆంధ్రప్రదేశ్ లో సంజయ్ గాంధీ పర్యటన ★


ఖమ్మంజిల్లాలో యువజన నాయకునకు లక్షలాది ప్రజల స్వాగతం













యూనాంబిలిలో శ్రీ సంజయ్ గాంధీ

గిరిజన యువకుల మహాసభ తదితర సమావేశాల్లో పాల్గొన్నారు. గిరిజన బాలుర పాఠశాలకు శంకుస్థాపనచేశారు.









నాయుడు పేటలో బహిరంగ సభ







ఆకివీడులో ......

సీరియల్:



స్వర్ణయోగి

పులిచెర్ల సాంబశివరావు

—పంచమ యోగము—

"మిత్రమా! మేం వచ్చాం!" అనే మాటలు విని వేమారెడ్డి తన చూపుల్ని ద్వారం వైపుకు మరల్చాడు. అక్కడ పెద్దన, చామి సెట్టితో కన్పించాడు.

వేమారెడ్డి తన సహజ పరిహాస ధోరణిలో "ఏం మిత్రులారా! నల్ల పూసలయ్యారు! నాపై ఎందుకింత కినుక?" అని వారిని ప్రశ్నించాడు. ఎప్పుడూ వేమారెడ్డి తన మిత్రుల్ని ఇట్లాగే పలుకరిస్తాడు. ఇది వారి కలవాటే! వెంటనే వారు ముగ్గురూ నవ్వుతూ తిరిగి పరిహాస ధోరణిలో తగిన సమాధాన మిస్తారు.

కాని ఇప్పుడటువంటిదేం లేదు. పెద్దన్న పెదవి విప్పలేదు. చామిసెట్టి మొహం ముడుచుకొని పోయివుంది. మిత్రులిద్దరూ ఇలా మౌనంగా ఉండటంతో వేమారెడ్డి నవ్వు మాయమయింది. మొహం వివర్ణమయింది. కీడు శంకించాడు

"ఏమిటి? మీ మొహాలలామాడ్చుకొన్నారు? కొండవీటి కేమైనా విపత్తు సంభవించిందా?" అని వారిని ప్రశ్నించాడు.

"లేదు! కొండవీడు బ్రహ్మాండంగా ఉంది. మా వేమారెడ్డి క్షేమంగా ఉన్నాడు. మాకే ప్రాణాలపైకి వచ్చి పరుగున వచ్చాం!" పెద్దన్న కోపంతో సమాధానమిచ్చారు.

వేమారెడ్డి మిత్రుల మనోభావాలను అర్థం చేసికొన్నాడు.

"ఓహో! అదా సంగతి! మీకే ప్రాణాల మీదికి వచ్చిందా! అంటే నాకేదో ప్రమాదం వచ్చి పడిందన్న మాట!"

వాళ్ళేం పలకలేదు.

"ప్రాణ స్నేహితులవటం వలన, నా మీద వాత్సల్యం ఎక్కువ వటంవలన, మా వదినగారిలాగా మీరూ ఆందోళన చెందుతున్నారు!"

"అవును మిత్రమా! నీవిలా వేశ్యలోలుడవై కాలం గడపటం మర్యాదకాదు!" చామిసెట్టి పలికాడు.

"ఓహో! తెలిసింది!... నా గూర్చిమీకు చింత ఎందుకు? నా సంగతి చిన్నప్పట్నించీ మీకు తెలుసు!"

"నీవిప్పుడు చిన్నవాడివి కాదు!"

"కాదు! కనుకనే ఇలా ఉంటున్నాను!"

"ఇలా ఉండటమే పద్ధతి అయితే మేము బాధ పడ వవసరం లేదు! ఇదిసరి అయిన పద్ధతికాదు మిత్రమా!"

"దీని వలన ఏం నష్టం?"

"నష్టం వచ్చింది కాబట్టే వచ్చాం!"

"నేనిక్కడ సుఖంగా ఉన్నాను. అక్కడ కొండవీటిలో అందరూ సుఖంగా ఉండేఉంటారు...!"

"అంతా సుఖంగా ఉన్నారని మీరనుకుంటే సరిపోతుందా! కొండవీటి ప్రజలెన్ని కష్టాలు పడుతున్నారో మీకేం తెలుసు?"

"కొండవీటి ప్రజలకు కష్టాలా?"

"అవును! ఇప్పుడు మీ అవసరం ఎంతైనా ఉంటుంది"

"ప్రజల కష్టాలు తీర్చటానికి నేనేం రాజునా?"

"కాకపోవచ్చు! ప్రజల కష్టాలు తీర్చవలసిన బాధ్యత రాజ వంశస్థులందరిపైనా ఉంది!"

"మా అన్నగారు రాచ వేమారెడ్డి ఉన్నాడుగదా!"

"ఉన్నాడు! ఆయన వలనే ప్రజలకు ఇక్కట్లు!"

ఆ తరువాత పెద్దన్న అందుకున్నాడు.

"మిత్రమా! నీకు తెలియందేముంది. మీ అన్నగారు చేసే దుష్ట కార్యాలకు అంతు పొంతు లేదు. ప్రభువిలా ప్రవర్తిస్తుండగా భగవంతుడిని నిందిస్తే ఫలం లేదు. మిత్రమా! మొదటినుంచీ నేను మొత్తుకుంటూనే ఉన్నాను. మీ అన్నగారి మనసును నేను బాగా ఎరుగుదును. అధికార దుర్వినియోగం చేస్తున్నాడు. మా తండ్రిగారిని కూడ పదవీ భ్రష్టుణ్ణి చేశాడు!"

ఆ చివరి వాక్యం విని వేమారెడ్డి నిశ్చేష్టితుడయ్యాడు.

"అప్పుడే ఏమయింది! ఆ దుష్టమంత్రి మాటలు విని

మీ అన్న చెయ్యరాని పనులెన్నో చేస్తున్నాడు. శ్రీనాథ మహాకవికి ఆశ్రయం ఇవ్వటంలేదు. కవులు సోమరిపోతులనీ, వారి వలన దేశానికేమీ ఉపయోగం లేదనీ ఆయన ఉద్దేశం!"

శ్రీనాథ మహాకవికి జరిగిన అన్యాయం విని వేమారెడ్డి కుప్పకూలిపోయాడు. అన్నగారింత నీచంగా ప్రవర్తిస్తాడని ఎప్పుడూ తలచలేదు.

పెదవ గొంతు సవరించుకొని మళ్ళా చెప్పసాగాడు.

"ఆ మహాకవి కొండవీటిని వదిలి దేశ సంచారానికి పోయాడు. మీయన్న తురగారాముడిని మంత్రిగా చేశాడు. వాడి సంగతి తెలీనిదెవరికి? వాడి సాహచర్యంతో ప్రభువులింకా దుర్మార్గులయ్యారు! పన్నులెక్కువయ్యాయి. ఇయ్యలేనివారి ఆస్తుల్ని స్వాధీనం చేసుకున్నారు. ఇంకా..."

"ఊ! ఇంకా ఏమిటి?"

"పురిటి పన్నులు విధించాడు!"

"పురిటి పన్నులా!?"

"అవును! శిశువు జన్మించినందు కిది శిక్ష! పురిటియందే పన్ను చెల్లించాలి. ఇట్టి పన్నులు మన కొండవీటి చరిత్రలో ఎప్పుడయినా ఉన్నాయా? కొండవీటిలో అనటమెందుకు! భారత దేశ చరిత్రలో ఏ ధర్మ ప్రభువులయినా ఇలా చేశారా? మీ అన్న రాచ వేమారెడ్డి మహమ్మదీయ ప్రభువులకంటే అన్యాయంగా పాలిస్తున్నాడు!"

"అన్నగారింత దిగజారిపోతాడని నేననుకోలేదు! పరిస్థితులింత విషమిస్తాయని నేను భావింపలేదు!"

"మేం భయపడినదంతా జరిగింది! కొండవీటి సామ్రాజ్యానికి పతనకాలం వచ్చినట్లుగా ఉంది. అరాచకంతో ప్రజలల్లాడుతున్నారు కాటకాలతో వారి కడుపులు మాడుతున్నాయి. దూడబాతులు కొండవీటికి వలస వస్తున్నాయి. గండుకోయిలలకు బదులుగా తీతువుల పాటలు ప్రాణాలు తీస్తున్నాయి. మిత్రమా! ప్రజలకిప్పుడొక మంచి ప్రభువు కావాలి! వాళ్ళు నీకోసం ఎదురు చూస్తున్నారు. నువ్వు 'ఊ' అను! నిముషంలో మీ అన్నను పదవీచ్యుతుణ్ణిచేస్తాం! నిన్నే ప్రభువుగా చేస్తాం!" అని పెద్దన్న మిక్కిలి ఆవేశంతో పలికాడు.

"ధనం కోసం దిగులు పడవద్దు! నీకు కావలసినంత బంగారం నేనిస్తా!" చామిసెట్టి పట్టుదలతో పలికాడు.

బంగారం అనే మాట వినగానే వేమారెడ్డికి తన తండ్రి చెప్పిన చివరి మాటలు గుర్తుకు వచ్చాయి. తమ వంశంలో ఎవరికో వకరికి స్వర్ణయోగం ఉంటుందట! అన్నగారి కోశాగారం శూన్యం అవటం వలనే దేశం ఇలా పాడుబడి పోతోంది! ఆ స్వర్ణయోగం ఇపుడు సిద్ధిస్తే బాగుండును ధనం లేనపుడు ప్రభువు మాత్రం ఏంచేస్తాడు? ఆ స్వర్ణ యోగం ఈయనకు పడితే బాగుండును. తిరిగి కొండవీటికి మంచి రోజులు వస్తాయి!

"మిత్రులారా! విచారించవద్దు! మా వంశంలో స్వర్ణయోగం ఉందని మా తండ్రిగారు చెప్పారు. త్వరలో మన కష్టాలు గట్టెక్కుతాయి!"

"స్వర్ణయోగమా! నిజంగా అదే జరిగితే అది ఎవరో మీవంటి వాళ్ళకే! దుష్టులకు ఆ యోగంపడితే అటువంటి స్వర్ణయోగంవలన వచ్చిన బంగారం ప్రజలకు కీడే ఎక్కువ చేస్తుంది!"

"మా అన్నగారిప్పుడు ధనహీనుడై ఉండటంవలన మీ కలా అనిపించటం సహజమే! ఈ ప్రపంచంలో సర్వానికీ స్వర్ణమే మూలం! ధనం లేకపోతే ధైర్యం చిక్కదు ధైర్యం శూన్యమైతే ధనం లభించదు. ప్రభువులకు ధనం, ధైర్యం రెండూ ముఖ్యమైతే! ధనం లేకపోతే గుణం తక్కువ వాడని లోకులు వెక్కిరిస్తారు ధనహీనుడికి కీర్తి ఉండదు. ధనం లేకపోతే శుచికి స్థానముండదు! ధనహీనుణ్ణి వాని పుత్రులే తప్పులెంచుతారు. ధనం లేనివాణి పత్ని కూడా తాకనీయదు! అటువంటప్పుడు మా యన్నగారు మాత్రం ఏం చేస్తారు?"

"ఇన్ని తెలిసిన మీరే ప్రభువులవటానికి అర్హులు"

"ఏమైనా...నేను సింహాసనం ఎక్కను! అన్నను మోసగించి వేమారెడ్డి సింహాసనం ఎక్కాడనే అపకీర్తిని నేను పొందదలచలేదు! అటువంటి రాజ్యం లేకపోయినా నాకు సుఖమే! మిత్రులారా! నా జీవితాన్ని ఇలాగే పోనీండు!"

"నీ పట్టుదలే పట్టుదల! మా మాటలు వినవు! నీ మిత్రులమైన పాపానికిగాను రాచవేముడు మాపై కన్నువేశాడు. తురగా రాముడెంత కుటిలాలోచనలు చేస్తాడో వేరుగా చెప్పనవసరంలేదు. వాణ్ణి మీయన్న బృహస్పతిగా తలచి పూజిస్తున్నాడు!" పెద్దన్న పలికాడు.

వారి సంభాషణలో చామిసెట్టి జోక్యం చేసుకున్నాడు. రహస్యం చెప్పబోయే వాడిలాగా ముందుకు వంగి నెమ్మదిగా "వేమారెడ్డీ! ఇలా పలకుతున్నందుకు వేరేవిధంగా తలపవద్దు. నాకొక అనుమానం ఉంది. మీ అన్న దుర్మార్గుడనే సంగతి అందరికీ తెలుసు. ఆయనమంత్రి అంతకంటె ఏడాకు లెక్కువ చదివాడు. వాళ్ళిద్దర్నీ చూస్తే నాకు అనుమానం వేస్తోంది. వారి మాటలు, మంత్రాంగాలూ చూస్తే నాకు భయం వేస్తోంది. నీ ప్రాణాలకు ముప్పు వస్తుందని నాకనిపిస్తూంది!"

ఈ మాటలు విని వేమారెడ్డి మౌనంగా ఉన్నాడు. కొద్దిసేపాగి పెద్దన్నను ఇలా ప్రశ్నించాడు.

"వదినగారికి క్షేమమా?"

"నీవిలా ఉండగా ఇంక క్షేమం ఎక్కడ ఉంటుంది? ఆయమ్మగారు దినదినానికీ క్రుంగి కృశించి పోతున్నారు. ఇప్పుడామె ఆలోచనలన్నీ నీపైనే! మీ అన్న ఆమెను సరిగా చూడటం లేదు. పాపం ఆమె కన్నీ తిప్పలే!"

మిత్రులు ముగ్గురూ మౌనంగా ఒకరినొకరు చూసుకొంటూ గడిపారు. నిశ్శబ్దం రాజ్యమేలింది. చామిసెట్టి, పెద్దన్నలు నిలుచున్నారు.

"మిత్రమా! పోతాం! సెలవు!" అని నమస్కరించారు. వేమారెడ్డి ప్రతినమస్కారం చేశాడు. ద్వారం కడ నిలిచి అశ్వారూఢులై పోతున్న మిత్రుల్ని, తను మరుగై పోయేంతవరకు అట్లాగే చూస్తున్నాడు! (సశేషం)

జిల్లాల్లో ఏం జరుగుతోంది?

గుంటూరు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు

గుంటూరు తాలూకాలో ఆంధ్రప్రదేశ్ అవతరణదినోత్సవ సందర్భంగా చిర్రావూరులో మహిళామండలి, నెహ్రూ యువజన సంఘము ప్రారంభింపబడినవి. కాజ గ్రామంలో ప్రత్యేక కుటుంబ నియంత్రణ శిబిరం ప్రారంభించి 101 ఆపరేషన్లు చేశారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రులో ఉచిత నేత్ర చికిత్సా శిబిరం ప్రారంభించారు. తాడికొండలో సంచార కుటుంబ నియంత్రణ శిబిరం నిర్వహింపబడింది. బండారుపల్లి గ్రామంలో 19 మంది స్త్రీలకు పాడిగేదెల కొనుగోలుకు రూ. 24,000 లు అప్పులు మంజూరు చేశారు. ఉప్పలపాడు హరిజనవాడలో శ్రమదానంతో రోడ్డు వేశారు. మహిళామండలి భవన నిర్మాణం ప్రారంభింపబడింది. గుండిమెడలో మహిళామండలి బీదలకు వస్త్రదానం చేశారు.

—శ్రీ టి. భాస్కరరావు

సంగం జాగర్లమూడి పాల ప్రాజెక్టు

తెనాలి తాలూకా సంగం జాగర్లమూడి వద్ద ప్రారంభోత్సవానికి తుదిమెరుగులు దిద్దుకుంటున్న పాల ప్రాజెక్టు రూ. 2 80 కోట్ల ఖర్చుతో నిర్మించబడుతున్నది. అధునాతన యంత్రసామగ్రితో 1 50 లక్షల లీటర్ల పాలను పొడిగా మార్చవచ్చు. రాష్ట్రంలో మూడవది అయిన ఈ పాల ప్రాజెక్టు రోజుకు 20 టన్నుల పాలపొడి, 6 టన్నుల వెన్న ఉత్పత్తి చేస్తుంది.

ఈ ప్రాజెక్టువల్ల ఒక్క తెనాలి తాలూకా రైతాంగానికే గాక గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతాంగానికి కూడా తమ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచుకోవటానికి అవకాశం వుంటుంది. సన్నకారు రైతులకు బలహీన వర్గాలకూ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక సహాయాన్ని విరివిగా వుపయోగించుకొని పాల పరిశ్రమను చేపడితే, ఈ పరిశ్రమ లాభదాయకంగాను, జీవనోపాధికి పునాదిగాను వుపయోగపడుతుంది.

—శ్రీ ఎ. మధుసూదనరావు

బాపట్ల తాలూకాలో

సమాచారశాఖ 66 చలనచిత్ర ప్రదర్శనల, మూడు హరికథలు, ఒక కవిసమ్మేళనం ద్వారా ఆర్థిక కార్యక్రమము ప్రచారం చేసింది. ధరల స్థిరీకరణ పథకము క్రింద బియ్యం ధరను అదుపులో వుంచడానికి తాలూకా రెవెన్యూ శాఖవారి ఆధ్వర్యంలో 127 చౌకడిపోలు ప్రారంభించారు. పంపిణీకి 332 టన్నుల బియ్యం విడుదల చేశారు. ఇది పేద వర్గాలవారిని ఆదుకొన్నది.

—శ్రీ కె. ఎల్. నారాయణమూర్తి

రేపల్లె తాలూకా

రేపల్లె తాలూకాలోని అన్ని గ్రామాలలో కుటుంబనియంత్రణ, బలహీనవర్గాలకు బ్యాంకులనుండి ఋణ సదుపాయం, 20 అంశాల కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

కుటుంబనియంత్రణ ప్రత్యేక శిబిరంలో 132 కుటుంబనియంత్రణ శస్త్ర చికిత్సలు జరిగాయి. నిర్ణయింపబడిన 800 లక్ష్యమును దాటి మొత్తం 893 శస్త్ర చికిత్సలు జరుపబడినవి.

లంకెవానిదిబ్బ జాలరులకు నైలాన్ వలల నిమిత్తం ఒక్కొక్కరికి రూ 300 ల చొప్పున 95 మంది జాలరులకు రేపల్లె స్టేట్ బ్యాంకువారు రూ. 28,500 లను ఋణముగా యిచ్చిరి.

—శ్రీ సి వి.ఎన్. మూర్తి

సత్తెనపల్లి తాలూకా

గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకాలో నవంబరు 1976 ఆఖరు వరకు పంటల పెంపకానికి, గణపవరం, బలిజేపల్లి, బృదబండ, ఇనుమెళ్ల, ఉప్పలపాడు గ్రామాలకు చెందిన 200 మంది బలహీన వర్గాలకు చెందిన సన్నకారు రైతులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు, గుంటూరు బ్రాంచివారు రు. 3 75,000లు అప్పుగా యిచ్చారు.

వేమవరం, ఫిరంగిపురం గ్రామాలకు చెందిన బలహీన వర్గాలకు చెందిన 18 మంది సన్నకారు రైతులకు గొర్రెల పెంపకానికి ఆంధ్రా బ్యాంకు ఫిరంగిపురం బ్రాంచివారు రు. 36,000లు లోను మంజూరు చేశారు.

నార్నెపాడు, రెంటపాళ్ళ, పాకాలపాడు గ్రామాలకు చెందిన హరిజన, గిరిజన సన్నకారు రైతులకు 62 మందికి గొర్రెల పెంపకానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సత్తెనపల్లి బ్రాంచివారు రు. 1 14 000 లు అప్పుగా యిచ్చారు.

—శ్రీ టి. తాతిరెడ్డి

నరసరావుపేట

నాదెండ్ల పంచాయతీ సమితిలోని మద్దిరాల, గుత్తావారిపాలెం గ్రామాలలోని మహిళా మండలి భవనాలకు శంకుస్థాపన చేశారు. ఒక్కొక్కటి 10 వేల రూపాయలపైగా ఖర్చు కాగల ఈ భవనాలకు మూడువంతులపైగా మహిళలే ఖర్చు భరిస్తారు.

నాదెండ్ల పంచాయతీ సమితిలోని 42 గ్రామ పంచాయతీల లోను 38 గ్రామాలకు ఇదివరకే విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడినది. 39వ గ్రామ పంచాయతీకి నవంబరు 11వ తేదీన కోస్తా జిల్లాల అభివృద్ధి మండలి అధ్యక్షురాలు శ్రీమతి భవనం జయప్రద విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేశారు.

—శ్రీ బి. రంగారావు

ఖమ్మం జిల్లా

భద్రాచలం గిరిజనుల సమితిలో పారిశ్రామికాభివృద్ధి

భద్రాచలం గిరిజనులకు వెనుకబడిన వర్గాల ప్రజలకు నిలయమైన ప్రాంతం ఇక్కడి గిరిజనులు ఇతర జాతులవారు ఆర్థికంగా వెనుకబడివున్నందున ఈ ప్రాంతంలోని పారిశ్రామిక వనరులను పయోగించి, పరిశ్రమలు నెలకొల్పి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరచడాని- పరిశ్రమల శాఖ నిరంతరం కృషి చేస్తున్నది.

చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి జరిగిన కృషి ఫలితంగా 33 చిన్న తరహా పరిశ్రమల యూనిట్లు స్వయం ఉపాధి పథకాల క్రింద 15 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటికై ఇంతవరకు రు 1,72,800 లు అందజేశారు. ఈ మొత్తంలో 10% పరిశ్రమల శాఖ, 80% బ్యాంకులు ఆర్థిక సహాయం చేశాయి. 10 శాతం పరిశ్రమలు స్థాపించినవారు పెట్టుబడులు పెట్టారు- ఈ పరిశ్రమలలో పాన్సీషాపులు, సైకిల్‌షాపులు, రంపపు మిల్లులు, పిండిమరలు, నూనెగానుగలు, కోళ్ళ పెంపకం యూనిట్లు, ఇంజనీరింగు పరికరాల షాపులు, ఫోటోస్టూడియోలు ఉన్నాయి.

ఇదేగాక, రు. 4 లక్షల నాల్గు వేల ఖర్చుతో బెంగుళూరు పెంకు తయారు చేసే కర్మాగారం ఒకదానికి, ఆంధ్రప్రదేశ్ స్టేటు పైనాన్సు కార్పొరేషను వారు రు. 1,39,000 ఆర్థిక వనరును కల్పించారు. ఈ యూనిటు ఏప్రిల్ 77 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తుంది.

ఇదిగాక కార్పొరేషనువారు భద్రాచలంలో ఒక (సెమి-మెకానైజ్డు) పాక్షికంగా యంత్ర సహాయంతో తయారు చేసే ఇటుకల పరిశ్రమకు రు. 1.80,000 లను మంజూరుచేశారు. దీనిని గిరిజన జాతికి చెందిన అభ్యర్థి - -చ్చారు.

ఇంతేగాక, ఒక హరిజనుడికి రు. 3,900ల విలువగల పాదరక్షల నిర్మాణ యూనిట్‌ను గూడా స్వయం ఉపాధి పథకం క్రింద మంజూరు చేశారు. ఉత్పత్తి ప్రారంభం అయింది.

భద్రాచలంలో ఒక పారిశ్రామిక కూడలి నిర్మించి అచట కేంద్రీకృతం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చరల్ కార్పొరేషను వారు 16-24 ఎకరాల భూమిని కొని దానిలో రోడ్లు, వర్కుషాపుల షెడ్లు, నీటివసతి, విద్యుత్ సరఫరా, బ్యాంకు, తంతి తపాలా సౌకర్యాలను సమకూరుస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో జరుగుతున్న గ్రామీణ పరిశ్రమాభివృద్ధి కార్యక్రమాల క్రింద కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ సదుపాయాలను కల్పిస్తున్నారు. గ్రామీణ పారిశ్రామిక కళాకారులకు పనిముట్లు అందించడం. ఆర్థిక సహాయం జేయటం ఈ కార్యక్రమోద్దేశం- 1974-75 లో 9 మంది వ్యక్తులకు రు. 9,600 లు, 75-76 లో 56 మంది కళాకారులకు రు. 28,000 లు వస్తురూపంలో యిచ్చారు. ఇందు రు. 8,500 లను ప్రభుత్వం సబ్సిడీగా మంజూరు చేసింది- ఇక 1976-77 లో రు. 23,000 లను 24 మందికి మంజూరు చేయాలని సంకల్పించారు.

మొత్తంమీద ప్రధాని 20 సూత్రాల కార్యక్రమం ఫలితంగా మన్యప్రాంతమైన భద్రాచలం బ్లాకు ప్రాంతంలో పారిశ్రామికీకరణ చురుకుగా సాగుతున్నది. దీనివల్ల ప్రజల ఆర్థికస్థోమత బాగుపడు అవకాశాలు బాగా పెరిగాయి.

—శ్రీ హరి గోపాలకృష్ణమూర్తి

చిత్తూరు జిల్లా

చిత్తూరు జిల్లా, పుత్తూరు పంచాయతీ సమితి ఏరియాలోని ఉత్తరపు కండ్రిగ గ్రామ పంచాయతీకి సంబంధించిన గొల్లకండ్రిగ గ్రామంలో, గ్రామస్థులు, శ్రీ గోపాలకృష్ణ భజన మండలి సభ్యులు, మరియు శ్రీ పి. రామమూర్తిరావు కృషితో సహాయ సహకారములతో సుమారు రు. 3,000/- ఖర్చుతో ఒక 'ప్రాథమిక పాఠశాల' భవనమును స్థాపించారు. దానిని 9-12-76 తేదీన పుత్తూరు సమితి బి.డి.ఓ గారైన శ్రీ ఎస్ ఎన్. వెంకోబరావుగారు ప్రారంభోత్సవము చేశారు. సమితి స్థాయి యువజన కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ డి. మాధవులు నాయుడుగారు, ఆకార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

శ్రీ ఇ. దొరస్వామి నాయుడు, సర్‌పంచ్ అతిథులకు స్వాగతం చెప్పారు. 'ఒక గడియారమును' పాఠశాలకు బహూకరించారు

—శ్రీ పి. రామమూర్తిరావు

శ్రీకాకుళం జిల్లా

శ్రీకాకుళం జిల్లా టెక్కలి పంచాయతి సమితిలోని పెంటూరు, పాలపల్లి, నరేంద్రపురం గ్రామాలు, సమితి పటములో ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించు కున్నాయి. అవి చింతలులేని చిన్న కుటుంబాలకు ఆదర్శ ప్రాయమైనవి.

ఇటీవలి కుటుంబ నియంత్రణ ముమ్మర కార్యక్రమము యీ పల్లెలలోని, అర్హులైన అందరు దంపతులలో వినూత్న చైతన్యాన్ని రేకెత్తించింది. ప్రభుత్వ ప్రచార సాధనాలు, వారిపై బాగా పనిచేశాయి.

యీ మూడు గ్రామాలలోని 181 మంది అర్హులైన స్త్రీ పురుషులు, పెంటూరులో 119 మంది, నరేంద్రపురంలో 32 మంది, పాలపల్లిలోని 30 మంది మూకుమ్మడిగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకొని, యితర గ్రామాలకు ఆదర్శ ప్రాయులైనారు.

—శ్రీ కె. ముఖలింగం

సామాన్యుల విజయగాథలు

జీవనోపాధికి కుట్టు మిషన్

ముమ్మిడివరం గ్రామంలో అల్పసంఖ్యాకుల వర్గానికి చెందిన ఒక పేద కుటుంబీకురాలు ముష్తరీబేగం. ఆమె భర్త తంతి తపాలశాఖలో పని చేస్తూ అకాలమరణం పొందాడు. ముగ్గురు కుమారులు యిద్దరు కుమార్తెలతో కడు దుర్భర పరిస్థితిలో జీవనం గడుపుతూండేది. ముస్లిం స్త్రీకనుక ఘోషా గడుపుతున్న ఆమెకు జీవనోపాధికి అదు తెరగా వుండేది. పస్తులతో గడుపుతున్న ఈ కుటుంబము పరిస్థితి చూచి కులపెద్ద స్థానికంగా వున్న బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరును సంప్రదించమని సలహా యిచ్చారు. ఆమె ఒకనాడు బి.డి.ఓ.ను కలసి ఒక దరఖాస్తు దాఖలు చేసుకొన్నది. బి.డి.ఓ. శ్రీ ఎస్. రామచంద్రరావు దరఖాస్తుపై పూర్తిగా ఎంక్వయిరీ చేసి అమలాపురం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గారికి సిఫార్సు చేసి రెడ్‌క్రాస్ నిధులనుండి ఒక కుట్టు మిషన్ సరఫరా చేయవలసిందని కోరారు. రెడ్‌క్రాస్ నిధులనుండి రూ. 301/- లు మంజూరు చేశారు. బి.డి.ఓ. రూ. 100/- లు తమస్వంత విరాళంగా యిచ్చి, ఉషా కంపెనీ వారి కుట్టు మిషను ఒకటి కొని, గౌ. శ్రీ బత్తిన సుబ్బారావు గారు శ్రీమతి ముష్తరీ బేగంకు ఉచితంగా కుట్టుమిషన్ ప్రదానము చేయించారు.

కుట్టు మిషన్ యిచ్చినప్పటి నుండి శ్రీమతి ముష్తరీ బేగం నెలకు సుమారుగా రూ. 100/- లు సంపాదించి తమ కుటుంబం హాయిగా పోషించుకుంటూన్నది.

—శ్రీ ఎం. ఎస్. ఇస్మాయిల్

సోడా మిషన్

వెల్లడి ప్రాంతంనుండి జీవనోపాధికై ఏజన్సీ ప్రాంతములకు తరలి వచ్చిన కుటుంబాలు కొన్ని వున్నాయి. ఈ కోవకు చెందిన వారే శ్రీ దాడి కొండాల రావు ప్రస్తుతం గంగవరం గ్రామస్తులు గవరకులస్తులు, కుటుంబీకులు 8 మంది సంతానం. జీవనభృతికై 9 సంవత్సరములనుంచి గంగవరం ఆశ్రమ పాఠశాలలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. కుటుంబం పెద్దదవడం మూలాన జీతం చాలక చాలా యిబ్బంది పడుతుండే వారు.

1974 సంవత్సరంలో అడ్డతీగల యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారు వీరికి రూ. 15,00 00 లు అప్పుగా మంజూరు చేశారు. ఈ సొమ్ముతో ఒక సోడా మిషన్ కొని ఒక చిన్న కాఫీ హోటలు పెట్టుకున్నారు. ఈ ప్రదేశంలో ఏవిధమైన సదుపాయం లేని కారణాన ఆదాయం అంత ఎక్కువకాక పోయినా జీవనానికి వీలుగావుంది. ఈ ఆదాయంతో యిద్దరు కూతుళ్ళకు పెళ్ళి చేశారు. ఒక కుట్టుమిషన్ కొనుక్కున్నారు. ఒక పాడి గేదె, ఒక ఆవు కొనుక్కున్నారు. ఒక కొడుకు కాఫీ హోటల్‌లో పని చేస్తుండగా యిద్దరు కుర్రాళ్ళు 4వ తరగతి 3వ తరగతి చదువు కుంటున్నారు. తాను బ్యాంకులోను చేసిన అప్పు అసలు ఫాయిదాలతో చాల భాగం తీర్చివేయగా యిక రూ. 200.00 లు మాత్రంబాకీ వుంది.

తన నెలవారీ జీతానికి ఈ బ్యాంకువారు స్వయం ఉపాధి పథకం క్రింద యిచ్చిన అప్పువలన ఈ వసరులన్నీ చేకూరాయని తన కుటుంబపరిస్థితి మెరుగు పడిందని కొండలరావు అంటారు.

గిరిజన యువకుడు

శ్రీ గోము బాలరాజు 30 సంవత్సరములు కొండ దొరల కులానికి చెందిన గిరిజన యువకుడు. 1958సం॥లో ఎస్.ఎస్.ఎల్.సి. పాసయి చాలాకాలం నిరుద్యోగిగా నిమ్మలపాలెంలో జీవిస్తూవచ్చారు. ఈతనికి పెద్దలు యిచ్చిన ఎ. 3-00 మాగాణి, 15-00ఎ. కొండ మెట్ట భూమి వచ్చింది. ఈ ప్రాంతమంతా వర్షాధారమగుట వలన ప్రతి నాలుగు సంవత్సరములకు ఒకసారి మాత్రము పూర్తి పంట పండుతూ వస్తూండేది. ఆదాయం జీవనభృతికి చాలదు.

1972లో యితనికి అడ్డతీగల పంచాయతి సమితివారు రూ. 500/-లు వ్యాపార ఋణంగా యిచ్చినారు. దానితో నిమ్మలపాలెంలో తన స్వంత యింట్లో ఒక్క కిరాణ దుకాణం నడుపుతు నెలకు 50/- అదనపు ఆదాయము సంపాదించుకునేవాడు. అతను లేని సమయంలో భార్య చూస్తూవుండేది వ్యాపారం.

1972లో అడ్డతీగల పంచాయతి సమితివారు ఒక్క గొర్రెల యూనిట్ (నాలుగు ఆడవి, ఒక్క పోతు) ఉచితంగా యిచ్చారు. ఈ మంద రెండు సం॥లు దాటాక 13 గొర్రెలు మందగా పెరిగింది. ఇందులో 4 పోతులు అమ్మివేస్తే రూ 600/-లు ఆదాయం వచ్చింది.

తాను చదువుకున్నందున వ్యవసాయరంగంలో అధునాతన పద్ధతులు మేలు రకపు వంగడములు, ఎరియగు సాధనములు, చీడమందులవాడి పంటలలో అభివృద్ధి చూపి గిరిజనులకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తూ వుంటారు. ఇదివరలో 8 బస్తాలు పండడము కష్టముగా యున్న మాగాణియందు RP 4-14, జయ పండించి ఎకరానికి 17 బస్తాల వరకు అధిక రాబడి సాధించారు. నిరుటి సం॥ మెట్ట పొలము మీద గంటి, కూరగాయలు వేసి రూ 3000/-లు ఆదాయము తీసారు.

1974 సం॥లో ముఠాలు రద్దుచేసిన సందర్భంలో గిరిజన యువకులకు గోమాడి కాపుల శిక్షణ తరగతులకూ హాజరై అందు ఉత్తీర్ణులై జూన్ 1975 సం॥లో టైమ్ ఆఫీసరుగా నియమితులయ్యారు. ఈ వుద్యోగము వలన వారి ఆదాయము నెలకు రూ 93/లు పెరిగింది.

—శ్రీ పా. వెం. సుబ్బారావు

నెహ్రూ యువక కేంద్రం

నెహ్రూయువక మండలి, జగపతి నగరం ప్రగతి-ప్రత్తిపాడు తాలూకాలో జగపతి నగరం ఓ చిన్న గ్రామం. దీనిని సమాచారశాఖ దత్తత తీసుకొంది. నెహ్రూ యువకమండలి స్థాపింపబడి దాని ఆధ్వర్యంలో ఒక వయోజన విద్యాకేంద్రం కాకినాడ "నెహ్రూ యువక కేంద్రం" ఆర్థిక సహాయంతో ప్రారంభించబడినది.

దీనిని రాష్ట్ర మాజీ మంత్రి శ్రీ తోట రామస్వామి ప్రారంభించారు. దీనికి అనుబంధంగా చిన్న పఠన మందిరాన్ని కూడా ప్రారంభించారు ఆ గ్రామ ఉపసర్పంచి శ్రీ చిన్నారావు.

వయోజన విద్యను ప్రారంభించిన 30 మందిలో ఒకరు చదరం అప్పారావు ఇతనికి కొంచెం నత్తి. అందుకే ఇతని తల్లి దండ్రులు తమ వృత్తియైన వ్యవసాయంలో పెట్టేరు.

ఒకనాడు నోరు మెదపలేని అప్పారావు నేడు రెండవ తరగతి పుస్తకం ధారాళంగా చదివేస్తున్నాడు—సినిమా పాటలు పాడేస్తున్నాడు—లెక్కలు కూడా నేర్చాడు ఇందులో 10 మంది హరిజన బాలురు కూడా తమ జ్ఞానాన్ని పెంచుకుంటున్నారు.

సన్నకారురైతు చెప్తున్నాడు వినండి

"నాపేరు నామగంటి సూర్యారావు. మా గ్రామం జె. అన్నవరం. శంఖవరం బ్లాకులో ఓ చిన్న గ్రామం. నాకు 5 ఎకరాల మెట్టభూమి వుంది. దానిలో నేను అతి కష్టంమీద ఓ గొట్టం బావి త్రవ్వుకున్నాను. నీరు పుష్కలంగా పండింది. కాని దానికి పంపు ఇంజను పెట్టుకునే స్తోమత లేకపోయింది.

సన్నకారు రైతుల భాగ్యమా అంటూ వెలసిన 'సన్నకారు అభివృద్ధి సంస్థ' కార్యకలాపాలు మా గ్రూపు బి. డి. ఓ. ద్వారా విన్నాను. ఆయిల్ ఇంజను కొరకు ఓ దరఖాస్తు బి.డి.ఓ. ద్వారా పెట్టించారు. బి.డి.ఓ. సన్నకారు రైతు అభివృద్ధిసంస్థ అధికారులు నా బావిని తనిఖీచేసి ఆయిల్ యింజను, పంపు ఇతర పరికరాలకొరకు 5 వేలు మంజూరు అప్పు చేయవలసినదిగా ప్రత్తిపాడు వ్యవసాయ బ్యాంకువారిని కోరారు. వారు నాకు 5 వేలు ఖరీదుచేసే ఇంజను వగైరా సప్లయిచేశారు. బావికి బిగించుకున్నాను. నా మదిలో గంగ గలగలపారింది. నాకిప్పుడు ఏనుగంత బలం వచ్చింది. ప్రస్తుతం మిరప, చెరకు వేసుకున్నాను. 10 సంవత్సరాలకు ముందే నా అప్పు నేను తీర్చుకోగలను. నా ప్రగతికి బాటలు వేసింది సన్నకారు రైతులసంస్థ. నాకు ఈ అప్పులో నాల్గవవంతు సన్నకారు రైతుల సంస్థనుండి సబ్సిడీ గ్రాంటయినది"

—శ్రీ సూ. జ్ఞానానందం

ఇది కథకాదు

ఏడు సంవత్సరాలనాటి మాట. భర్తను పోగొట్టుకొన్న ఓ యువతి, ఆ షాక్‌నుండి తేరుకోకముందే తన రెండు కాళ్ళు పోగొట్టుకొంది. కాళ్ళులేని ఆ దౌర్భాగ్య జీవితానికి సంకెళ్ళుగా ఓ ఏడాది ఆడపిల్ల - నిరుపేద కుటుంబానికి చెందిన ఆ విధవ బ్రతుకులో అంతా అంధకారం దిక్కుతోచక, చావలేక బ్రతకలేక కన్న బిడ్డతో కన్నవారి ఇల్లు చేరుకుంది ఆమె. పేదవారు వయస్సు మళ్ళినవారు అయిన తల్లిదండ్రులకు తను, తన బిడ్డ మరో గుదిబండలా తయారైనందుకు ఆమె దుఃఖపడింది. ఇళ్ళు వాకిలి అమ్మి కూలినాలిచేసి తల్లి పిల్లను ఆదుకున్నారు తల్లిదండ్రులు. అంతలో ఆమె విషాదమయ జీవితానికి మరో విఘాతం కలిగింది. గోరు చుట్టుపై రోకటిపోటు-అదే, కొండంత అండగా నిలిచి అదరించి పోషిస్తున్న ఆమె తండ్రి మరణం—ఈదెబ్బలన్నీ తట్టుకొంది తన బిడ్డకోసం ముదుసలి తల్లికోసం తాను బ్రతకాల్సిన అవసరం ఉందని నిశ్చయించుకొంది. చిన్న కిళ్లీ దుకాణం తెరచింది. ఇబ్బందులతోనే కాలం నెట్టుకుంటూ వచ్చింది. ఈ మధ్యలో నాల్గు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇంతలో ఆమె కుటుంబ జీవితం బాగుపడడానికి ఓ వెలుగు కనిపించింది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియావారు పెన్నిధిలా సాయపడ్డారు. ఋణ సౌకర్యం అందచేశారు. ఆమె తన కిళ్లీదుకాణ వ్యాపారం కొద్ది కొద్దిగా పెంచింది. రాబడితో ఋణం తీరుస్తూ కడుపుకు తింటూ కాలక్షేపం చేయసాగింది. కుంటిదైన ఆ విధవ తన కుటుంబ పోషణకు మంచి ఆస్కారం దొరికినందుకు భవిష్యత్తుపై ఆశలు పెంచుకొని, తల్లితోను, ఎనిమిది సంవత్సరాల కుమార్తెతోను జీవిస్తోంది. ఆమె యిలా చెప్పింది. "కాళ్ళులేనిదానిని, భర్తలేనిదానిని, బలహీన వర్గానికి చెందిన పేదదానిని అయిన నాకు స్టేట్ బ్యాంకువారు మొదట్లో రెండు దఫాలుగా రూ. 200 లు చొప్పున కిళ్లీ దుకాణం వృద్ధి చేసుకోవడానికి ఋణం యిచ్చారు. అవి తీర్చివేశాను. మళ్ళీ రూ 300 లు ఋణం యిచ్చారు. ప్రస్తుతం అది తీరుస్తున్నాను. అష్టకష్టాలు పడుతూ, దిక్కుతోచక, నిరాశతో బ్రతుకుచున్న నాకు, నా కుటుంబానికి బ్యాంకువారు చేసిన ఆర్థిక సహాయం ఎంతో మేలు చేసింది. మేము తిండికి యిబ్బంది పడకుండా జీవించగలుగుతున్నాము. నా కన్నబిడ్డను పెద్దచెయ్యాలనే ఆశతోను, నన్ను కన్న తల్లికి అండగా ఉండాలన్న పట్టుదలతోను, భవిష్యత్తు యింకా బాగుంటుందన్న నమ్మకంతోను జీవితం గడుపుతున్నాను"

ఇది కథకాదు. మరేమిటి? అనకాపల్లి నరసింగరావుపేటలో ఓ కిళ్లీ దుకాణంపెట్టి కుటుంబ పోషణ గావిస్తున్న శ్రీమతి కట్బోజు రాధమ్మగారి జీవితగాథ.

—శ్రీ జి. కేశవరావు

పాఠకుల లేఖలు

ఆర్యా,

నమస్సులు, మా, మీ, (మన) ఆంధ్రప్రదేశ్ ఆంగ్లాంధ్ర పత్రికలు నవంబరు 1976 సంచికలు రెండూ అందాయి. చాలా సంతోషం. ఆంధ్రప్రదేశ్ పత్రిక కొంటూ ఉన్నందుకు నిజంగా నేను చాలా గర్విస్తున్నాను.

నా మట్టుకు నేను ఈ ప్రత్యేక సంచికను ఒక "బంగారు నాణెం" లాగా భావిస్తున్నాను. దాని అసలు విలువ దానికున్నది. అలాగే మన "ఆంధ్రప్రదేశ్" పత్రికకూడాను।

అప్పలయ్యబట్ల నాగరాజశర్మ,
పీలేరు
చిత్తూరుజిలా,

నిన్ననే ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఇష్యూ చూశాను. చాలా బాగుంది. ఎంత బాగా కృషిచేసి దాన్ని వెలువరించారో వివరంగా వ్రాయనక్కర లేదు.

సి. వి కృష్ణారావు.
కాకినాడ.

1976వ సం॥ నవంబరు సంచిక [సంపుటి 21 : సంచిక 1] ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 20 వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికగా, దేదీప్యమానంగా అంటే ఇటీవలి దసరా ప్రత్యేక సంచికల కన్నా చాలా మిన్నగా వుంది. రానురాను ఆంధ్రప్రదేశ్ తెలుగు మాస పత్రిక ఎంతో ముస్తాబుతో బయటికి వస్తున్నది.

ఈ నవంబరు ప్రత్యేక సంచికలో ఎందరో కళాప్రపూర్ణులు మరెందరో డాక్టర్లు, ఇంకెందరో పెద్దవారు వ్రాసిన రచనలు లభ్యమయ్యాయి. చాలా సంతోషమయినది. కానీ, మధురకవితల మహామనిషి డాక్టరు సి. నారాయణరెడ్డి గారి కవితాపుష్ప గుచ్ఛం లేకపోవటం నాకెంతో వెలితనిపించినది. డాక్టరు సి నారాయణరెడ్డి గారి కవితలు, శ్రీ తాళ్లూరి నాగేశ్వరరావు గారి కథానికలు ఆంధ్ర ప్రదేశ్‌లో అచ్చయేలా చూస్తారని ప్రగాఢమైన ఆకాంక్ష.

కొప్పర్తి రామరావు,
భీమవరం.

ఆంధ్రప్రదేశ్ నవంబరు 76 ప్రత్యేక సంచిక (నా చందా కాపీ) చేరింది. ఎంతో ఉదాత్తంగా వెలువడింది. నాలుగు కాలాలు దాచుకోదగిన సంచిక.

తిరునగరి, అడ్డగూడూరు
నల్లగొండ జిలా

మీ అధ్వర్యంలో వెలువడిన 'ఆంధ్రప్రదేశ్' చాలా బాగుంది. వివిధ విషయాలను గురించి మంచి వ్యాసాలున్నాయి. ఇంగ్లీ ది కూడా బాగుంది.

శివలెంక ప్రకాశరావు,
లెక్చరర్, రాజోలు.

ఈ సంచికలో రచయితలు

శ్రీయుతులు

కుమారి వి. సత్య సావిత్రి C/o వర్ధనీ ఫుడ్ క్రాఫ్స్, రోడ్, కాకినాడ.

ఎన్. వెంకటస్వామి, పార్లమెంటు సభ్యులు, న్యూఢిల్లీ.

ఉన్నవ మదన మోహనరావు, 6-3-354/2, హిందీనగర్ కాలనీ, బంజారా హిల్స్, హైదరాబాద్.

పులిచెర్ల సాంబశివరావు, 17 వలైను, అరండల్ పేట గుంటూరు 2.

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 69, ఆదర్శనగర్, హైదరాబాద్.

శ్రీమతి సి. ఆనందారామం, ఎస్. టి, 26, మారేడుపల్లి, సికిందరాబాద్.

శ్రీమతి వేదవతీ, దేవి, "గోకుల్" 44, ఎల్. ఐ. సి. కాలనీ, మెహదీపట్నం, హైదరాబాదు.

డాక్టర్ ఆర్. వి. రావు, 3-4-674/1, నారాయణ గూడా, హైదరాబాదు-29.

తిరుమల రామచంద్ర, 69, ఆదర్శనగర్, హైదరాబాదు.

ఎల్లోరా, 63 వి.ఆర్. పిళ్లైవీధి ట్రిప్లికేషన్, మద్రాసు.

స్కెచ్

తెలుగు వారి హాస్యము

(గత సంచిక తరువాయి)

మన పురాణాల మాటకు వస్తే ముందుగా మనకు గుర్తు వచ్చే బావా మరదులు కృష్ణార్జునులే. వారిద్దరి మధ్య ఎన్ని సరాగాలు, సరస సంభాషణలు, ఎన్ని రహస్యాలు. అదంతా ఒక మధుర గాథాలహరి!

ఇహ, ప్రేయసీ ప్రియుల మధ్య, భార్యాభర్తల మధ్య శృంగార పరమైన హాస్యానికీ, చమత్కారానికీ లోటు ఏముంటుంది! అందునా, హాస్య ప్రియులైన తెలుగు లోగిళ్ళలో!

పల్లెటూరి ఏటి ఒడ్డు, ఒడ్డున కూర్చుని నీళ్ళల్లోకి పాదాలు ఆడిస్తూ కోర మీసాల చిన్నవాడిని ఆట పట్టిస్తూ పడుచు పిల్ల రాగం తీస్తుంది.

"ఒకరికీ చేతులి చ్చాన్
ఒకరికీ కాళూ ఇచ్చాన్
ఒకరినీ చేతా బట్టి
కూకున్నానోయ్ బావా
కూకున్నానోయ్ ..."

పడుచు గుంటడికి నిజంగానే కాళ్లూ చేతులూ ఆడకుండా పోయి... "ఏమీచేమిటీ!..." ...అంటూ ఆవేశ వడ్డాడు పాపం!

ఆ కొంటె పిల్ల అతగాడి ఆరాటానికి నవ్వుతూ:

"గాజులకీ చేతూలిచ్చాన్
కడియాలకి కాళ్ళ నిచ్చాన్
డబ్బుల్నీ చేతా బట్టి
కూకున్నానోయ్ బావా
కూకున్నా నోయ్...."

అనే టప్పటికి ఆ కోర మీసాల కుర్రవాడితో పాటూ మనమూ నవ్వేయకుండా ఉండగలమా!

ఇది ప్రేయసీ ప్రియుల మధ్య వచ్చే సరాగానికి మచ్చు తునక. భార్యాభర్తల మధ్య సాగే సరస సల్లాపాలు కూడా ఇంతకు ఏమీ తీసి పోనివి గానే ఉంటాయి. అవి పడుచు జంటలయినా, పొద్దు వడమటికి వాటారిన ముసలి జంటలయినా హాస్యోక్తుల విరివాన వారి మధ్య విరియకుండా ఉండదు.

భార్యాభర్తల మధ్య సరాగం అనగానే ముందుగా మన కళ్ళ ముందు సాక్షాత్కరించేది ముని మాణిక్యం వారి కాంతమే. ఆమె వసహారణాలా తెలుగు తనం మూర్తీభవించు కొన్న ఇల్లాలు. కాంతం వంటి ఇల్లాలు తెలుగుజాతి పండించుకొన్న పుణ్యాల పంట. సగసతలో, వాక్చతురిమలో, స్నేహగరిమలో భర్తకు అనురక్తురాలై, అతడిని వశవర్తునిగా చేసుకున్న చతురురాలు, ఆవిడ ఈ కాలపు చదువులు చదవలేదు. కాని ఆవిడ వేసే సవాళ్లకు ఆవిడ భర్తే కాదు, ఏ లాయరూ జవాబు చెప్పలేడు. అంతటి విజ్ఞత గడించుకొని, ఇంటిని స్వర్గ తుల్యం చేసుకున్న మహిళా రత్నం ఆమె. తెలుగుజాతి ఉన్నన్నినాళ్లూ, కాంతం వంటి ఇల్లాళ్ళు ఉంటారు. భర్తలతో సరసాలు ఆడుతూనే ఉంటారు.

భార్యలతో సరాగాలాడటం మాత్రం మనకు క్రొత్త సంగతా! భక్తిరసం తేనెవాకలుగా చిలికి చిందించిన భాగవతంలో పోతన్న గారు శ్రీమన్నారాయణుడి సరసతను వర్ణించిన విధం చూడండి!

అలవైకుంఠ పురంలో, నగరిలో, ఆమూల సౌధంబు దాపల, మందార వనాంతర ప్రాంతంలో ఎక్కడో ఉన్నాడు శౌరి, పర్యంకం మీదే ఉన్నాడు. సరే, రమతో ఏ సరాగాలో ఆడుతూనూ ఉన్నాడు.

శ్రీమతి వేదవతీదేవి

అంతవరకూ బాగానే ఉంది. గజేంద్రుడి మొర 'పాహి పాహి' అనే ప్రార్థన విన వచ్చింది ఉన్నట్లుండి దిగ్గున లేచాడు. ఎదురుగా ఉన్న భార్యతోనూ 'నేను ఫలాన చోటకు వెళ్ళి వస్తాన'ని అనడు. శంఖచక్రాలకూ, మరి ఇంకా ఏ ఇతర పరివారానికీ చెప్పడు. ఏదో ఎస్.ఓ.ఎస్. వచ్చి ఉంటుందని పాపం వాళ్లందరూ పరిపెట్టుకున్నారు.

కాని, వచ్చిన చిక్కల్లా పాపం, లక్ష్మీదేవికే. పరిహాసానికో, వినోదానికో వివాదానికో భార్య చేలాలం చతంన ఉత్తరీయపు చెరగుకు ముడి వేసుకున్నాడట పాపం! అది మరిచిపోయి పరిగెడుతూఉండే భర్తను చిడిముడి తడబడు అడుగులతో అనుసరించకతప్పలేదు సిరికి! ఈ దృశ్యం ఎంతో ఇంపుగా, సొంపుగా పోతన్నగారి కలం మనకు చిత్రిస్తుంది.

ఇక్కడ ముఖ్యాంశం శ్రీమన్నారాయణుడి ఆపన్న ప్రసన్నత్వమే! కాని సరసుల మనస్సులను గిలిగింతలు పెట్టేది మాత్ర వివాద ప్రోతిత శ్రీ కుచోపరిచేలాంచలమే! భార్యాభర్తృత్వ సంబం

ధంలో అడుగడుగునా ఈ వివాదం, ఈ వినోదం చోటు చేసుకుని వారి దాంపత్య జీవనానికి రసస్పందనను సంతరించి పెడుతూ ఉంటుంది.

సీతా రాముల కథ జగద్విఖ్యాతమైనది. రామయ్య తెలుగు వారి ఇలవేలుపు. సీతమ్మ తెలుగు వారింటి ఆడపడుచు. వారి కథ తమ ఇంటింటి కథ.

కొత్తగా కాపురానికి వచ్చిన కోడలు సీత. అత్త మామలకు, పిన్నత్తలకు పరిచర్యలు చేసి, పని తెముల్చుకునే సరికి జాము పొద్దు పోయింది. అప్పుడు శృంగారం చేసుకుని, కస్తూరి జవ్వాది ఘుమ ఘుమలు పులుముకుని పడకటింటికి చేరేటప్పటికి ఊరు మాటు మణిగింది.

కొత్త పెళ్లికొడుకు మీనమేషాలు లెక్కిస్తూ అంతసేపు భార్యకోసం వేచి ఉండేటప్పటికి రామయ్యకు ఓర్పు తగ్గింది. చిరుకోపం వచ్చింది. భార్య వస్తూ ఉన్న జాడ కనిపెట్టి తలుపు గడియ పెట్టి పచి, నిద్ర నటిస్తూ పవలించాడు

"నిలుచుండ పాదాలు చేతులూ నొచ్చె
దంతంపు తలుపులూతీయవోయి నాథ!"

అంటూ వేడికోలు మొదలు పెడుతుంది. లోపలనుంచి ఉలుకూ పలుకూ లేకపోయేటప్పటికి—

నాలుగో జామాయె నాప్రాణనాథ
కరుణించి తీస్తివా కాళ్ళకడనైన
మరచి ఒక నిద్రైన శరణంది పోదు!"

అని బ్రతిమాలుతుంటుంది. రామయ్య బిర్ర బిగిసి అంటాడూ—

"నిద్ర నీకు లేకుంటె నాకేమి సీత
గంటవలె దీపమ్ము అదినాకు తోడు
నీవు నిల్చుంటేను నాకేమి సీత
పట్టె మంచము పరుపు అది నాకు తోడు"

ఇది పెళ్ళాన్ని ఏడిపించటానికి ఆడే సరసం ఇది తెలుగింట ప్రతి జంటకూ ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోకి వచ్చే మధుర శృంగారం. ఇది తెలుగువారు ఆదర్శ దంపతులుగా కొలుచుకునే సీతారాములకు ఆపాదించుకొని, తమకుతాము మధురానుభూతిని పొందే శృంగార రసభావం.

జాతి జీవనానికి, సంస్కృతికి దర్పణం వంటిది జానపద సాహిత్యం. తమ అనుభవాలను, కష్టసుఖాలను, సరదాలను, శృంగార రసానుభూతులను—అన్నిటినీ కలబోసికొని, అలవోకగా జాతీయమైన భాషలో పాడుకుంటారు జానపదులు. అందువల్లనే ఈ పల్లె పదాలలో మనకు అన్ని రసాలతోపాటు—హాస్యము—శృంగారము—సమపాళ్లుగా కలిపిన దివ్యభావన గోచరి ంది.

బావామరదళ్ల మధ్య భార్యాభర్తల మధ్యనేకాక—నిత్య జీవితంలో ఎక్కడ పడితే అక్కడ హాస్యరసాన్ని సృష్టించుకుని—తాము నవ్వుకుని—ఎదుటి వాడిని నవ్వించగల హాస్యశీలి తెలుగబ్బి.

సాహిత్యంలో హాస్యం

మన పురాణాల దగ్గరనుంచి 'అత్తగారి కథలు' (భానుమతి) వరకూ హాస్యరసం అక్కడక్కడా చిప్పిలుతూనే ఉంటుంది.

కాని మన పురాణాలలో, ప్రబంధ కావ్యాలలో కనిపించే హాస్యం కొంతవరకు తక్కువనే చెప్పాలి. అది రేఖా మాత్రంగా—భారతంలో, భాగవతంలో మనకు కావవస్తుంది.

భారతం-ఆదిసభా పర్వాలలో—నన్నయ భట్టారకుడు ఆయా ఘట్టాలలో సునిశితమైన హాస్యం చొప్పించిన సందర్భాలు ఉన్నవి. విరాట పర్వంలో బృహన్నల వేషధారణపట్ల, భీముని వంటలవాని వేషవర్ణనపట్ల, కీచకవధ ఘట్టంలోనూ, ఉత్తర గోగ్రహణ వర్ణనలోనూ తిక్కన కూడా చక్కని హాస్య ధోరణిని ప్రదర్శించి, తన హాస్య ప్రియత్వాన్ని చాటుకొన్నారు.

పోతన్నగారి బాలకృష్ణుడు చేసిన చిలిపి పనులన్నీ నవ్వు పుట్టించేవే.

"ఓయమ్మ నీ కుమారుడు
మా యిండ్లను పాలు పెరుగు మననీడమ్మా"

అని యశోదమ్మకు ఫిర్యాదు చేసుకుంటున్న గోపికల స్థితి ఊహించుకుంటేనే మనకు నవ్వు వస్తుంది.

"నా పట్టి పొట్ట నిండగ
పైవడి నీ పట్టి వెన్న బానెండిడి నా
డూపిరి వెడలదు వానిం
జూపెద నేమైన నీవ చుమ్ము లతాంగీ!"


ఈ పని చేసినవాడు ఎవ్వడో మరెవడో కాదు. తెలుగువారి బుడుతడు! బాల కృష్ణుడు! అందుచేతనే వాడు చేసిన ఈ పనికి మనకు కోపం రాదు సరికదా—నవ్వు దొంతరలే దొర్లుతాయి.

శ్రీనాథుడు ఎంతటి కవి సార్వభౌముడో—అంతటి రసజ్ఞుడు, సరసుడు, చమత్కార శీలి. సాహిత్యంలో హాస్యరసానికి తగిన ప్రాధాన్యం ఇచ్చి – తన హాస్యప్రియత్వాన్ని చాటుకొన్న సరసుడు గ్రామ సంచారాలలోనూ, కవితా గోష్ఠులలోనూ,— శ్రీనాథుడు చెప్పిన ఎన్నో చమత్కారమైన పద్యాలు—ఇప్పటికీ చక్కని చాటువులుగా ప్రజలమధ్య నిలిచి పోయినవి. అనేక సందర్భాలలో, అక్షర జ్ఞానం ఉన్న తెలుగువారు—ఈ చాటువులను సందర్భోచితంగా ఉపయోగించుకుని కడుపారా నవ్వుకోవటం పరిపాటి అయిపోయింది.


శృంగార నైషధంలో నలదమయంతుల వివాహ ఘట్టం మహా అట్టహాసంగా, వైభవంగా వివాహం జరిగింది. ఆ సందర్భంలో జరిగిన బువ్వపు బంతులాట! విందు భోజనం. ఈ పద్యం చిత్తగించండి!

"ఓమ్మె యేమె యిదేమేమె లేమ, యేమె
మేషపుష్పంబు దేః' వంచు మేల మాడ
'మేమె మే'మెలు దలచయ్యో మేలు మేలు
మేక మేకన సభవారు మిగుల నగిరి"

(సశేషం)




అఖిల భారత మ్యూజియం నిర్వాహకుల మహాసభ ప్రతినిధులు డిసెంబరు 18న రాజ్‌భవన్‌లో గవర్నరును సందర్శించారు




జనవరి 4న గవర్నరు శ్రీ ఆర్. డి భండారే నగరంలోని మురికి వాడలలో "పాదయాత్ర" జరిపిన దృశ్యం

నగరంలో




డిసెంబరు 15న "యువరచయితల" సదస్సులో గవర్నరు అధ్యక్షోపన్యాసం యాంత్రిక శాఖామంత్రి డా సి హెచ్. దేవానందరావు, శాసనమండలి సభ్యులు శ్రీ ఎ. చక్రపాణి, శ్రీ వి నారాయణరావు ప్రభృతులు హాజరయ్యారు.



డిసెంబరు 12 న గవర్నరు శ్రీ ఆర్, డి. భండారే పటన్ చెరువు వద్ద బలహీన వర్గాల వారికి పట్టాసర్టిఫికెట్లు పంపిణీచేశారు.




డిసెంబరు 21న గవర్నరు శ్రీ ఆర్. డి. భండారే గాంధీ భవన్‌లో రంగస్థల కళాకారుల సదస్సునుద్దేశించి ప్రసంగించారు



జాతీయ విద్యార్థి సమితి రాష్ట్ర శాఖ వారు క్షామబాధితుల సహాయార్థం పాతవస్త్రాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించి సేకరించిన కొన్ని వస్త్రాలను ముఖ్యమంత్రికి అప్పగిస్తున్న దృశ్యం: విద్యా. సాంస్కృతికమంత్రి ఎం వి. కృష్ణారావు చిత్రంలో వున్నారు




డిసెంబరు 16న కేంద్ర విద్యామంత్రి ప్రొఫెసర్ నూరుల్ హసన్ సాలార్ జంగ్ మ్యూజియం రజతోత్సవాలు ప్రారంభించారు. గవర్నరు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు




జనవరి 1 వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు "తెలుగు అకాడమి" భవన ప్రవేశానికి ప్రారంభోత్సవం చేశారు



డిసెంబరు 31వ ఇండో జపాన్ ప్రతినిధి వర్గం సచివాలయంలో ముఖ్యమంత్రిని సందర్శించారు.




ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు డిసెంబరు 31న అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు. వ్యవసాయమంత్రి శ్రీ జె. చొక్కారావు చిత్రంలో వున్నారు.




వాణిజ్యపన్నులు, ఎక్సైజుశాఖకు చెందిన భవన సముదాయానికి డిసెంబరు 23న ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు శంకుస్థాపన చేశారు.


నగరంలో వార్తాచిత్రాలు



కేంద్ర విద్యామంత్రి ప్రొఫెసర్ నూరుల్ హసన్ నవంబరు 27న "విద్యాభవన్‌కు" శంకుస్థాపనచేశారు ముఖ్యమంత్రి అధ్యక్షత వహించారు.



యువజన నాయకుడు శ్రీ సంజయ్ గాంధీ డిసెంబరు 24 న నిజాం కళాశాల ఆవరణలో ప్రసంగించిన సందర్భంగా దాదాపు 2 లక్షల మంది హాజరయ్యారు.



'మనీ బ్యాక్' పాలసీ
(డబ్బు ముందు చెల్లింపు పాలసీ)

కాలపరిమితి తీరకముందే నిర్ణీత వ్యవధులలో ఇతర పథకాల క్రిందకన్న త్వరగాను, ఎక్కువగాను, సొమ్ము తిరిగి లభిస్తుంది.

'క్యాష్ & కవర్' పాలసీ **(నగదు & రక్షణ పాలసీ)**

ప్రతి 5 సంవత్సరాలకు వాయిదాలలో సొమ్ము గ్యారంటీగా చెల్లింప బడుతుంది — భీమా చేసిన పూర్తి సొమ్ముపై బోనసులతో సహా — పైగా జీవితకాలమంతా భీమా రక్షణ.

'ప్రోగ్రెసివ్ ప్రొటెక్షన్' పాలసీ
(వర్ధమాన సంరక్షణ పాలసీ)

కొత్తగా దరఖాస్తుచేసే పనిగానీ, వైద్య పరీక్షతోగానీ పనిలేకుండా, పాలసీ విలువ నిర్ణీత కాల వ్యవధులలో పెరుగుతూ ఉంటుంది.

మారే కాలానికి....
మారుతున్న అవసరాలకు

లైఫ్ ఇన్సూరెన్స్
కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

daCunha/LIC/38 TEL

నిరాశలో నిండు గుండె

— సి. ఆనందారామం

జరిగిన కథ

శ్యామ్ తండ్రి జనార్దన్ వద్ద పెరిగిన సి.ఐ.డి. అధికారి మోహన్ లోటస్‌హోటల్ యజమాని సాంబశివం చేస్తూన్న దొంగనోట్ల వ్యాపారం పట్టివ్వడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రసూన, చిరంజీవి మోహన్‌కు సాయంచేస్తూన్నారు. ఈ కేసునుండి ప్రసూనను దూరంచేయమని సుశీలతో అంటాడు శేఖర్. రేఖ మోహన్‌కు సాయం చేస్తానని మాటయిస్తుంది. మోహన్ ప్రసూన దగ్గరకు వెళతాడు. ఆమె అయిష్టంగా మాట్లాడి పంపి వేస్తుంది. ఇక చదవండి...

ఆ రోజు ఉదయం 6 గంటలకే మోహన్‌కుఫోన్ వచ్చింది. అవతలివైపునుండి రేఖ కంఠం విలాసంగా పలికింది—

"మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నానా ?"

"చేసేసారుగా ! చెప్పండి !"

"ఇది అంత ముఖ్యమైన విషయం కాకపోతే ఇలాంటి సమయంలో మీకు ఫోన్ చేసేదాన్నికాను"

"అసలు సంగతి చెపుతారా ? లేదా ?"

"చెప్పాలనే ఉంది—ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు."

"ఆలోచించుకుని మళ్ళీ ఫోన్ చేస్తారా ?"

"అక్కర్లేదు — విని మీరేమనుకుంటారో, ఏం చేస్తారో ఊహించ లేకుండా ఉన్నాను. చాల భయంగా ఉంది."

మోహన్ మాట్లాడ లేదు —

"హలో !" అంది రేఖ —

"వింటున్నాను"

"అంత కోపమయితే ఎలాగండీ ! మీ మేలు కోరేదాన్ని గనుక కష్టపడి ఫోన్ చేస్తున్నాను. కాని లేకపోతే నాకేం పట్టింది? పెట్టెయ్యనా ?"

"ఇందాకటినుండి నేను అడుగుతున్నది చెప్పమనే ?......"

"ఎలా చెప్పనండీ. సరే ! వినండి – మన శ్యామ్ ఒక పెద్ద గవర్నమెంట్ ఆఫీసర్‌గారి దగ్గర నుండి "త్రి ఇన్ వన్" జపాన్ ఇంపోర్టెడ్ దొంగిలించి పట్టుబడిపోయాడు – ఆ ఆఫీసర్‌గారు పోలీస్ రిపోర్టు ఇస్తానని కూర్చున్నారు. నేను సాంబశివంగారు ఆయనకు నచ్చ చెప్పలేక సతమతమయి పోతున్నాము – వచ్చిన చిక్కు ఎక్కడంటే శ్యామ్ దొంగతనం చేసాడనటానికి కావలసిన ఆధారాలన్నీ ఉన్నాయి." మోహన్ రక్తం చల్లబడిపోయింది: సాంబశివం పన్నిన ట్రాప్ మోహన్‌కు అర్థమయింది. మళ్ళీ శ్యామ్ తన కాళ్ళకు అడ్డుపడుతున్నాడు – సాంబశివం తనలాంటి ఆఫీసర్‌ను బెదిరించటానికి సాహసిస్తున్నాడంటే, అవతలి గవర్నమెంటు ఆఫీసర్ చాల ప్రముఖుడై ఉండాలి –

"హలో......" అంది రేఖ మళ్ళీ – ఈసారి చిలిపిగా — కొంటెగా —

మోహన్ మాట్లాడక పోయేసరికి "వింటున్నారా ?" అని మోహన్ సమాధానం కోసం ఆశించకుండా తనే ప్రారంభించింది.

"పాపం. మన శ్యామ్ ఎంతో మంచివాడండీ ! ఇంత వయసు వచ్చినా పసితనం వదలలేదు. 'రేఖా' 'రేఖా' అంటూకూడా కూడా తిరుగుతాడు. ఏమిటో కాలం కలసిరాక పట్టుబడిపోయాడు. విచారణ జరుగుతే మన శ్యామ్ భవిష్యత్తు ఏమయిపోతుందండ ?"

ఏడుపు గొంతుకతో అంది రేఖ – ఆ ఏడుపులో విరగబడి నవ్వుతున్న రేఖ స్పష్టంగా కనిపిస్తోంది మోహన్‌కి –

"థాంక్యూ ! ఈ విషయం గురించి నేను ఆలోచిస్తాను లెండి !"

"ఆగండి ! ఆగండీ ! పెట్టెయ్యకండీ — శ్యామ్ కోసం నేను సాంబశివంగారిని ఎన్నో విధాల బ్రతిమాలాను—ఆయన సాధారణంగా నా మాట కాదనరు లెండి ! ఈ ఆఫీసర్‌గారు సాంబశివంగారి ఫ్రెండ్ – అందుకే ...... సరే ! సాంబశివంగారు ఎంతమంచి వారో తెలుసా, ఏమన్నారో వినండి –'నేను ఎవ్వరికీ ఏ అపకారం చెయ్యను. మోహన్ అంటేనాకెంతో ఇష్టం — అతనే నిష్కారణంగా నన్ను కాదని వెళ్ళిపోయాడు — మోహన్ నా స్నేహం కోరితే అంతకంటే నాకు కావలసింది ఏముందీ ?' – అని. మీరేం నిర్ణయించుకుంటారో, మరి !"

ఫోను పెట్టేసింది రేఖ —

ఆ తరువాత మోహనుకు నిద్ర పట్టలేదు – భరింపరాని అశాంతితో మనసు ఉడికి పోసాగింది—

"దయాఋణంనుండి బయటపడటం కష్టం సార్ ?" అంటున్న చిరంజీవి మూర్తి తనను వెక్కిరిస్తున్నట్లు అనిపించ సాగింది.

ఏమయినాసరే, లొంగకూడదనే నిర్ణయించుకున్నాడు గుండె రాయి చేసుకుని తను సంపాదించిన రికార్డు మీద రిపోర్ట్ వ్రాయటానికి తయారయ్యాడు

జనార్దన్ వచ్చాడు—ఎందుకు వచ్చాడో అర్థమయింది మోహన్‌కు. ఆ వెనుక శ్యామ్‌కూడా ఉన్నాడు—తలవంచుకుని కూర్చుకున్నాడు.

జనార్దన్ నవ్వుతూ "మోహన్! ఒక రకంగా జరిగిన దాని కంతకు నువ్వే బాధ్యుడివోయ్! శ్యామ్‌కు డబ్బు అందనీయవద్దని

అన్నావు. నీ మాట విన్నాను. మనం యిచ్చేయకపోయినా శ్యామ్‌కు డబ్బు ఎలా వస్తోందని ఎవ్వరమూ ఆలోచించలేదు. చివరకు ఇలా వచ్చింది. ఈ సమస్య ఎలా పరిష్కరిస్తావో పరిష్కరించు'' అన్నాడు. జనార్దన్ గడుసు తనానికి నివ్వెర పోయాడు మోహన్.

రేఖ ప్రోత్సాహంతో చిన్న చిన్న దొంగతనాలు హోటల్‌లో చెయ్యటానికి అలవాటు పడిపోయాడు శ్యామ్. రేఖ చెప్పిన ఉపాయాలతో దొరికి పోకుండా బయట పడటంతో హుషారొచ్చింది.

రేఖ "త్రీ-ఇన్-వన్'' చూపించి దొంగిలించమనగానే మొదట కొంచెం భయపడ్డాడు శ్యామ్.

"ఇలాంటి వస్తువులు తీసుకుంటే దొరికిపోతామేమో!" అన్నాడు.

''నిన్ను పట్టుకోవటానికి బ్రహ్మ దిగిరావాలి అది అయనదే ననటానికి ఏమిటి ఆధారం? వెంటనే ఆ మేన్యుఫ్యాక్చరింగ్ నంబర్ పోయేలా చూసుకుంటే సరి! 'త్రీ-ఇన్-వన్' ఇండియాలో అమ్మితే అధమం మూడువేల పైన వస్తుంది తెలుసా?"

"మూడువేల'' సంఖ్య శ్యామ్‌ను ఆకర్షించింది—ముందు ఆలోచన లేకుండా సాహసించాడు—సాంబశివం అంతాముందుగానే ఏర్పాటుచేసి ఉండటంవల్ల శ్యామ్ దొంగతనం చేస్తూండగా ఆ ఆఫీసర్‌గారి నౌకరు ఫోటోలు తీసాడు. శ్యామ్ 'త్రీ-ఇన్-వన్'తో బయట పడకుండానే ఆ ఆఫీసర్‌గారు పట్టుకున్నారు. 'ఇవాళ కాక పోతే రేపు' అని సాంబశివం ఏ భరోసాతో అన్నాడో అర్థమయింది మోహన్‌కి.

"ఇప్పుడు నేనేం చెయ్యగలను?''

ఎంతో దృఢంగా అనాలనుకున్న మాటలు నీరసంగా వచ్చాయి.

"ఆ రికార్డు నేను చూసాను. అందులో ఏవో లెక్కలున్నాయి. అంతకంటే ఏంలేదు. అసలు దొంగనోటులక్కడ ప్రింట్ చేస్తున్నారు. ఎవరు ప్రింటుచేస్తున్నారో పట్టుకోవాలి! అప్పుడుగాని కేసు నిలవదు."

"ఆ రికార్డు చూసిన ఎవరికైనా ఏరోజు ఎన్నెన్ని దొంగ నోట్లు ఏ విధంగా ఎక్స్‌ఛేంజ్ చేస్తారో" అర్థమయి పోతుంది.

"అవుననుకో! అంతమాత్రాన ఏమవుతుంది? ఆ వ్యాపారమంతా నడిపిస్తున్నది సాంబశివం అనటానికి ఆధారమేముంది! నీకా రికార్డు ప్రసూన గదిలో దొరికింది. అందరూ కలిసి ప్రసూన మీదకు తోసినా తొయ్యవచ్చును ఏది ఎటు తిరుగుతుందో చెప్పలేము!"

ఉలికి పడ్డాడు మోహన్—జనార్దన్ కనీ కనిపించకుండా నవ్వాడు—మోహన్ లోలోపల కటకట పడ్డాడు.

"ఏది ఏమయినా రిపోర్ట్ ఇయ్యడానికే నిర్ణయించుకున్నాను"

మొండిగా అన్నాడు మోహన్.

జనార్దన్ లేచి మోహన్ చేతులు పట్టుకున్నాడు.

"నిన్ను ఇంతవాడిని చేసిన ఈ చేతులతో నీ చేతులు పట్టుకొని బ్రతిమాలుతున్నాను మోహన్. నిష్కారణంగా శ్యామ్‌జీవితం నాశనం చెయ్యకు. దీనివల్ల ఎవరికీ ప్రయోజనంలేదు. నువ్వు రిపోర్ట్ ఇస్తావు. అంతమాత్రాన దొంగనోట్ల వ్యవహారమంతా ఋజువు చెయ్యలేవు—ఆవతలివాళ్ళు సామాన్యులు కారు—వాళ్ళకు ప్రభుత్వంలో కూడా పలుకుబడి ఉన్నట్లు ఈ ఆఫీసరు వ్యవహారంతోనే తెలుస్తుంది. నువ్వు రిపోర్టు ఇచ్చినా వాళ్ళు ఎలాగైనా తప్పించుకోవచ్చు—ఈ రికార్డుకంటె బలమైన ఆధారాలు లేకపోవడంవల్ల నువ్వేమీ చెయ్యలేవు—ఈ గొడవవల్ల వాళ్ళు ఇంకముందు మరింత జాగ్రత్తగా ఉంటారు. అలాకాక ఈ చిన్న రికార్డు విషయంలో వాళ్ళతో రాజీ పడినట్లు నటిస్తే ముందుముందు అసలు దొంగనోట్లు ఎవరు ప్రింటు చేస్తున్నారో ఎక్కడ ప్రింటు చేస్తున్నారో పట్టుకోవచ్చు—అప్పుడది బలమైన కేస్ అవుతుంది—ఎవరూ సాంబశివాన్ని తప్పించలేరు.''

జనార్దన్ ఎంతో అనుభవంతో చెప్పిన మాటలు ఆలోచిస్తూ ఉండిపోయాడు మోహన్. అదీకాక ఈ వ్యవహారంలో ఇరుక్కున్నది శ్యామ్ మాత్రమేకాదు. ప్రసూనకూడా వుంది. ప్రసూన అమాయకురాలా, కాదా, అన్నది వేరేవిషయం.

తల చేతులతో అదుముకున్నాడు.

"ఏమంటావ్ మోహన్?''

మోహన్ మెత్త పడటం గ్రహించి మరింత ప్రాధేయ పూర్వకంగా అన్నాడు జనార్దన్

"మీ మాట కాదనలేను సార్''

నిట్టూరుస్తూ అన్నాడు మోహన్—

తలుపు తెరచుకొని తన దగ్గరకి వస్తోన్న మోహన్‌ను ఆదరణతో ఆహ్వానించాడు సాంబశివం—

మోహన్ మాట్లాడకుండా తన దగ్గరున్న రికార్డు సాంబశివం ముందుపెట్టాడు—

సాంబశివం నవ్వి "నా 'రేపు'వచ్చిందన్నమాట." అన్నాడు.

"అందరికీ 'రేపు' వస్తుంది"

"అవును వస్తుంది. కానీ, ఏమవుతుందో తెలియదు. ఆ తెలియక పోవటంలోనే జీవిత మాధుర్యమంతా నిండి ఉంది. మనం వేసే ప్రతి అడుగూ రేపటి చుట్టూ మనం అల్లుకునే బాటలలోనే!"

మోహన్ తెల్లబోయి చూశాడు. సాంబశివం ఇంత తెలివిగా మాట్లాడ గలడని అతడనుకోలేదు.

శ్యామ్ దొంగతనం చేస్తుండగా తీసిన ఫోటోలు మోహన్‌కిచ్చాడు. సాంబశివం తన చెయ్యిజాపాడు. ఆ చెయ్యి అందుకుని స్నేహపూర్వకంగా ఊగించి ఎలాగో బయట పడ్డాడు మోహన్—

జనార్దన్‌గారి ముందు ఆఫోటోలు పెట్టాడు.

మీరు నన్ను ఇంతవాణ్ణి చేశారు. నేను మీకు ఎంతో ఎంతో ఎంతో ఋణపడి ఉన్నాను. అందుకు ప్రతిఫలంగా ఏదైనా కోరండి నా అంతరాత్మను మాత్రం కోరకండి—ఈ శరీరాన్ని పోషించుకునేది ఆత్మను చంపుకోవటానికి కాదు...''

కన్నీళ్ళతో చేతులు జోడించాడు మోహన్. (సశేషం)

గ్రంథ సమీక్ష

సుధా స్రవంతి

[జానపద గేయ సంకలనం—సమీక్షకర్త: శ్రీ నంద్యాల గోపాల్.
1/8 డెమ్మీలో 128 + 8 + 8 పేజీలు. వెల: 8 రూపాయలు.
ప్రతులు దొరుకుచోటు: నంద్యాల గోపాల్, సబ్-ఎడిటర్
ఆంధ్రప్రభ, క్వీన్స్‌రోడ్, బెంగుళూర్—1.]

జానపద సాహిత్యం మన ఆచార వ్యవహారాలు, చరిత్రలకు శాసనాలు వంటివి. మనిషి లేచింది మొదలు పడుకొనే వరకూ ప్రతిపనికీ పాట మనకు వినిపిస్తుంది. ఈపాటలకు రచయితఅంటూ ఉండడు. అలా అలా ఆ నోటా ఆ నోటా ప్రచారమై క్రొత్త క్రొత్త మాండలికాలను కలుపుకొంటూ ఇవి ప్రజల నోళ్ళల్లో నిలిచి ఉన్నాయి.

జానపద సాహిత్యమనీ పల్లెపాటలనీ, ప్రజావాఙ్మయమనీ, మధుర కవితలనీ, జానపద గేయాలనీ-ఇలా రకరకాల పేర్లతో పిలవబడుతూంది. ఇందులో పాటలు, పదాలు, కథలు ఒకటేమిటి ఇలా ఎన్నో రూపాలు.

తెలుగునాడున జానపద గేయాలను సేకరించినవారు, పుస్తకాలుగా వేసినవారూ ఈ సేకరణను ఉద్యమంగా కొనసాగిస్తున్న వారూ ఉన్నారు.

నేడు జానపద సాహిత్యాన్ని—అంటే దేశీ సారస్వతాన్ని ఒకనాడు లాక్షణికులు వెలివేసినట్లు చూసినా, నేడు ఆ భావం మారింది. విశ్వవిద్యాలయాలలో కూడా దేశీ సారస్వతానికి, పల్లె పాటలకు ఆదరణ లభించింది. ఈ రోజు నవలల్లో, నాటకాలలో, సినిమాలలో జానపద ఫక్కీలో పాటల రచన ఎక్కువ అవడమే దీనిలోని మాధుర్యానికి తార్కాణం.

జానపద గేయాలను సేకరించడంలో ఓ చిక్కు ఉంది. నిజమైన జానపదగేయం వేరు. ఆ బాణిలో ఆ భాషలో ఇప్పటి రచయితలు రాసినవి, జానపద ఫక్కీలో ఎంకి పాటలు, బంగారు మామ పాటలు—అలాగే ఈ మధ్య వెలువడిన ముత్తి పదాలు, సేకరణకర్తలు ఈ విషయంలో కాలం ప్రాంతం, మొదలయిన విషయాలతో విభజనను చేసుకోవాలి.

మరొక విషయం—ఒక గేయం ఒకటి, రెండు మాండలికాల తేడాలో రెండు, మూడు ప్రాంతాలలో ప్రచారంలో ఉంది. అంటే పొట్ట చేతపట్టుకుని కూలికోసం జిల్లాలూ మండలాలూ దాటివెడితే అతడి నోట పాట అక్కడి యాస, ఓక్రొత్త మాండలికం కలిసి ప్రచారం అవుతుంది. ఇవన్నీ పరిశీలించడానికి చాలా కృషి కావాలి—ఓపిక కావాలి.

అమధ్య ఆంధ్రప్రదేశ్ పౌరసంబంధ శాఖవారు ఓ కమిటీని నెలకొల్పడం, కొంత కృషికి పథకాలు వేయడం జరిగింది. ఇలా ప్రభుత్వం, సంస్థలు కషిచేస్తే జానపద సాహిత్యం చాల మనకు దొరుకుతుంది.

"సుధా స్రవంతి" లో ముచ్చటయిన పాటలు చాలా ఉన్నాయి కోలన్న పాటలలో అందరికీ సుపరిచితమైన వరుసలో సాగే ఈ పాట చూడండి:

> సెనిగపూల సిబ్బెము దాన
> చంద్రకావె నడుము దాన
> హంసవంటి ఆడదాన్నిరా
> నా సామిరంగ
> ఆడగ నాకు సిగ్గుదోవేరా...

ఈ వరుసలో ఎన్నో పాటలు ఉన్నాయి.

అలాగే కోలన్న పాటలతో పాటు కపిలె పాటలు, యాల పదాలు శృంగార గీతికలు, వీటితో పాటు పండుగలు, సంతలు. తిరుణాళ్ళ పాటలూ ఉన్నాయి. అద్భుతరస గేయాలు, పార మార్థిక గేయాలు, స్త్రీల పాటలు—ఇలా 128 పేజీలలో 155 పాట లను పొందుపరచారు.

జానపద సాహిత్య సేకరణలో నిజాయితీ ప్రధానమయినది. 'సుధా స్రవంతి' గ్రంథకర్త కృషిలో నిజాయితీ ఉంది. గేయం ఎవరు పాడగా రాసుకున్నదీ, ఏ జిల్లాలో ఏ గ్రామంలో ఎవరిద్వారా సేకరించింది-ప్రతి గేయానికీ, పాటకీ, పదానికీ వివరణ రాయడం హర్షణీయం. గ్రామఫోన్ రికార్డులూ, ఈ దశాబ్దంలో జానపద ఫక్కీలో విరచితాలైన పాటలనూ చేర్చి స్వంత సేకరణలుగా పరిచారం చేసుకుంటూన్న నేడు ఇలాంటి మంచి కృషి జరగడం జానపద సాహిత్యోద్యమానికి ఆనందకరమైన విషయం.

ఈ పుస్తకానికి డాక్టర్ సి. నారాయణరెడ్డి పీఠిక రాశారు.

ఇలా ఆయా ప్రాంతాలలో, మండలాలలో గ్రంథస్థంకాని వేలాది పాటలను సేకరించి—ఇలా చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే పరిశోధన చేసేవారు వీటిలోని సొగసులను ఇంపు సొంపులను బైటకు తీయడం సాధ్యం.

అనేక ప్రదేశాలలో తిరిగి శ్రమించి సేకరించిన జానపద గేయాలను చాలా చౌకబారు పేపరు మీద ముద్రించడం, గెటప్ విషయంలో శ్రద్ధ కనపరచకపోవడం లోటుగానే కనిపిస్తూంది.మరి గ్రంథాలలోనైనా ఇటువంటి శ్రద్ధ తీసుకొంటే పదికాలాల పాటు గ్రంథాన్ని భద్రపరచుకోడానికి వీలుంటుంది. న్యూస్‌ప్రింటు పేపరులో ప్రచురించిన ఈ గ్రంథానికి వెల నిర్ణయించడంలో సామాన్యులకూ అందుబాటులో ఉండేలా చూడాలికదా మరి!

ఈ పుస్తకానికి బాపు ముఖచిత్రం ఒక ఆకర్షణ—అలంకరణ.

—"ఎల్లోరా"

సీరియల్ :

మహాభారతము

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

(విరాట పర్వము)

102

"అర్జునుడు, విరాట కన్య ఉత్తరకు, ఆమె సఖీజనమునకు, ఇతర సేవకురాండ్రకును నృత్య గీత వాద్యములందు శిక్షణము నిచ్చుటకు ఆరంభించెను. దీనిచేత అర్జునుడు వారికి అందరికి అభిమానపాత్రుడయ్యెను. కపట వేషములో నున్నప్పటికిని అతడు కన్యకలతో మెలగునప్పుడు సర్వదా తన మనస్సును వశములో నుంచుకొని అందరికి ప్రియమయిన పనులు చేయుచుండెను. రాజ భవనమునందు గాని, యితరత్రాగాని యెవరుగూడ నతని నిజరూప ము కనుగొనజాలకుండిరి" అని వైశంపాయన మహాముని చెప్పి తరువాత కథ జనమేజయునకిట్లు చెప్పదొడగెను.

నకులుడు విరాటు సభకు పోవుట

"జనమేజయా ! నకులుడు విరాటరాజు కడకు వచ్చెను. అతడు వచ్చుచుండగా మేఘమునుండి వెలువడిన సూర్యునివలె నుండెను. అతడు ఇక్కడక్కడ తిరుగుచు గుఱ్ఱములను చూచు చుండెను. అప్పుడు విరాటుడు తన అనుచరులతో "దేవతా సమానుడయిన యీ పురుషుడెక్కడినుండి వచ్చుచున్నాడు. మనకు తెలుపకయే మన అశ్వములను చూచుచున్నాడు. తప్పక యితడు అశ్వ విద్యలో పండితుడై యుండును. కనుక ఇతనిని శీఘ్రముగా నావద్దకు తోడ్కొని రండు" అని చెప్పెను. రాజసేవకులు తోడ్కొని వచ్చిన నకులునకు విరాటరాజుకు ఈ విధముగా సంభాషణ జరిగెను.

నకు :—"రాజా నీకు జయమగుగాక. నేను అశ్వహృదయవిద్యలో నిపుణుడను. ఈ విద్యలో నన్ను అనేక రాజులు సన్మానించినారు. మీ గుఱ్ఱములకు నేను నేర్పుగల సారధిగా నుండెదను."

విరా :—'భద్రుడా ! నీకు నేను వాహన—ధన—గృహములిచ్చెదను. నీవు నా గుఱ్ఱములకు శిక్షణనిచ్చు సారధిగా నుండవచ్చును. కాని నీవెక్కడినుండి వచ్చుచున్నావు ? ఎవని పుత్రుడవు ? ఎందులకిచ్చటికి వచ్చినావు ? నీకుగల కళా కౌశలమేమి ? ఇవన్నియు మొదట నేను తెలిసికొనదలచుచున్నాను."

నకు :—"రాజా ! పాండవ జ్యేష్ఠుడైన యుధిష్ఠిరునిచేత నేను అశ్వముల పరిరక్షణమునకై నియుక్తుడనయి యుంటిని. అశ్వముల జాతిని, వాటికి అన్ని విధములయిన శిక్షణముల నిచ్చుటను తెలిసినవాడను. దుష్టాశ్వములను సాధుమార్గములోనికి తెచ్చి వశపరచుకొను విద్యగూడ నాకు తెలియును. గుఱ్ఱముల లోపములను కనిపెట్టి వాటికి చికిత్స చేయుటగూడ నాకు బాగుగా తెలియును. నా శిక్షణ పొందిన గుఱ్ఱములకు భయముండదు. నేను శిక్షణ యిచ్చిన గుఱ్ఱములకు ఏ విధమయిన దోషములుండవు. నన్ను యుధిష్ఠిరుడు, అతని పురజనులు 'గ్రంథిక' నామముతో పిలుచుచుండిరి. దేవేంద్రునికి మాతలివలె, దశరధునికి సుమంత్రుడువలె, పరశురామునికి సుమహుడువలె నేనుగూడ నీకు రథసారథిగా నుండి నీ యశ్వములకు మంచి శిక్షణ నిచ్చెదను. యుధిష్ఠిరుని ఆజ్ఞచేత అతని లక్ష కోట్ల గుఱ్ఱములకు సంరక్షకుడనుగా నుంటిని.''

విరా :—"గ్రంథికా ! నావద్దనున్న సమస్త హయములు నీ యధీనములో నుండగలవు. నా గుఱ్ఱపు రౌతులు—సారధులు గూడ నీ వశములో నేటినుండి యుండగలరు నీకు ఈ పని చేయుటయే యిష్టమైన యెడల, నీ వేతనముగా నీకు ఎంత ధనము గావలెనో చెప్పుము. ఈ యశ్వ శిక్షణము నీకు తగిన పని కాదు. రాజువలె కనపడుచున్నావు, ఇప్పుడు నీదర్శనము యుధిష్ఠిర దర్శనము వలెనే అత్యంత ప్రీతికరముగా నున్నది, యుధిష్ఠిరుడిప్పుడు అడవిలో సేవకులు, పరివారము లేకుండ ఎక్కడ ఎన్ని యిడుములు పడుచున్నాడో

"జనమేజయా ! గంధర్వ సమానుడగు నకులుడు విరాటరాజు చేత గౌరవింపబడినవాడై అక్కడ ఉండెను. స్వేచ్ఛగా ఆ పట్టణములో తిరుగుచున్నప్పటికిని అతని నిజస్వరూపమును రాజుగాని, ప్రజలుగాని కనుగొన జాలకుండిరి. ఈ విధముగా పాండ

వులు మత్స్య దేశమునందు తమ ప్రతిజ్ఞప్రకారము ఉండుచు, అజ్ఞాతవాస కాలమును జాగ్రత్తగా గడపుచుండిరి. సమస్త భూమండలమును ఏలగల చక్రవర్తులైనను అతి కష్టములననుభవించుచుండిరి." అని వైశంపాయన మహాముని చెప్పిన కథను జనమేజయ మహారాజు విని యిట్లు అడిగెను :—

"బ్రహ్మర్షీ ! ఇట్లు పాండవులు ప్రచ్ఛన్నముగా మత్స్య నగరమునందు ఎట్లుండిరి?" ఆ మాటకు వైశంపాయన ముని ఇట్లు చెప్పెను :—

"రాజా ! పాండవులు గుప్త వేషములో విరాటరాజును సేవించుచు, తర్వాత బిందుమహాముని యనుగ్రహము వలనను, యమధర్మరాజు వరముచేతను విరాట నగరమునందు ఎవరికిని నెరుక పడకుండ నివసించుచుండిరి. యుధిష్ఠిరుడు మత్స్య భూపతి సభలో సభ్యుడుగా నుండి, విరాటరాజుకు, అతని పుత్రులకు జూదమునందు వినోదము కలిగించుచుండెను ఆ విద్యయందు పాచికలను, త్రాటితో గట్టి పక్షులను ఆడించినట్లు, తన యిష్టము వచ్చినట్లు ఆడించుచుండెను. అతడు ద్యూతమునందు గెలిచిన ధనమును రహస్యముగా తమ్ములకు, వారి వారికి తగినట్లు పంచి యిచ్చుచుండెను. భీమసేనుడుగూడ అనేక విధములయిన భక్ష్య భోజ్యములను, అతనికి మత్స్యరాజు బహుమానముగా నిచ్చినవాటిని విక్రయించి ఆ ధనమును యుధిష్ఠిరునకు అర్పించుచుండెను. అంతఃపురమునందు లభించిన జీర్ణ వస్త్రములను అర్జునుడుగూడ విక్రయించి పాండవులందరికి నిచ్చుచుండెను. సహదేవుడుగూడ గోపాల వేషముతో పాలు పెరుగు అన్నలకు ఇచ్చుచుండెను. అశ్వ శిక్షణ కార్యమునందు బహుమానముగా లభించిన ధనమును నకులుడుగూడ పాండవుల కిచ్చుచుండెను, ద్రౌపది తన పతుల నందరిని జాగ్రత్తతో చూచుకొనుచు, ఇతరులకు ఎరుక పడకుండ సంచరించుచుండెను ఈ విధముగా పాండవులు పరస్పరము సహకరించుకొనుచు విరాట నగరమునందు గుప్తముగా మాతృగర్భమునందున్నట్లు సుఖముగా నుండిరి. దుర్యోధనుని వలన భయమును శంకించుచున్నవారై పాండవులు ద్రౌపదిని జాగ్రత్తతో కనిపెట్టుచు రహస్యముగా సంచరించుచుండిరి

"ఇట్లుండగా, వారు అక్కడికి పోయిన తరువాత నాల్గవ మాసమునందు బ్రహ్మదేవుని ఉత్సవము అక్కడ జరిగెను మత్స్య దేశ ప్రజలకీ యుత్సవము అతి ప్రియమయినది. జనమేజయా ! ఆ యుత్సవ సమయమునందు విరాట నగరమునకు నలు దిక్కులనుండి కుస్తీలు పట్టుటకు మల్లయుద్ధ విశారదులు వేలకొలదిగా వచ్చుచుండిరి ఆ సమయమునందు, బ్రహ్మదేవుని సభవలె, శివుని సభవలె ఆ విరాట రాజధానిలో ప్రజలు గుంపులు గుంపులుగా సభదీర్చి సమావేశములు జరుపుచుండిరి.

"అక్కడికి మల్ల యుద్ధము చేయుటకు వచ్చిన, మహాకాయులు, మహా బలవంతులు 'కాల ఖంజులు' అను పేరుగల రాక్షసులవలె, శౌర్యోన్మత్తులై, రాజుచేత సన్మానింపబడుచున్న వారలై, సింహ బలము గలిగినవారలై యుండిరి. వారు అనేక పర్యాయములు విరాటరాజు సమక్షమునందు విజయమును పొందిన వారుగా నుండిరి.

భీముడు జీమూతమల్లుని వధించుట

ఆ మల్లులలోనొకడు మహామల్లుడు ఉండెను. అతడు ఇతర మల్లులనందరిని తనతో కుస్తీపట్టుటకు ఆహ్వానించుచుండెను. మల్లయుద్ధరంగమునందు అతడు నిలవగానే యతనిని ఎదుర్కొని కుస్తీ పట్టుటకు ఏ మల్లుడుగూడ సాహసించి ముందుకు రాజాలకుండెను. అప్పుడు విరాటరాజు తన వంటల వానిని (భీముని) పిలిపించి యావీరునితో కుస్తీ పట్టింపదలచెను. రాజుపిలువగానే భీముడు తన స్వరూపము బయట పడునను భయముచేత, ముందుకు వచ్చుటకు జంకుచుండెను. తుదకు రాజాజ్ఞచేత యుద్ధరంగమునకు శార్దూలగమనముతో గంభీరముగా వచ్చి విరాటునకు నమస్కరించి నిలిచెను. కక్షను (లంగోటీని) బిగించెను. 'జీమూత' నామము గల, పరాక్రమశాలియైన యామల్లుని తొడగొట్టి పిలిచెను. అప్పుడు జనులు సంతసించిరి.

మల్ల యుద్ధక్రమము

"ఆ యిరువురికి పరమోత్సాహము, భయంకర పరాక్రమము, మహాకాయము ఉండెను. అరువదియేండ్ల యీడు గల మదపు టేనుగులవలె వారు ప్రకాశించుచుండిరి. 'ఆ యిరువురు నర శ్రేష్ఠులు బాహు యుద్ధమునకు తలపడిరి పరస్పర జయకాంక్షతో పోరాడుచుండిరి. ఒండొరులు కొట్టుకొను దెబ్బలధ్వని, పర్వతము-పిడుగు' ఒండొంటిని కొట్టుకొని నప్పుడు వెడలుచట పట శబ్దముల వలె భయంకరముగా నుండెను. అతి బలులైన యిరువురు స్వీయబలగర్వముల చేత మిక్కిలి సంతోషించుచుండిరి. ఒకరి పై నొకరు దెబ్బతీయుటకు అవకాశమును కనిపెట్టుచు నిరువురు విజయాభిలాషతో పోరాడుచుండిరి. మదగజములవలె దెబ్బకు మారుదెబ్బతీయుచు, ఒకరిపట్టును మరియొకరు విడిపించుకొనుచు, ఒకని పిడికిలి మరియొకడు పట్టి బిగించుచు నొండొరులను వివశులను చేయుచుండిరి. విచిత్రముగా కొట్టుకొనుచుండిరి. 'ప్రమాథ-ఉన్మథనము' లతో పోరాడుచుండిరి ప్రమాథమనగా, 'భూమిపైన పడవేసి అదిమి నలగొట్టుట. ఉన్మథనమనగా, 'లేచి నిలబడి అవయవములను—గట్టిగా నలగగొట్టుట' అని యర్థము. క్షేపణము, (హఠాత్తుగా ఉన్నచోటినుండి దూరముగా విసరివేయుట) లతోను ముష్టులతోను (ముష్టియనగా, మల్లయుద్ధమునందు ఒండొరుల పిడికిలితోను ఒండొరులరొమ్మును గ్రుద్దుటయని యర్థము). వరాహూద్ధ విన్యాసముల చేతను (అనగా ఒండొరుల భుజములపైనున్న యొండొరులను క్రిందుముఖముగా చేసి గిరగిర త్రిప్పుచునేల పైన కొటి నప్పటి ధ్వనియని అర్థము) 'వజ్రనిపాత తల' ములచేతను. (అనగా, బొటనవేలు చూపుడు వేలుమధ్య భాగమునందు ఒండొరుల పట్టుకొని కరతలములను కొట్టుట యనియర్థము). ప్రసృష్టుల చేతను అనగా, చేతివ్రేళ్ళను విడివిడిగా దూరము చేసి యొండొరులు కొట్టుకొనుట యనియర్థము) పోరాడుచుండిరి. నఖములతో బరుకు కొనుచుండిరి. పాదముల చేతకొట్టుకొనుచు మోకాళ్ల లోతలను ఇరికించి కొట్టుకొనుచునుండిరి. ఆదెబ్బలు రెండు పాషాణములు కొట్టుకొనుచున్నట్లుగా అతిభయంకరముగ నుండెను.

(సశేషం)

జిల్లావార్తలు



గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పి. శేషావతారం నల్లజర్ల సమితిలోని ఆంధ్రాబ్యాంకు శాఖకు డిశంబరు 6న ప్రారంభోత్సవం చేశారు. శాసన సభ్యుడు శ్రీ యాలి ఆంజనేయులు కూడా చిత్రంలో వున్నారు.

కొత్తహాస్టల్ భవనానికి గవర్నరుచే ప్రారంభోత్సవం

నల్లగొండజిల్లా మిర్యాలగూడాలో 57 వేల రూపాయల ఖర్చుతో నిర్మించిన గిరిజన బాలుర కొత్త హాస్టల్ భవనానికి రాష్ట్ర గవర్నరు శ్రీ ఆర్. డి. భండారే డిసెంబరు 25వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్లో ఉండేవారికి కేవలం వసతి సౌకర్యాలు కల్పించడానికి విద్యా సంబంధమైన విజ్ఞానాన్ని అందించడానికి మాత్రమే తమ కార్యకలాపాలను పరిమితం చేసుకోకుండా హాస్టల్ వాసులు ప్రయోజనకరమైన పౌరులుగా రూపొందటానికి అవసరమయ్యే బహుముఖాభివృద్ధికి దోహదం చేసే కార్యకలాపాలను కూడా హాస్టళ్ళు జరిపిస్తూ ఉండాలని అన్నారు.

శ్రీమతి శకుంతలాబాయి భండారే 23 లక్షల 47 వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన రుణమంజూరీ పత్రాలను 657 బలహీన వర్గాలవారికి పంపిణీ చేశారు. మత్స్య శాఖ సరఫరా చేసిన నైలానువలల్ని 127 మంది బెస్తలకు అందజేశారు. ఇంకా ఆమె ఇళ్ళస్థల పట్టాలను, మిగులు భూముల పంపకానికి సంబంధించిన పట్టాలను, నివాస స్థలాలపై యాజమాన్యపు హక్కులకు సంబంధించిన పట్టాలను కూడా పంపిణీ చేశారు.

గండి పడిన రోడ్లు—మంత్రి తనిఖీ

పి. డబ్ల్యు. డి. మంత్రి శ్రీ సి. హెచ్. వెంకట్రావు, కావలిలో డిసెంబరు 5న మాట్లాడుతూ యిటీవలి తుఫానువల్ల బాగా దెబ్బతిన్న రోడ్లన్నిటినీ ఆలస్యం లేకుండా వెంటనే మరమ్మతు చేస్తారని అన్నారు. నెల్లూరు నుండి ఒంగోలు వెళుతూ గండిపడిన రోడ్లను ఆయన తనఖీ చేశారు. వెంటనే మరమ్మతు పనులను చేపట్టాలని పి. డబ్ల్యు. డి. అధికారులను ఆదేశించారు. ఒంగోలు, నెల్లూరు జిల్లాలో తుఫానువల్ల దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు ప్రత్యేక గ్రాంట్లు యిస్తారని మంత్రి అన్నారు.


పంచాయతీసమితి మాజీ అధ్యక్షుడు శ్రీ కె. యానాదిరెడ్డి, మంత్రికి నష్టాన్ని గూర్చి వివరిస్తూ ఈ తుఫానువల్లపంట పూర్తిగా దెబ్బతిన్నదని అందువల్ల వారికి తక్కావీ గ్రాంట్లు, ఎరువులు మంజూరు చేయాలని అన్నారు.



చర్మ వ్యాధులు, లైంగిక, కుష్టువ్యాధుల చికిత్సా నిపుణుల సంఘం 3వ వార్షిక మహాసభకు ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు అక్టోబరు 17న కాకినాడలో ప్రారంభోత్సవం చేశారు.

ముఖ్యమంత్రిచే లంబాడీలకు రుణాల పంపిణీ

ముఖ్యమంత్రి శ్రీ జె. వెంగళరావు డిసెంబరు 15వ తేదీన నిజామబాదు జిల్లా మంచిప్పలో బంజారా మహాసభలో ప్రసంగిస్తూ లంబాడీలకు విద్యా సౌకర్యాలు కల్పించడానికి వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఆశ్రమ పాఠశాలలను ప్రారంభిస్తారని అన్నారు. ప్రస్తుతం ఖర్చు చేస్తున్న మూడు శాతానికి బదులుగా నాలుగు శాతం పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్ బడ్జెట్లనుండి లంబాడీలు, ఇతర అప్రకటిత కులాల అభ్యున్నతికి కేటాయిస్తారని అన్నారు. భారతదేశంలో ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లోనే శాసనమండలికి ఒక లంబాడీని సభ్యునిగా నామినేట్ చేశారని ఆయన పేర్కొన్నారు.



నెల్లూరు టౌన్ హాలులో డిసెంబరు 6న వి. ఆర్. కళాశాల జాతీయ సేవాపథక దళం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు.

శాసన సభ్యులు, వ్యవసాయ పరిశ్రమల కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీ ఎమ్. నారాయణరెడ్డి ప్రసంగిస్తూ అన్ని విధాలైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించడానికి వీలుగా తమ తండాలన్నిటిని ఏకంచేసి ఒక పెద్ద కాలనీగా ఏర్పాటు చేసుకోవాలని లంబాడాలకు విజ్ఞప్తి చేశారు.

పెన్నానదిపై లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన

మధ్య తరహా నీటిపారుదల శాఖామంత్రి శ్రీ వి. కృష్ణమూర్తి నాయుడు, డిసెంబరు 25వ తేదీన కమలాపురం నియోజకవర్గం లోని వల్లూరు వద్ద పెన్నానదిపై లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల సంస్థ ఆధ్వర్యంలోని ఈ పథకం వల్ల ఖరీఫ్ కాలానికి 1362 ఎకరాలకు వల్లూరు, బాలయ్యపల్లె, కొత్తపల్లి, గాలివారిపల్లి, కొత్తూరు, గ్రామాలలో ప్రయోజనం కలుగుతుంది. మంత్రి శ్రీ కృష్ణమూర్తినాయుడు వల్లూరులో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతూ ప్రభుత్వంతో రైతులు సహకరించినట్లయితే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను ప్రారంభించేందుకు భూగర్భ నీటి వనరులను వెలికి తెచ్చి నీటి పారుదల సౌకర్యాలను పెంచేందుకు సంసిద్ధంగా వున్నదని తెలియజేసారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్థిక, సమాచార శాఖామాత్యులు శ్రీ పి. రంగారెడ్డి ప్రసంగిస్తూ రాయలసీమకు నదీజలాల సరఫరా విషయమై యోచిస్తున్నదని ఈ విషయంలో కేంద్రం నుండి అనుమతి కోసం వేచియున్నదని అన్నారు. భూగర్భ నీటిని వెలికి తెచ్చి నీటిపారుదల వనరులను సౌకర్యాలు లేనిచోట లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు చేపట్టి కృషిచేయవలసిందని రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధిసంస్థను కోరారు.

శాసన సభ్యుడు శ్రీ ఆర్. సీతారామయ్య, అంతకుముందు మంత్రికి ఒక విజ్ఞప్తి చేస్తూ 6 సూత్రాల పథకం క్రిందగాని, క్షామపీడిత ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమము క్రిందగాని, ఆయకట్టు రోడ్లను వేయవలసిందని కోరారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు శ్రీ ఎ.పి. రంగనాథస్వామి సభికులకు స్వాగతం చెప్పారు.

ప్రకాశం జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి


ఆర్థిక, సమాచార శాఖ మంత్రి, శ్రీ పిడతల రంగారెడ్డి డిసెంబరు 27వ తేదీన ఒంగోలులో ప్రకాశం జిల్లా పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన తీవ్రతర ఉద్యమానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానికంగా లభించే వనరులతో పరిశ్రమలను అభివృద్ధిపరచేందుకు ఒక సమగ్రమైన ప్రణాళికను రూపొందించ వలసిందిగా పరిశ్రమలశాఖ అధికారులను కోరారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లఘుపరిశ్రమల శాఖమంత్రి శ్రీ వై. నారాయణస్వామి మాట్లాడుతూ, ప్రకాశం జిల్లాలో సోడా గ్యాస్ కర్మాగారాన్ని, నెలకొల్పడానికి తాను గట్టిగా ప్రయత్నిస్తానని అన్నారు. యీ జిల్లాలో విద్యుచ్ఛక్తి ట్రాన్స్‌ఫార్మర్లు ఇనుప కనిజానికి సంబంధించిన కర్మాగారాలు నెలకొల్పడానికి గల అవకాశాలను తానుపరిశీలించగలనని కూడా ఆయన తెలియజేశారు.


పునరావాస శాఖ మంత్రి శ్రీమతి ఎం. లక్ష్మీదేవి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు అన్నిస్థాయిలలోను తోడ్పడవలసినదని పరిశ్రమల శాఖ అధికార్లను కోరారు.

చిన్నతరహా పశువైద్యశాలకు ప్రారంభోత్సవం

చక్కెర పరిశ్రమలు, వెనుకబడిన తరగతుల శాఖామాత్యులు, శ్రీ కె. బి. నరసప్ప పెనుకొండవాసులైన శ్రీయుతులు రామలింగయ్య చెట్టి, రామచంద్రయ్య చెట్టి విరాళంగా యిచ్చిన రోడ్డాంలోని చిన్నతరహా పశువైద్యశాల భవనానికి డిసెంబరు 7వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన



చిన్నకోటలో పారిశ్రామిక దినోత్సవం, సుమారు 100 మంది సగర్లు, హరిజనులు ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీ కె. గణపతిరావు పర్యవేక్షణలో శ్రమదానంచేసి మట్టిరోడ్డు నిర్మించారు.



ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు డిశంబరు 14న నిజామాబాద్ జిల్లా కోస్తి గ్రామవాసి నుండి ముఖ్య మంత్రి విరాళం స్వీకరిస్తున్న దృశ్యం.

ఈ ఆసుపత్రి వారి సంక్షేమానికి ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు అభివృద్ధి కార్యక్రమాలకు తమ సహకారాన్ని అందించి ప్రభుత్వానికి చేయూత నియ్యాల్సిందిగా గ్రామస్తులకు ఆయన విజ్ఞప్తి చేశారు. శాసన సభ్యులు శ్రీ ఓబయ్య అధ్యక్షత వహించారు.

వినియోగదార్ల సమస్యలపై చర్చాగోష్ఠి

ఆర్థిక సమాచార, శాఖ మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి, డిసెంబరు 19న తిరుపతిలో చిత్తూరు జిల్లా వినియోగదార్ల సమస్యలపై చర్చాగోష్ఠికి ప్రారంభోత్సవం చేస్తూ వ్యాపారంలో సంఘ వ్యతిరేక శక్తులను అరికట్టడానికి వినియోగదార్ల మండలులు ఉద్యమ ప్రాతిపదికపై కృషి జరపాలని అన్నారు 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంలో అత్యవసర వస్తువుల ధరల అదుపు, ఉత్పత్తి, పంపిణీ వినియోగాల క్రమబద్ధీకరణ ప్రధానాంశంగా వుందని మంత్రి అన్నారు.

ఆదిలాబాద్ జిల్లా సహజ వనరులు

ముఖ్యమంత్రి శ్రీ జె వెంగళరావు, 1976 డిసెంబరు 17వ తేదీన ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో బ్రహ్మాండమైన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, ఆదిలాబాదు జిల్లాలో సహజవనరులు అపారంగా ఉన్నాయని వాటిని పూర్తిగా వినియోగించుకోవలసిన అవసరం ఉన్నదని అన్నారు. ఈ జిల్లాను వ్యవసాయ పరంగానే కాకుండా పారిశ్రామికంగా కూడా అభివృద్ధి పరచాలి. అది వెనుకబడి ఉండటానికి వీలులేదు. వాస్తవానికి రాష్ట్రంలోని ఏ ప్రాంతాన్ని వెనుకబడిన ప్రాంతంగా వ్యవహరించరాదు లభించే సహజ వనరుల నన్నింటిని పూర్తిగా వినియోగించుకోవడానికి తీవ్రంగా కృషి చేస్తూనే ఉన్నామని ఆయన అన్నారు

సభకు అధ్యక్షత వహించిన రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పి నర్సారెడ్డి ప్రసంగిస్తూ ప్రస్తుతం 80,000 పైగా పిల్లలు సౌకర్యాలను అనుభవిస్తున్నారని అన్నారు.


మధ్యతరహా నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ వి కృష్ణమూర్తి నాయుడు, ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, ఈ ప్రాంతంలో వివిధ కార్యక్రమాలను అమలు జరిపిన తర్వాత, ఆదిలాబాదు జిల్లా కృష్ణా జిల్లాకన్న కూడా ఎక్కువ సౌభాగ్యవంతం అవుతుందని అన్నారు.

తుఫాను బాధిత గ్రామాలలో మంత్రి పర్యటన


వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ చొక్కారావు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలలో తుఫాను బాధిత గ్రామాలలో పర్యటించిన తరువాత డిసెంబరు 7వ తేదీన, ఆపదలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకొని సకాలంలో సత్వరం సహాయక చర్యలు తీసుకుంటుందని అన్నారు.

తుఫాను బాధిత ప్రాంతాలలో రైతుల నుండి నాణ్యతగల వరిధాన్యం కొనుగోలు విషయంలో కొన్ని రాయితీలను ఆహార సంస్థ యిస్తుందని మంత్రి అన్నారు. ఈ సంవత్సరం వరిధాన్యం నాణ్యత విషయంలో కొన్ని రాయితీలు యివ్వాలని ముఖ్యమంత్రి కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మిల్లర్లు రైతుల నుండి సరసమైన ధరలకు ధాన్యం కొనుగోలు చేసే విషయాన్ని కలెక్టర్లు ఒక కంట కనిపెట్టి ఉంటారని అన్నారు

సహకార శాఖ మంత్రి శ్రీ బి. సుబ్బారావు ప్రసంగిస్తూ స్వల్పకాలిక ఋణాలన్నిటినీ మధ్యకాలిక ఋణాలుగా మారుస్తారని, రాబీ పంటకు వ్యక్తిగత పరపతి పనులను సడలిస్తారని అన్నారు.



బోధన్‌లో ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు స్థానిక మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.



డిశంబరు 14న ముఖ్యమంత్రి శ్రీ జె. వెంగళరావు నిజామాబాద్ జిల్లా శతాబ్దిపూర్తి స్మృతి చిహ్నాన్ని ఆవిష్కరించారు. విద్యుచ్ఛక్తి శాఖ మంత్రి శ్రీ జి రాజారాం, కలెక్టరు శ్రీ టి. వి. ఆనంద్ ప్రభృతులు చిత్రంలో వున్నారు.

ఇటీవలి తుఫానులో దెబ్బతిన్న చెరువులు, రోడ్ల మరమ్మతు :

రెవిన్యూశాఖ మంత్రి శ్రీ పి. నర్సారెడ్డి డిసెంబరు 6న కాకినాడలో జరిగిన తూర్పుగోదావరి జిల్లా శాసనసభ్యులు, అధికారుల సమావేశంలో ప్రసంగిస్తూ, కార్మికులకు ఉపాధి కల్పించడానికి వీలుగా ఇటీవలి తుఫానులో దెబ్బతిన్న రోడ్లు, చెరువుల మరమ్మతును వెంటనే చేపట్టాలని అన్నారు. ఆపదలోనున్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, వారి బాధలను తీర్చడానికి అవసరమైన చర్యలన్నిటినీ తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

శాసనసభ్యులు శ్రీ కుడిపూడి ప్రభాకర్‌రావు ప్రసంగిస్తూ, లేవీని రద్దు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు

శాసనసభ్యులు శ్రీ సి. వి. కె రావు, ప్రసంగిస్తూ, కాకినాడ పట్నంలో సకాలంలో సహాయక చర్యలు తీసుకున్నందుకు కలెక్టరును, రెవిన్యూ అధికారులను అభినందించారు.

నెల్లూరులో రక్తదాన ప్రదర్శన

నెల్లూరులోని వి. ఆర్. కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం యూనిట్ అమెరికన్ ఆసుపత్రి సహకారంతో డిసెంబరు 6న నెల్లూరు టౌనుహాలులో రక్తదాన ప్రదర్శనను నిర్వహించారు. ఇటువంటి ప్రదర్శన జరగడం అపూర్వమైన విషయం. వి ఆర్. కళాశాలలోని కుమారి ఇ. పయాశ్వని పి, నరసింహం వందలాది మంది ప్రేక్షకుల ముందు రక్తదానం చేశారు. శాసనసభ్యులు పురప్రముఖులు వారిని అభినందించారు.

గిరిజన సమ్మేళనానికి మంత్రి ప్రారంభోత్సవం


వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ కోదాటి రాజమల్లు, డిసెంబరు 1న ఆదిలాబాదుజిల్లా, చిన్నూరు తాలూకా దంపూర్‌లో రూ. 1,00 000 ఖర్చుతో సేకరించిన మామిడి మొక్కలను నాటడం ద్వారా గిరిజన సమ్మేళనానికి ప్రారంభోత్సవం చేశారు.

మంత్రి యీ సందర్భంగా ప్రసంగిస్తూ, గిరిజన సమస్యలను చర్చించడం మాత్రమే కాక మామిడితోటను పెంచే సమస్యను కూడ చర్చించడానికి యీ సమ్మేళనం ఉద్దేశించబడిందని అన్నారు. మొక్కను పసిపాపలను పెంచిన మాదిరిగా పోషించాలని, అతి జాగ్రత్తతో వాటిని చూడాలని గిరిజనులను ఉద్బోధించారు. గిరిజనుల భవిష్యత్తు యీ తోటపై ఆధారపడి ఉంది పట్టా సర్టిఫికేట్లను వ్యవసాయ పరికరాలను మంత్రి పంపిణీ చేశారు.

జిల్లాకలెక్టరు శ్రీ సి. డి అరోహ ఉత్సవానికి అధ్యక్షత వహిస్తూ, సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ యీ మామిడితోటను మంజూరుచేసిందని, ఇది ఒక అపూర్వమైన ప్రయోగం అని అన్నారు.

హరిజన ఇళ్ల కాలనికి ప్రారంభోత్సవం

హరిజన సంక్షేమం, మార్కెటింగ్ శాఖ మంత్రి శ్రీ పి. మహేంద్ర నాథ్, డిసెంబరు 6వ తేదీన హైదరాబాదు జిల్లా ఆల్వాల్‌లోని సుభాష్‌నగర్‌లో జీవిత భీమా పథకం క్రింద రూ. 13,200ల ఖర్చుతో నిర్మించిన 24 ఇండ్లతో కూడిన హరిజన కాలనీకి ప్రారంభోత్సవం చేస్తూ, చిన్న తరహా ఇండ్ల సహకార సంఘాల పథకం క్రింద డబ్బు చెల్లించలేని షెడ్యూలు కులాలు, వెనుకబడిన తరగతి ప్రజలకు వాటాధనం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ఈ పథకం క్రింద రూ 66,000 హరిజన కుటుంబాలకు ఇండ్ల సౌకర్యం కల్పించడానికి రూ. 10 కోట్లు ఖర్చు చేశారని అన్నారు, కాలనీలలో ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



డిసెంబరు 14 వ ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు మంచిప్ప గ్రామంలో జరిగిన బంజారా మహాసభలో శాసన సభ్యులు డా. వి. చక్రధరరావు, శాసనమండలి సభ్యులు, శ్రీ అమర్ సింగ్‌రాథూర్, బంజారా గురువు శ్రీరామారావు మహరాజ్ పాల్గొన్నారు. ప్రసంగిస్తున్నవారు శ్రీ మోజీరామ్, లంబాడా నాయకులు.



అర్థిక, సమాచార శాఖ మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి విద్యా సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ ఎం. వి. కృష్ణారావు జనవరి 4న కైకలూరు తాలూకా గాజులపాడు గ్రామంలో తుఫానుకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న దృశ్యం.

విన్నకోట హరిజన, నగరుల ఆదర్శ కృషి

గుడివాడ పంచాయతీ సమితిలోని విన్నకోట గ్రామంలో పారిశ్రామిక దినోత్సవం సందర్భంగా హరిజన వాడకు వెళ్ళే నగర్లు మట్టి రోడ్డు శ్రమదానం ఏర్పాటు చేసినారు

శాసనమండలి మాజీ సభ్యులైన శ్రీ ఘంటా కృష్ణమూర్తి గారు యీ రోడ్డుకు ప్రారంభోత్సవము చేస్తూ హరిజనులు, నగర్లు సంఘీభావముతో సమిష్టిగ యీ రోడ్డును ఏర్పాటు చేసినందుకు అభినందిస్తూ, మారుతున్న కాలానికి అనుగుణ్యంగా అభివృద్ధి పథంలో సమైక్యంగా అందరు పాల్గొనవలెనని హితవు పలికినారు.

తుఫాను సహాయనిధి

కడప జిల్లా సిద్ధవటం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల "సాంఘిక సేవాసంఘ", విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు శ్రీయస్. సూర్యనారాయణ, యస్ ఇషాక్, ప్రధానోపాధ్యాయుడు శ్రీ పి. వెంకట సుబ్బయ్యగార్ల సహాయ సహకారముతో గ్రామములో తిరిగి రూ. 100.41లు విరాళాలు వసూలు చేసి ముఖ్యమంత్రి తుఫానుబాధితుల సహాయనిధికి 13-12-76 న బ్యాంకు డ్రాఫ్టు ద్వారా పంపారు.

ఆంధ్ర ప్రదేశ్ కేంద్ర భూమి అభివృద్ధి బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శ్రీ బి రత్న సభాపతి యిటీవల జపాను వెళ్ళి వచ్చిన సందర్భంగా వారి పర్యటన అనుభవాలను విశదీకరించు నిమిత్తమై కడప జిల్లా సిద్ధవటంలో వ్యవసాయాభివృద్ధి బ్యాంకు పాలక వర్గము వారు ది. 14-12-76 సాయంత్రము 5 గం॥లకు ఒక బహిరంగ సమావేశాన్ని యేర్పాటు చేశారు.

పై సమావేశానికి స్టేట్ బ్యాంకి బ్రాంచి మేనేజరు శ్రీ యం. వి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు శ్రీ రత్న సభాపతి తమ పర్యటనానుభవాలను తెల్పారు.



డిసెంబరు 14 వ ముఖ్య మంత్రి శ్రీ జలగం వెంగళరావు సుభాష్ నగర్ (నిజామాబాద్) లో ఎన్. జి వో౦ కాలనీకి శంకుస్థాపన చేసిన అనంతరం ప్రసంగిస్తున్న దృశ్యం



డిసెంబరు 25 వ తేదీన యువజన నాయకుడు శ్రీ సంజయ్‌గాంధీ ఖమ్మంజిల్లా లో పర్యటించిన దృశ్యం

PRINTED BY THE DIRECTOR OF PRINTING GOVERNMENT OF ANDHRA PRADESH AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION & PUBLIC RELATIONS ANDHRA PRADESH, HYDERABAD

స్వీయ చరిత్ర ఆధారంగా - బుజ్జాయి



(సశేషం)

